M.B01 H 130 C

స్వాతంత్ర్యోత్తర భారతీయ కవిత

తెలుగు కవితా సంపుటి

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

01

M.B01H 130
H:-7.9
ట్,-5.5


స్వాతంత్ర్యోత్తర భారతీయ కవిత

తెలుగు కవితా సంపుటి

సంకలన కర్తలు :

విశ్వనాథ సత్యనారాయణ

బాలాంత్రపు రజనీకాంతరావు



నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
న్యూ ఢిల్లీ

1974

(c) హక్కులు కవులవి 1973

Rs 4-00

ANTHOLOGY OF INDIAN POETRY (Telugu)

డిస్ట్రిబ్యూటర్సు :
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు
రాష్ట్రపతి రోడ్డు
సికింద్రాబాదు.

Published by the Director, National Book Trust, India, New Delhi-16
and Printed at Swatantra Art Printers, Vijayawada-520004.

మొదటిభాగము

పంకలవం :

విశ్వనాథ సత్యనారాయణ

విషయసూచిక

తొలిపలుకు

మొదటి భాగము

సంకలనం:
(విశ్వనాథ సత్యనారాయణ)

మోక్షగామి	డా॥ ఎస్. వి. జోగారావు	1
ఉత్సలమాల	డా॥ ధూళిపాళ శ్రీరామమూర్తి	5
ఆవిష్కృతి	డా॥ కె. సుప్రసన్నాచార్య	7
హేమమాలి	డా॥ చాగంటి గోపాలకృష్ణమూర్తి	10
వాంఛానుమితి	కోవెల సంపత్కుమారాచార్య	13
ఋతుహేల	పేరాల భరతశర్మ	18
భూపాల రాగము	మల్లాది వసుంధర	21
మాతృశ్రీ	విశ్వనాథ వెంకటేశ్వరులు	25
జయోస్తు	జంధ్యాల పాపయ్యశాస్త్రి	27
శాంతి	దాశరథి	30
తిష్యరక్షిత	కరుటూరి సత్యనారాయణ	33
గోపికా నౌక	మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి	36
విషాద మోహనము	నాయని సుబ్బారావు	40
పరివ్రజనము	ద్వివేది సత్యనారాయణసూరి	45
పద్మినీ భాస్కరము	మోటూరి వెంకటరావు	47

కవి గండ పెండేరము	పైడిపాటి సుబ్బరామశాస్త్రి	50
చంద్రయాత్ర	ముదిగొండ వీరభద్రమూర్తి	57
విజ్ఞప్తి	డా॥ ప్రసాదరాయ కులపతి	61
పృథ్వీ భాగవతము	బీర్నిడి ప్రసన్న	65
వసంత వైభవము	బంధ్యాల జయకృష్ణ ప్రసాద్	68
కోకిల	గంధం సుబ్బారావు	71
ఆదికవి ఆవేదన	పాలపర్తి శ్యామలానంద ప్రసాద్	73
మానవ	రావికంటి వసునందన్	76
వసంతము	నోరి సత్యనారాయణ	78

రెండవ భాగము

సంకలనం:
(బాలాంత్రపు రజనీకాంతరావు)

విశ్వస్వస్తి	దేవులపల్లి కృష్ణశాస్త్రి	81
అమరజ్యోతి	తుమ్మల సీతారామమూర్తి చౌదరి	83
గుడిగంటలు	కాటూరి వెంకటేశ్వరరావు	95
అఖండ గౌతమి	గుఱ్ఱం జాషువా	108
సరస్వతీ సాక్షాత్కారము	పుట్టపర్తి నారాయణాచార్య	112
శరచ్చంద్రిక	శ్రీశ్రీ	116
అమృతం కురిసిన రాత్రి	బాలగంగాధర తిలక్	128
'హే భగవాన్'	డా॥ సి. నారాయణరెడ్డి	130
విశాఖలేఖ	జె. బాపురెడ్డి	132
ఏసంగి పొద్దులు	రంధి సోమరాజు	143
కవుల పరిచయము		159

తొలిపలుకు

తెలుగులో ఈ ఆధునిక కవితా సంకలనం రెండు భాగాలను ఇద్దరు సంకలన కర్తలు స్వతంత్రంగా వేరు వేరుగా ఏర్చి కూర్చారు. ఇద్దరూ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ద్వారా విశిష్టత సంపాదించిన వారు, డా॥ విశ్వనాథ సత్యనారాయణ 1962 లోను, శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు 1961 లోను.

డా॥ విశ్వనాథ తెలుగు సాహితీ రంగంలోని సాంప్రదాయిక విద్వాంసుల కోవలో అగ్రశ్రేణికి చెందిన వారిలో ఒకరు. 1971 వ సంవత్సరపు భారతీయ జ్ఞానపీఠ బహుమతిని పొందిన వారు. అంతకు పూర్వమే రాష్ట్రపతి ద్వారా పద్మభూషణ బిరుదం స్వీకరించారు.

భావధారలో వస్తువులో భారతీయత ఏమాత్రమూ చెడకుండా, రచనా విధానంలో ప్రాచీన కావ్యమర్యాదలను తు. చ. తప్పక పాటించే విశ్వనాథ వారి సాహితీ వృక్షం వైదిక, ఐతిహాసిక, పౌరాణిక సంస్కృతి క్షేత్రంలో లోతుగా వేళ్లు పాతుకు పోయింది. అందుచేత, శ్రీ విశ్వనాథ సమకూర్చిన ఈ మొదటి భాగంలోని కవులందరూ సంకలనకర్త అభిప్రాయాలకూ, ఆదర్శాలకూ అనుగుణంగా గ్రాంథిక భాషలో సంప్రదాయబద్ధమైన ఛందస్సులలో వ్రాసిన వారే,- ఉన్న ఒక్క కవయిత్రీ కొద్దిగా వ్యావహారికానికి అవకాశం ఇస్తూ వచ్చిన కవిత చెప్పారు. కాని, ఈ పాతిక మందిలో కనీసం ఏడుగురు సమకాలిక సామాజిక పరిస్థితుల నుంచే తమ యితివృత్తం

స్వీకరించారు. శ్రీ విశ్వనాథ వేంకటేశ్వర్లు దర్శించిన "మాతృశ్రీ"- సర్వ ప్రపంచ సంస్కృతులకు మాతృశ్రీయై మూర్తీభవించిన ప్రాచీనార్ష సంస్కృతి, భరతమాతయే- ఎన్ని సంక్షోభాలూ, విప్లవాలూ వచ్చినా తన అనంత క్షమాశీలంతో తన ప్రాచీన వైభవాన్ని తిరిగి నెలకొల్పుకోగలదని ఆయన విశ్వాసం. డా॥ భూమిపాళ శ్రీరామ మూర్తి గారి ఉత్సలమాల ఆంధ్రుల అభిమాన నాయకుడైన ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు సాహసిక త్యాగమయ జీవితానికి నివాళిగా అనర్గళ ధారాశుద్ధితో గుచ్చిన పద్యప్రసూనమాల. శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి 'కరుణశ్రీ' నూతన సంవత్సరానికి స్వాగతం సూక్తం పలికిస్తూ మానవత్వానికి విజయాశీస్సు లిస్తారు. అప్రయత్న సిద్ధమయిన యమకంతో రోదసీయాత్రను వర్ణించిన శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి 'చంద్రయాత్ర' ఆధునిక విజ్ఞాన ప్రగతికీ మానవుని భావిశ్రేయస్సుకూ అక్షరాంజలి. ఈ సాంప్రదాయకులలో కొంద రికి వర్తమాన పరిస్థితుల కంటె ప్రాచీన చారిత్రక సంఘటనలను కళ్ళకు కట్టినట్లు వర్ణించడంలో ఆసక్తి మెండు. 'కవి గండపెండేరం' ఖండికలో శ్రీ వైడిపాటి సుబ్బరామశాస్త్రి అల్లసాని పెద్దన్నకు కృష్ణదేవరాయల దర్బారులో జరిగిన బిరుద ప్రదాన సన్మానములను సమర్థముగా వర్ణించారు. పృథ్వీభాగవతంలో శ్రీ బీర్మిడి ప్రసన్న పృథ్వీరాజు మహమ్మదు ఘోరీని శౌర్యముతో ఎదుర్కొన్న ఇతి వృత్తాన్ని తమ దేశభక్తి ప్రబోధానికి ఆలంబనం చేసుకున్నారు. 'ప్రవ్రజనం'లో శ్రీ ద్వివేది సత్యనారాయణ సూరి, ఆచార్య శంకరుల తురీయాశ్రమ స్వీకారాన్ని అభివర్ణించారు.

ఆ తరువాయి - ఎనమండుగురు ప్రాచీన కవి సమయాలను అనుసరిస్తూ వర్ణనాత్మక కవితలు వ్రాశారు. వీరిలో శ్రీ చాగంటి గోపాలకృష్ణమూర్తి - 'హేమమాలి' ఖండికలో కాళిదాసుని మేఘు

దూత కథకు పూర్వరంగంలోని ఒక ఘట్టం వర్ణించారు. శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి 'గోపీనౌక'లో యమునా నదిలో గోపీజనంతో కృష్ణుడు జరిపిన నౌకావిహారాన్ని వర్ణించారు. ఈ ఉభయుల రచనలలో వారి ధారాశుద్ధి, ఛందోలంకార చాతురీ, భాషా ప్రభుత్వమూ ద్యోతకమవుతాయి. శ్రీ మోటూరి వేంకటరావు పద్మినీ భాస్కరంలో కవిసమయ సిద్ధమైన పద్మినీ సూర్యుల ప్రణయమును 'ప్రభాత', 'కాంతి,' 'స్వాగతం' వంటి అరుదయిన వృత్తాలలో వర్ణించారు. 'ఋతుహేల'లో శ్రీ పేరాల భరతశర్మ ఆత్మాశ్రయ, వస్త్వాశ్రయ సంవిధానాలు మేళవించి ఆరు ఋతువులలో మానవ జీవితంలోనూ - ప్రకృతిలోనూ కలిగే పరిణామాలను భగవల్లీలలుగా చిత్రించారు. శ్రీ జయకృష్ణప్రసాద్, శ్రీ నోరి సత్యనారాయణ, శ్రీ గంధం సుబ్బారావుల కవితలు వసంతాగమనాన్నీ, కోకిలగానాన్నీ అభివర్ణించే సాంప్రదాయక రచనలు.

కేవలం ఆత్మాశ్రయ కవితలుకూడా నాలుగైదు ఈ భాగంలో లేకపోలేదు. పుత్ర మరణం కారణంగా శోకవ్యాకులమయిన ఆత్మను ఆశ్వాసనగా శ్రీ నాయని సుబ్బారావు అరుదయిన మధ్యాక్కర (ప్రాచీన దేశి) ఛందస్సులో ప్రాసిన శోకగీతం - 'విషాద మోహనం.'

అభ్యుదయ కవిగా, మాత్రాచ్ఛందస్సులలో కవితా ప్రయోగాలుచేసిన శ్రీ దాశరథి సాంప్రదాయక వృత్తరచనలో 'శాంతి' సుందరిని లాలిస్తూ యీ భాగంలో సాక్షాత్కరిస్తారు.

ఈ సంకలనంలోని ఒకే ఒక కవయిత్రి - శ్రీమతి మల్లాది వసుంధర వీణానాదంతో మేళవించిన గళస్వనంతో వెలువడే భూపాల రాగ మాధురులు వనమంతా అల్లుకుని చెట్టు చెట్టూ పూయించిన

తీరు వర్ణిస్తారు. సాంప్రదాయక శిష్టుల ఆశయాలకు అనుగుణంగా శ్రీ ప్రసాదరాయ కులపతి 'విజ్ఞప్తి' ఖండికలో భారతీదేవికి ఆవాహన పలుకుతూ ప్రజలకు తెలిసేటట్టు వ్రాసే మితతో వెలువడే రచనలు కుహనా కవితారీతు లని గర్హిస్తారు.

ద్వితీయ భాగపు సంకలనకర్త శ్రీ రజనీకాంతరావు స్వయంగా కవీ, సంగీతశిల్పీ. అటు సాంప్రదాయక ధోరణులతోను, ఇటు అభ్యుదయ ధోరణులతోను కూడా చాలా సన్నిహిత పరిచయమూ, ఉభయమార్గాల యెడలా సమదర్శిత్వమూ కల సహృదయుడు.

ఈ ద్వితీయ భాగంలో చేర్చిన పదిమంది కవులలో అయిదుగురి రచన గ్రాంథికభాషలోనే సాగింది. మరో అయిదుగురిది వ్యావహారికం; ఒక్కరికి తప్ప మిగిలిన అందరికీ సమకాలిక సమాజంలో పరిణామం చెందుతున్న ఆదర్శాలే ప్రేరణ కల్గించాయి. మధుర శబ్ద శిల్పులలో మకుటధారి అనదగిన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి 'విద్వేష వైతరణికి అడ్డుగా గాఢ సౌహార్దసేతువు' విరచింపగల విశ్వకర్మ, తన 'విశ్వస్సృష్టి' అనే ఖండికలో 'సమస్త దిక్తటుల పిలిచి' - మానవుండు నేడు 'తానే నిర్మాత, విధాత. నేత, మరి తానే, భోక్త' అని చాటిస్తారు. ౧౯౭౦ సం. లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన 'మహోత్మకథ' అనే పద్యకావ్యంలోని చిట్టచివరి విషాదఘట్టం - శ్రీ తుమ్మల సీతారామమూర్తి ప్రాచీన కావ్యధోరణిని ఆఖ్యానశైలిలో రచించిన - 'అమరజ్యోతి' - అనే ఖండిక. కీర్తిశేషులైన శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు తెలుగు శతక శైలిలో రచించిన 'గుడిగంటలు' హరిజనులకు ఆలయ ప్రవేశమును, సమాజంలోని ఇతర వర్గాలతోపాటు అభ్యుదయమును కలిగించమని వేంకటేశ్వరస్వామికి చేసిన విన్నపం.

1964 లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతీ, 1970 లో రాష్ట్రపతిద్వారా పద్మభూషణ బిరుదమును పొందిన కే. శే. గుఱ్ఱం జాషువా రచన 'అఖండ గౌతమీ' ఖండికలో పుష్కర పర్వ సందర్భంగా గోదావరీ తీరాన జరిగే కోలాహలాన్ని వర్ణిస్తూ కొన్ని ప్రాచీన ఆచారాలనూ, మూఢ విశ్వాసాలనూ విమర్శించి, సాంఘికంగా వెనుకబడ్డ జాతుల దౌర్భాగ్యానికి అనుకంప కలుగజేస్తారు.

1972 లో పద్మశ్రీ గౌరవాన్ని అందుకున్న పుట్టపర్తి నారాయణాచార్య కథాపరంగా దేశిచ్ఛందస్సులో రచించిన జనప్రియ రామాయణంలో ఆదికవి వాల్మీకికి వాగ్దేవత సాక్షాత్కరించిన ఘట్టం 'సరస్వతీ సాక్షాత్కారం.'

ఈ సంకలనంలోని చిట్టచివరి అయిదుగురు కవులూ అధునాతన ధోరణులకు ప్రతినిధులు. ఈ రచనలలో ప్రాచీనకవిసమయాలకు గాని, ఛందస్సులకుగాని చోటులేదు. వీరి అత్యుదాత్తమైన భావాలు, లోతైన అనుభూతులు అప్రయత్న ధారాపాతములైన వచన కవితలుగా వెలువడ్డాయి. జీవితం యెడల ఆనందాన్నీ మరణంపట్ల నిర్భయతనూ చూడగల మర్మవాద కవుల శైలిలో సాగిన శ్రీ తిలక్ సినహాయిస్తే మిగిలిన నలుగురూ నేడు మారే సమాజంలోని మానవుని గురించి వ్రాసినవారే. ఈ భాగంలోని మిగిలిన నలుగురు కవులూ శ్రీశ్రీ, డా॥ సి. నారాయణరెడ్డి, శ్రీ జె. బాపురెడ్డి, శ్రీ రంధి సోమరాజు.

*

మేఘ గాని

యస్వీ జోగారావు

అనుభవ సిద్ధుడైన రసికాగణీ, దిగ్రణీత ప్రసూన మా
ర్గణ వినమద్ధనుర్ధ్వని వికంపిత గాత్రుఁ డనంగు చెల్మికై
మనసను మిద్దెనున్న యజమానుని భర్గుని నద్దెకున్న యా
నన విలుకాని కైదువుల నాగక యేసెడువాఁడ నమ్మునన్.

శివునియందలి భక్తియు స్త్రీల మీఁది
రక్తియును దీర్థమునకుఁ దీర్థమ్ము మరి ప్ర
సాదమునకుఁ బ్రసాదమై సాగువాఁడు
సుకవి ధూర్జటి సురపురిం జొక్కియుండ.

అతని భవ నివిష్టము దృఢవ్రతము గాంచి
అతని భవపరాఙ్ముఖము విఖ్యాతిగాంచి
అతని దటీఁజేర వెఱతురు నాక వేశ్య
లంగ జాతాస్త్ర జర్జరి తాంగులయ్యు.

ప్రకటిత పారిజాత సుమపాళి పరీమళముల్ శరద్వలా
హకశకల ప్రపంచిత సమంచిత సంచిత చంద్రికా చక
చ్చకిత దిగంతరాళములు చల్లని తావులఁ బ్రొద్దుపుచ్చుచున్
ముకుళిత పంకజాస్త్ర పరముం డతఁ డిట్లు తపింప సాగెడిన్.

"ఏలా వచ్చితిఁ గ్రొవ్వి యిచ్చటకు నేవేవో ముధావాంఛలన్ ?
కైలాసమ్మున నుండి మద్విరహ దుఃఖార్తుండు నా స్వామి నా
కై లెంకన్ నవదివ్య వాహనము వేడ్కన్బంపఁ బోలేక నే
నేలా వచ్చితిఁ గ్రొవ్వి యిచ్చటకు నేవేవో ముధావాంఛలన్.

అంతా మిథ్య తలంచిచూడ, దివమంతా మిథ్య, దివ్యాపగా
ప్రాంతస్థైర విహారముల్ దివిష దుద్యాన ప్రసూన ప్రమో
దాంతర్వత్నులు చల్లగాలులు, దిగంత వ్యాప్తచంద్రా తపం
బంతా మిథ్య వరాప్సరోధర సుధాస్వాదమ్ము శూన్యమ్ముగాన్.

అతులిత మాధురీ మహిమ నందితిగా భువనైక మోహనో
ద్ధత సుకుమార వార వనితా జనతా ఘనతాపహారి సం
తత మధురాధరోదిత సుధారసధారల గ్రోలి కైతలో;
బ్రతుకున కైత మాధురి ఫలమ్మిడదా దివియందు నేనియున్.

రోసీ రోయదు కామినీ జనుల తారుణ్యోరు సౌఖ్యంబులన్
పాసీ పాయదు గాయనీమణితరావస్థిత గాత్ర స్మృతుల్
చేసీ చేయదు లాసికా లలిత కాంచీక్షేత్ర యాత్రార్థముల్
కోసీకోయదు నా మనంబకట భోగోద్రిక్త వాంఛాలతల్.

శివుని యాజ్ఞలేక చీమైన కుట్టదు
చిత్తజుండు గొడవ చేయలేడు
ఒకతె మేన నత్త నొకతె యౌదలనెక్కి
టతని ముదలయగునొ ! యతని చనవొ !

ఆ నామనోధిపాజ్ఞా
ధీనముగా నిఁక సమస్త దివిషద్గణికా
మాన వశీకరణాత్మక
మౌ నెపముగ నొక వ్రతమ్ము నారంభింతున్".

అని సంకల్పము చేసి యంతట నహల్యా జారు దీవించుచున్
తన దంతక్షత కల్పకల్పనలతో, తాదృగ్రసావాస వా
సనతో శాతనఖక్షతావళి సదృక్షం బక్షరశ్రేణితో
ననుగున్ గమ్మ నొకండుర్వాసి యనిపెన్ దత్కార్య సంప్రార్థియై.

అతనిది చిత్రమైన వ్రత, మయ్యది మన్మథవేధ దీక్ష, యా
వ్రత నియమానుసార మమరాధిపు పంపున వాని యిక్కకున్
ప్రతిదిన మొక్కొక్కరుగ రంభలు నూర్వశులున్ దిలోత్తమల్
కుతుకము మీఱవత్తు రొక క్రొత్త ద్యులోకము చూఱ గొందురున్

రాత్రు లెల్లను శివరాత్రులై యెసంగ
రతి వినోద శాంభవ సమారాధనమున
అప్సరసలెల్ల సివమెత్తి యాక్రమింప
అర్ధనారీశ్వరంబయ్యె నతని బ్రదుకు.

కాంతాశ్లేషము పానవట్ట, మభిషేకంబుల్ ప్రమోదాశ్రువుల్
దంతాళిప్రభ విద్ధ దీపములు, నుద్యద్ధూప ముచ్ఛ్వాసమే
కాంతాలాపము స్తోత్రపాఠము నమస్కారంబు నైవేద్యమున్
కంతుక్రీడగ సత్కవీంద్ర శివలింగం బొప్పె నప్పట్టునన్.

"వచ్చు చున్నది శివరాత్రి పర్వదినము
పరగ తన్మహోత్సవవేళ భర్గసభను
నాట్య గోష్ఠులు నెఱపంగ" నరుగు డనుచు
నచ్చరలకెల్ల వాసవు డాజ్ఞ పెట్టె

వారలెల్ల(దారాద్రికి బయనమైరి
వేడ్క నొక్కదెబ్బకు రెండు పిట్టలనుచు
దంట ధూర్జటియును సాగె వెంటబడిన
మారుకైవడి, పూసల దారమట్లు.

కైలాసమ్మున(గాలువెట్టె కవిలోకస్వామి జూటీవిటం
కాలంకారశశాంక శంకర కటాక్షారంభకష్రోద్యన్మహం
బాలోకించె తిలోత్తమోర్వశులు రంభామేనకల్ శంభు తే
జో లోలంబులు చిన్ని మిణ్గురులునై చూపట్టుటల్ జుణ్గుటల్.

ఆశుభ దృగ్విలగ్న పరమాత్ముని ధూర్జటిఁ జూచుచున్ మహా
దేశిక సార్వభౌముడు మదింబ్రమదంబు వహించి "ధూ ర్జటీ
నీ శివభ క్తి కావ్య సరణిన్ కడు ధన్యతఁ బొందె నింక నా
లో శయనింపు శాశ్వత విలూన వికల్ప సమాధి" నన్చనన్.

"స్వామి ! మోక్ష మనఁగ నేమి ? నీలోన నా
యంత వాఁడూరక య్తెక్య మగుట !
పోనిమ్ము లీనమైపోదునా యన్న నా
వలె మఱి నిను గొల్చు వాఁడెవండు ?
నీకు నీ లోకములో ననేకులుందురుగాక
భక్తులు, నావంటి వాఁడు లేఁడు
కాదు కాదిది యహంకారమ్ము ! నా వెఱ్ఱి
బాగుల మమకార ఫక్కాయింత

ఏనుకోరని మోక్షము నిత్తు ననుచు
కోరి నష్టమునకు నేల గురియగుదువు ?
ఈవు లేక నే నుండ లే నేను లేక
ఎట్టులుందువు నీవు నా చిట్టి తండ్రి !

అమర స్త్రీల రమించినన్ జెడదు మోహంబించు నా బ్రహ్మ ప
ట్టము సిద్ధించిన నాస దీఱదని రూఢంబయ్యె నా కింక నీ
దు మదిన్ జొత్తు నటన్న భావభవు డందున్ లేఁడె ? నా కింక గ
మ్యము లేదా ?" యని యేడ్చు ధూర్జటికి బ్రహ్మానంద మీఱుం డిడెన్.

ఉ త్ప ల మా ల

ధూళిపాళ శ్రీరామమూ ర్తి

మంచి వకీళ్ళ కెల్ల ఁ దలమానికమై నుతిగాంచి లక్ష లా
ర్జించు సమంచితంబయిన వృ త్తి త్యజించితి దేశ మెంచి క
ష్టించితి స్వార్థ బుద్ధి నిరసించితి, వాగ్గగనంబు పైఁ బ్రకా
శించితి వంశమాలివయి చీఁకటి సించితి మంచి తందఱన్.

మించిన వీఁక సైమనుకమీషనుపై హరివోలె దూకి గ
ర్జించితి వాంగ్ల సైనికుల చేతి తుపాకులు తూలిపోవ చూ
పించితి వాత్మ వక్షమును వీరుఁడవై విజయ ధ్వజంబు నె
త్తించితి తెన్ను నాఁటఁ దెగఁ ద్రెంచితి జాతికి దాస్య శృంఖలల్.

ఇంచిన దేశభ క్తి మెయి నిల్లును వాకిలితోడ నెల్ల వె
చ్చించితి కారలందున వసించితి దీనజనాళి సౌఖ్య మ
ర్థించి దరిద్ర దేవతవరించితి వాలిని బిడ్డలన్ బ్రవ
ర్ధించితి ప్రవ్రజించితి తరించితి నించితి కీ ర్తి దిక్కులన్.

ఏనుఁగు సచ్చియున్ బ్రదికి యేనియు వేయియె సేయునన్న యా
నానుడి నీ యెడ న్నిజము నాయకుఁ డన్నుడి కీవయెల్లనై
మానకవై రులౌచ సహమానులు నాయకమానులై ప్రభు
స్థానములాక్రమించినను స్థానము నీయది యాక్రమించిరే.

భూతలిపైఁ బ్రకాశమది పుట్టదటన్న కవీంద్ర సూ క్తి కా
భూతము పుట్టె నాటికిఁ బ్రకాశమవై జనియించు నాటికిన్
భూతలికిన్ ప్రకాశమది పుట్టిన మిత్రులకున్ దురీక్ష్యమై
వ్యాతతమిత్ర మండలికి నందముచిందు సుధాంశుబింబమై.

పోడిగ నాటకా ల్వయసుపోడిమినాటను నీటుకాఁడవై
యాడితివంట పూర్వమదియాదిగ లోకపు నాటకంబునం
దాడితినీదు పాత్ర మదియద్భుత వీర రసానుభూతితో
నోడిన గెల్చినన్మదిని నొక్కటిగాఁ దలపోసివాసిగన్.

మంటివి మేటి దాతవయి మచ్చనెఱుంగని జీవితంబుగా
బంటుతనంబు చూపితి సెబాసని దేశము మెచ్చుకోలుగా
నొంటరివౌచుఁ బోరితివి నుర్వరపైఁ బరదుఃఖదుఃఖివై
మింటిని మంటి గెల్చితివి మేదినిపైఁ జిరకీర్తి గొంటివిన్.

తెల్లని నీదు కీర్తివలె, దీరిచి వచ్చె వెలంది వెన్నెలల్
చల్లని నీదుమూర్తివలెఁ జూగెను మింట సుధాంశుబింబమున్
మెల్లని నీదు పల్కున సమీరకుమారమువీచె మందమై
యల్లిన నీకు పాయసములై వికసించె నవోత్పలావళుల్.

ఆవిష్కృతి

ప్రసన్న

ఆంతర సుమనో ధర్మము, అచ్చమైన
ఊహ, భావనా పదమునం దుజ్జలత్వ,
మిన్ని యుండియు మనసున నేల విరిసి
కొన్నదీ అహంకారాగ్నికుండ మిట్లు.

మనసులో నున్న వినయమ్ము మాటలందు
కానరా, దెదలోపలి మ్లాన భావ
మాననమున దోపదు, దరిద్రావరణము
దైన్య మొప్పదు, నృపుని విధాన నేను.

గుండెలలోన ఎప్పుడో రగుల్కొని నిప్పులు రాల్చుచున్న, దీ
మండుట లెంతకాలము ? ఆమాయకముల్ ఎదలోని కోర్కె లెం
దుండెనో ? ఈడ్చివేయబడుచుండెను, కొన్ని నశించు, కొన్ని ని
ల్చుండును, వానికెంతబలమో ! ఇటు వహ్నుల నేచి నిల్చెడున్.

అంబుదమైన నా హృదయమందలి ఆర్ద్రితతోడ కొల్చెద
అంబుజమైన నా కనులయందలి చిక్కదనాన పోల్చెద
అంబరముగా కనుంగొనుచు అచ్ఛతలేదని వెక్కిరింతు నా
వెంబడివచ్చు నీ సకల విశ్వ మటంచని యూహచేసెద.

ప్రకృతిలోనున్న అందము పలుకరించి
ఎడద నూగించి ముగ్ధజేసెడిది మున్ను
నే డహంకారవహ్నికల్ నిగుడ సర్వ
మందు సాధారణత్వమే ఆశ్రయించు.

ఈ అహంభావ మన్నది ఎరుగనపుడు
ఏవో అనుభూతు లవి తమ ఎరుకలేని
వార్ధ్రములు, తీవ్ర దుఃఖశ్లథావధులు, మ
నోంతర సముద్ధరమ్మ్ లై నపుడు నేను —

తెలియనిపేళ నా ఎడదతీరములం జని ఏమి దీని లో
పలగల యంతరార్థమని ప్రాక్స్థితినెంచను భావనా సము
జ్వల పరిణాహమెంచను, వచఃస్థితికందని దాని నేమియో
తెలియగరాని వాక్కులను తీర్చితి నాంతర తీవ్రవాదినై.

అర్థ మెరుగ వాని అనుభూతులను వేగ
లేక ఆత్మ దృష్టిలేక, ఒక్క
అదుపు లేని వెట్టి యావేశమున పరి
భ్రష్ట వృత్తి నైతి, భ్రాంతుడైతి.

ఆవేశమ్ములు విచ్చుకొన్నపుడు నాకానందమేలేదు, అం
తా వీధింబడిపోవు మానిసిన నేనైనాను, దారిద్ర్య దుఃఖ
భావేశమ్ములు, దుష్ట ధర్మములు, వేదాంతోక్త నైష్కర్మ్య సం
థా వాగ్రీతులు నావశమ్మయిన అంతా క్రొత్తయే విచ్చుచో.

వెట్టి కేకలు పుట్టెల వేడుకలు, శ్మ
శాన భాషలు, విప్లవ శాసనములు.
ఏమిచేయు విశ్వము మార్చునే? మరి మ
రీ యెడదలోన ఆవేశ మెట్లు నిలుచు

ఎరుకలేనట్టి అనుభూతి, ఎరుగు నట్టి
శక్తిలేని యావేశము చచ్చిపోయి
నిద్ర పోయిన నాలోన నే ననియెడు
భావమే దీపమయిగుండె పాదు

అమల శ్రీసిత హంసమై పడవ యొండానంద తీర్థమ్ము సా
గు ముహూ ర్తమ్మున మానసమ్మున చెలంగు ర క్త వర్ణ ప్రభా
సము, సర్వప్రభు భావ ధీకము, సమస్తానంద భాగ్భావ గ
ర్వమనోజ్ఞాకృతి యొందు సృష్టికిని పూర్వంబందు భాసించెనో ?

పాడిన యీగీతి పాడితి తొలిసారి
నిలిచి పోవలె అభ్రమలమి ఎపుడు
ఎడదలో పొలిచిన ఈ యగ్నివల్లిక
చీకటి కొప్పున చిందె పూలు
స్వావిష్కృతి స్వరూప ద్విరదమునకు
అంబారి నాయూహయై స్ఫురించు
మనసున కేతమై నవార్ధ భారతి
ఆనందవీధిలో నరుగు దెంచు

వ్యాకృతమ్మైన తొలికావ్య వర్తి వెలిగి
ఈ అరుణసంధ్య తుద చీకటింటిలోన
ఎపుడొ మరచిన వాల్మీకి ఏగుదెంచె
నన్ను యీయూహ స్ఫురియించునట్లు చేసె.

హృదయములోన శాంతి చిగురించిన దారుణమైన ర క్త సం
ధ్య దెసల జారిపోయె, తెలి అంచలు రెక్కలు విచ్చుచున్న య
ట్లై దిగెను వెన్నెలల్ వెలుగులే పది దిక్కుల నాక్రమించునో ?
పది పది గొంతుకల్ విరియు పాటల వాకలలో స్ఫురించునో ?

హేమవమాలి

చాగంటి గోపాలకృష్ణమూర్తి

కలశాబ్ధి ఫణీరాజ తల్పమునయోగస్వాపము న్వీడి శ్రీ
లలనా జానియు మేలు కొంచినయటుల్ ప్రాగ్భూధరేంద్రంబుపై
నిలిచెఁ దోయజ బాంధవుండు సురతన్వీ గీతికాలాస్యముల్
చెలఁగఁ బ్రహ్మఋషి స్తుతిస్తుతి వచస్సేవల్ కటాక్షించుచుఁ.

ఇనకరాగ్రముల్ తన పార్శ్వమును స్పృశింపఁ
బద్మినీరమ క్రేఁగన్ను బఱపెనేమొ;
విచ్చు వెలిరేకుఁ గొసవంపు బెఁడగు లొలికి
తనరె మానస సరసి పొందమ్మి పువ్వు.

గౌరిఁ గొల్వంగఁజను నలకాపురంధ్రి
కేలఁబూనిన బంగరుఁ బూలసజ్జ
చైత్ర రథము పరీమళ స్వాదు వికచ
కుసుమ గుచ్ఛాళి నందముల్ కొసరి జిమ్మె.

కిన్నరాంగనా మండలోద్గీయ మాన
ధనపతి యశఃప్రశస్తి గీతముల రవము
మధుర మధురమ్ముగా సాగె మందపవన
వీచికారాజి నుద్యాన వీధులందు

శిరముల్ వంచియు నూర్ధ్వదృక్ప్రసరణ స్నిగ్ధాననుల్ యక్ష కి
న్నరు లెల్లన్, యువరాజు మానససరఃస్నాతుండు విచ్చేయుచోఁ
బుర ఘంటాపథమందు నిల్తురిదెఃశ్రేణుల్ తీర్చి తత్స్యందనం
బరుగఁ గాంతురు తద్దిశఁ వివృత నేత్రాంభోజు లుద్యచ్ఛిరుల్

కనక నవమణి చకచక ధ్వ్రణుల నగరి
హర్మ్యతతులొప్పు రజతాద్రి యంకమందు
దంత మంజూషఁదుహిన భూధర కుమారి
భూషణావళి ధగధగన్ బొలుచునట్లు

లేఁతలై హర్మ్యాగ్ర కేతనాంచల చల
త్కాన కింకిణుల రాపునకుఁ జెదరి
ముదురులై రత్నగోపుర కుంభమండలిన్
జిత్రవర్ణచ్ఛటల్ జిమ్మిపోసి
రూక్షమై వజ్రవప్రక్షోణి ధగ ధగ
ధ్వ్రణీతతిఁ దృష్టి మిర్మిట్లు గొలిపి
చండమై కుట్టిమ స్థలుల వీచీఘటా
తరళరోచిస్సరోవరము లూఁచి

సమభిగమ్యత్వమ ప్రధృష్యత్వ మొప్పఁ
దరణి కిరణముల్ రాజసౌధముల వెలిఁగెఁ
జెలఁగె నంత యాతా యాత సేవకాళి
హళహళలుఁ బరిచారికా కలకలములు.

సురవాహినీతోయ పరిపూర్ణ మణికుంభ
హస్తాబ్జములఁ గొంద అబ్జముఖులు
శ్రీగంధ కాశ్మీర మృగనాభి పాత్రికా
హస్తాబ్జములఁ గొంద అబ్జముఖులు
ఘనసార మహిసాక్షి కాలాగురు కరండ
హస్తాబ్జములఁ గొంద అబ్జముఖులు
ఫల పత్రకిసలయ ప్రసవగుచ్ఛ కదంబ
హస్తాబ్జములఁ గొంద అబ్జముఖులు

బహుళ భక్ష్య ప్రపూర్ణ సౌవర్ణభాజ
నాళి హస్తాబ్జములఁ గొంద అబ్జముఖులు
వేణు వీణామృదం గాది వివిధ వాద్య
హారి హస్తాబ్జములఁ గొంద అబ్జముఖులు

హేమమాలి విరచితేం దూద్వహారామ
క్రమ పుష్ప మాలికా శతంబు
బిల్వ దళము లిడిన వెండి సజ్జల నుంచి
యతుల భ క్తిఁ గొంద అబ్జముఖులు

చనిరి నిధీశ్వరు పూజా
మణీ గృహమునఁ గుట్టిమముల మందగతిం గం
కణ రశనా నూపుర కిం
కిణీ ఝణ ఝణ ఝణ నినాద కీర్ణ ధ్వముగాఁ.

చెలగెఁ రాజగృహంబులఁ వనధివీచీ ఘుం ఘు మధ్వాన దో
హల మధ్యాహ్న శివార్చనాసమయ శంఖారావ మంద్రార్భటుల్
చెలగెఁ రాజ గృహంబులందున విపంచీ మంజుల స్వానదో
హల వైతాళిక సుందరీ నివహ గీతారావ వల్గూర్మికల్

భస్మత్రిపుండ్రాంక ఫాలస్థ కాశ్మీర
తిలకమండల శోణ దీప్తితోడ
స్నానార్ద్ర పృథుల చూడానద్ధ మందార
మల్లికాముకుళ దామములతోడ
అష్టోత్తర శత రుద్రాక్షమాలాలస
ద్వక్షస్స యజ్ఞసూత్రములతోడఁ
బట్టాంబరాంచల స్వర్ణదీధితులతోఁ
గటిబద్ధ చీనాంశుకమ్ముతోడఁ

గనకమయ కాద్రవేయ కంకణము తోడ
మొరయు మువ్వల గండపెండెరము తోడ
వినత వనితా శిరోంజలుల్ గొనుచువచ్చి
యక్ష సమ్రాట్టు పూజాగృహంబుఁజొచ్చె.

రజత గిరినుండి సపరివారముగ వచ్చి
యాప్త సఖునింట నాతిథ్య మందునేమొ;
శైలజాపతి – యొప్పెఁ – బూజాగృహంబు
శివమహాలోక దర్పణశ్రీ వహించి

ధనపతి యీశ్వరార్చన విధానము నెల్ల నసి వ్రతంబుగా
నొనరుప మేఘమంద్ర నిన దోల్బణ వైఖరి స్తోత్రవాజ్మిగుం
భనములు భక్తిభావ పరమస్థితి జ్యోత్స్నల పంట పండెడుఁ
దనరు మరుత్పథమ్ముల సుధాసరసీ మృదు లోర్మి మాలికల్ –

శీతలవారి ధార నభిషేకముసాగ, వికీర్యమాణ ము
క్తాతరళోత్కటాచ్ఛ హసిత ద్యుతి ముగ్ధ పృషత్కదంబవీ
చీతతి వల్గులాస్య వివశీకృత వాఃపరిణాహమూర్తియై
ద్యోతటినీ సవిత్రి కనకోజ్జ్వల నీరజ డోల లూఁగునో ;

ధూప సుగంధము ల్వెడలి తోయద వీధులలోఁ బరీమళ
శ్రీపరిపాక మేర్పరుప శీత ధరాధర సార్వభౌమ క
న్యాపతి మందహాస రుచిరాననుడై యధివాసితమ్ముగాఁ
దోఁప గపర్దమండలము తుష్టిమెయిన్ సవరించి మెచ్చునో ;

యక్షనేత సేయు నారాధనముఁజూచి
పోవుకోర్కె తనకుఁ బొడమె నేమొ
యొక ముహూర్త మాపె వ్యోమమధ్యము నందు
సప్త సప్తి కర్మసాక్షి రథము.

సౌరభములేని తనదు జ్యోత్స్నా ప్రసార
మునకు నిజముగఁ దనుమెచ్చు కొనునొ స్వామి
యనుచు నెద సంశయించునో ; యమృతకరుఁడు
స్నిగ్ధ భసితాను లేప సంసేవవేళ

తన మిత్రుం డలకాపురీశుని పొగడ్తల్ చిత్ర చిత్రంబులే
నని లోహర్షపయోధి యొనొకొ ; సువర్ణాహార్య కోదండుఁడా
యన-లోకాద్భుతకృత్యమొఁ ద్రిపుర సంహారంబు నిక్కంబు-దా
నిని నీతండు ప్రశంస కొత్తు నదిగో ; నీరాజ నార్చామిషన్.

వాంఛానుమితి

సంపత్కుమార

ఒక కొండ కొమ్మకొన ని
ల్వాక క్రిందికి గుండు జారిపడు సవ్వడి పో
లిక, మిన్ను నవ్వికొని న
ట్లొక యురుమడి దిక్కుకొనల నుండిటు వచ్చెఁ.

ఎట ఏమూలనొ ఒక్క గర్జమది యట్లే ఒక్క విద్యుత్తు వే
సటలఁ గుందు నెడందకుఁ జిరము వెచ్చన్గ్రాగు ప్రాణాని కూ
రటలన్ గూర్పగజాలు, పైన మరి తంద్రాశీల మీ మబ్బు లిం
తటివై మింటిని గప్పెడున్ బ్రతుకులోనఁ జల్ల పందిళ్ళుగఁ.

మూలల్ మూలలనుండి చిన్నచిని మబ్బుల్ క్రొత్త అందాల నీ
లాలై, విచ్చిన నల్ల కల్వలయి లీలాలాస్యకృత్యాకి పిం
ఛాలై, ఎల్లెడ మింటగ్రమ్మకొని స్వచ్ఛాయా ప్రసారమ్మలఁ
నేలఁ సర్వమునందు స్వప్రభుత నందెం వార్షిక స్వాములై.

ఈ విద్యుత్తులు విచ్చుకొన్నయవి తామీ గాఢ లీలాభ్ర మా
లావల్లీ తనువెల్ల పువ్వులయి హేలాహాసముల్ మోము నిం
డా విప్పారిన యీ వియత్తు మనసంతా నిండు వాంఛాళియై
ఏవో నూతన లోకనిర్మితికి చిత్రించే ప్రభారేఖలై.

ప్రామిన సన్నజల్లు వలిపంపు తెరల్ విడదీసికొంచు ఊ
హా మధురమ్ముగా వెలుగు లల్లిన దారుల నుండివచ్చి సౌ
దామని నాయెడంద కెడదఁ గదియించిన నేమి యయ్యో ? వాం
ఛామితి లేని యీ మనసు సౌఖ్యమ దొక్క నిమేష మాత్రమై.

ఈ సన సన్నజల్లె గిలిగింతలుగా నునుసిగ్గు వోవు పృ
ధ్వీసతి, తాను గంధవతి విచ్చిన వేయి విధమ్ములైన ఉ
చ్ఛ్వాసము లట్లుగా మధురవాసన లెల్లను వ్యాకరించు నా
యీ సుకుమార మానస మిదెల్ల పురాస్మృతి బంధక్లుప్తమై.

మరి యీ వాసనలెల్ల నూత్నములు సంస్పందమ్ములా ఏమి ? జీ
వ రహస్యమ్ములుగా మనఃపుటిని నీవారాంత శూకాగ్ర భాః
పరమమ్ముల్ పరిలీనముల్ చిరములై వ్యాపించు నీనాడు బా
హిరమైనట్టి సధర్మ కర్షణముతో నీ యెల్లయుఁ దామునై.

నేనై తా మొదలైన వాసన లివన్నీ ఆమె నేత్రాంత వీ
క్షా నైశిత్యముతో సహస్రవిధ వాంఛారేఖలై చీలి సం
ధ్యా నృత్యచ్ఛిఖి పించ కేసరములై తా పించ నీలాంబుద
శ్రేణీకోణ మనోహరారుణ విభాశ్రీలై యెదన్ జీల్చెడుఁ

ఈ వాంఛఁబడి లక్షయాతనలు మిన్నైతైన దీవాంఛ మి
న్నా, విప్పారు తమోగుణమ్ము బహుధానై మబ్బుతున్కల్ తధా
భావమ్మందున నొక్కసారి సుఖమా భాసించు నైరమ్మద
శ్రీ విస్ఫూర్తివలెన్ నిరంతర ధురారేఖా నిరాసమ్ముగన్

వెలిగిన దివ్వె కొట్టకొన విచ్చిన చక్కని ధూమరేఖ,? మి
న్నుల మిన గాఢధూమమున నాడెడు చిన్నరి విస్ఫులింగ మీ
పొలకుల నున్నదీ సుఖము పొందుట దుఃఖము పొందుటల్ నిరా
కులముగలేని నీ ద్వివిధ కుంచితమౌ అనుభూతి మార్గముల్

అల సర్వమ్మున నుండి వేరయి తృతీయః పంధలో సాగు వాం
ఛలతో సంచలనమ్ము పొందెడి మన స్సౌఖ్యమ్మిదేమో ! యి ది.
ట్టులటంచుఁ మరి వేరు వేరు విడిబాటుం గూడ జేయంగలే
కవిలీక్షామతి నయ్యెదఁ వివృత లోకంబిందు నే కాకితఁ

ధనుపై సామి మనోజ్ఞ చక్రము వియద్భాగమ్మున చిన్నారి చ
క్కని రెక్కల్ విదలించుచుఁ జను బలాకాశ్రేణి తా నారియై
సన జల్లుల్ విశిఖమ్ములైన మదనస్వామీ ! ఇదో గుండె వి
చ్చిన యీ బాడబరీతి వాంఛలను వెచ్చింతుఁ ద్వదర్థమ్ముగఁ.

బుు తు హో ల

పేరాల భరతశర్మ

ప్రావృడమోఘ మేఘ నికరమ్ము నిరంతర కాంత వైద్యుత
శ్రీ విభవాభిరామముగ జిత్రముగా గనిపింప నింగి యం
తై వినతా తనూజుడు నిజాంసముల న్నినుఁ బూనివచ్చు నం
చే వినువీధి ప్రాకెదను నీక్షణపంక్తుల వేంకటేశ్వరా ।

ఇంద్ర ధనుర్విలాస మెలయించి శిఖావళపించ సచ్ఛవిఁ
సాంద్రతమాల కాంతిమెయి చాయలు నిగ్గులుఁ దీర్చి తీర్చి ని
స్తంద్రగభీరనాద విలసన్మధురాకృతి వార్షకమ్మునఁ
సంద్రపుఁబట్టితో మెఱపుఁజాయల రాగదె వేంకటేశ్వరా ।

జీవములఁ త్యజించి నిజశేముషినాత్మ విశుద్ధులౌచు మో
క్షావపథంబుఁగాంచఁ జనునట్టి మహామహులైనయోగు ల
ట్లావల నీవలఁ ఘనులు నంబరమందుఁ జరింప నీ శర
చ్ఛ్రీవిభవమ్ము మన్మదికి శ్రేయముఁగూర్చుత వేంకటేశ్వరా ।

మదకలహంస రాజములు మాటికిఁగానగ వచ్చినంతటఁ
సదమల రత్నరాసు లనఁజాలి ఘనమ్ములు నంబరమ్మునఁ
మెదలగ-శ్రీ వికుంఠపురి మేదినికిఁ దిగివచ్చెనంచు నా
హృదయము నిన్నహో । వెదుకనేగును శీఘ్రము వేంకటేశ్వరా ।

క్రంతలులేని బొంతవలెఁ గ్రమ్మిన దట్టపు మంచుఁగప్పి హే
మంతము మోహపుండెరల మమ్ములఁ ద్రిప్పును శీతవాత మా
వంతయు వీడనీదు చెలిప్రక్కను, కోవెలగంట సుంత యా
లింతునె గాని మేల్కొనగలేనుగదా । ప్రభు వేంకటేశ్వరా ।

మాసములందు మార్గశిర మాసము నీవని ప్రాంగణాన నీ
కోసము రంగవల్లులనుఁ గూరిచి తీరిచి నిల్చినాము పే
రాసగ-మాయ మంచుపొరలందున నెందును దాగియుంటివో
వీసము గానరావుఁగద వెట్టిమొగాలకు వేంకటేశ్వరా ।

రాగవిహీనతఁ సుమపరాగ రజోగళితమ్ములై నిరీ
హాగతి వృక్షముల్ ప్రకృతి నంటియు నంటక సర్వసంగ సం
త్యాగముచే దిగంబరతఁ దాల్చినయోగులు నా న్వీరాగ బో
ధాగమ యుక్తికిఁ శిశిరమందున దెల్పును వేంకటేశ్వరా ।

ఆశలనిట్లుఁ డుల్పుడని యాకుల రాల్చుచు, చింతవంతలఁ
లేశము నేఁజలింపకుఁడు లీలగ నిట్లని ప్రేమొడు వారి యా
కాశపు తత్త్వ దర్శకులుగా కరశాఖల నెత్తి నీదు సం
దేశ మిడఁ దరుల్ శిశిర దేవత లైనవి వేంకటేశ్వరా ।

ఈ మహిజ ప్రసూనముల కెక్కడి వీ నునుఁ దేనె తుంపురుల్
నీ మధుర స్వరూప మవనీరమ డెందమునందు మాగెనో
యే మొకొ ! వన్నె వన్నెలుగ నెయ్యెడఁ గాంచిన నీ కృపారస
శ్రీ మెఱసెఁ వసంతమునుఁ జిల్కిన యట్టుల వేంకటేశ్వరా ।

నీ యధరమ్మ రక్తిమము నింపితివో చివురాకు లందు, నీ
తీయని రాగవైఖరులఁ దీరిచి దిద్దితివో పికమ్ములఁ
మాయని మాయ వాసనల మా యెద మత్తిలఁ జేసినాడ వౌ
నే యెడ నీవు నుండినను నెట్టులఁగందుము వేంకటేశ్వరా ।

ఘనజని దుఃఖ తప్తులయి క్రాగిన నీరు నిదాఘమందునఁ
ఘనతరరూపముఁ గొనినకైవడి నా పరమాత్మ రూపమం
దున పరిలీను లయ్యెదరు తోచి మెలంగి యెఱుంగ తత్త్వ మం
చనవరతమ్మ గ్రీష్మ పరమార్థ మెఱుంగుదు వేంకటేశ్వరా ।

పాయక యాత్మయందు భగవంతుడు నుండు విధమ్మెదెల్ప నా
రాయణు నంతరస్థుని పరాత్పరు జూప మహోజ్జ్వలమ్ము లౌ
వేయి కరమ్ముల న్బఱచి వేవెలుగెంత శ్రమించెనేని యే
దో యుడుకెత్తు గాని కనమోప్రభు నిన్మరి వేంకటేశ్వరా .

భూపాలరాగము

మల్లాది వసుంధర

ఏమి మె త్తని సవ్వడి. ఏమిమె త్తని ధ్వని
అంతలో మంత్రముగ్ధవలె అట్లని నిలిచినాను.
ఒక సన్నని మృదురావము నిశ్శబ్దతను చీల్చుకొంటు వస్తున్నది.
ఒకటి వీణాధ్వని
రెండు పిల్లే వేళ్ల చివురాకులు
జోడించిన కంఠం వెన్నపూస
ఆరాగం విరళ విరళ మగుతూ తోటంతా నిండిపోతున్నది.
వలయాలు కడుతున్నది.
పుష్పతతుల్ మెల్లగా వికసించడానికి ప్రారంభించినవి
ఆ రాగం యొక్క ప్రతిచ్ఛాయకు ఒక్కొక్కచెట్టు వళ్లు విరచుకొని
కళ్లు తెరచుకున్నట్లు పుష్పిస్తున్నవి.
ఏదో ఒక సన్నని ఆ ర్తి నాలో నుంచి వెలిగిస్తున్నది.
భగవంతుని మేలుకొల్పుటకై నా జీవుడా ర్తి బడుతున్నాడల్లే ఉన్నది.
నే నొక రాతిని, నాలో చైతన్యం లేదేమో.
ఒక కీ ర్తన మొదలుపెట్టింది.
అది శారదా స్తోత్రము
ఓ తల్లీ ! ప్రపంచం నిద్రావిలీనమైయున్నది.
మూగవోయి యున్నది
సర్వజగత్తు అజ్ఞానాంధకారంలో చైతన్య రహితమై ఉన్నది

నీవు నిత్య జాగృతివి

చైతన్యమవు

జ్ఞానాకృతివి

నీ పద్మ నేత్రాలు విప్పిచూడు

లోకాలను వెలిగించు

లేవవేమి తల్లి !

మా తృ శ్రీ

విశ్వనాథ వేంకటేశ్వరులు

వారిన్ వీరిని నాడిపోసికొన మెప్పా తప్పు వాకుప్పలై
గారామారు నిజాత్మజాతులె కవీడ్కల్లోలినీ నాథులై
మారామళ్ళానరింప నొక్కరిననన్ మర్యాదయే, మీదు బం
గారంబే చెడి నప్డులెస్సయగునా కంసాలి దూషింపగన్ ;

కాలము దేశము మారును
కాలముతో దేశ బుద్ధిగతులున్ మారున్
హేలాబ్రాహ్మ స్థితి మ
త్తై కలాసిని నీకు మాత్ర కలుగవు మార్పుల్

నీ హృదయంబు కాశి, యది నిత్యము తత్ప్రియయంబునందునున్
వ్యాహతి లేక నాభిగతుడై రఘువంశ సమర్చితుండు నౌ
శ్రీహరి రంగనాథుడు హరించును రాక్షసకోటి నెప్పుడున్
మోహన మేఖలామణివి భూసతికిన్ దివిషత్ప్రియాకృతీ ;

తొలిపల్కుల్ వెలరించియుంటివి జగద్ధూర్వహ స్థానమై
కుల సుందర్యవతార రూపిణివి నీకున్ బుత్రుడై శార్ఙ్గి తా
వెలరించున్ దొలివేలుపున్ గదుపు వెవ్వేల్గోప రమ్యాకృతిన్
విలసద్ధర్మ చతుర్దశాత్మక మహా విద్యాపయో ద్ధోగ్ధివిన్

ఐహిక పారమార్థిక పరాపర విద్యల కొజ్జబంతివై
ద్రోహిణమైన సృష్టికిని ధార్మికశిక్ష కనాది రాజ్ఞివై
యాహవనీయ వహ్నిసముపార్జిత సత్రకృతు భోక్త్రివైన నీ
మోహనమూర్తి నేమెఱుగు మ్రుక్కడిమూకలు కక్కసించుచున్.

దేవతల నాత్మ భావించి దేవతలును
దన్ను భావించి పెనుపొందు ధరణి నరుడు
కాక తనుదాన భావించు కాపురుషుడు
రెంటికిన్ చెడు రేవడై వృషలతఁ గను

ఫలశూన్యంబగు వృత్తి దుష్ట ధిషణా పాండిత్యమున్ జూపుచో
నిల సాధించునదేమి, గోళముల సాహిత్యంబు సర్వంబునున్
దెలియం వచ్చిన దన్మ వస్తుగత సద్వృత్తిన్ విచారింపకే
కలడే తత్పురుషార్థ సిద్ధి కలుచల్ కన్మాయు మాయావృతిన్.

ఏక విజ్ఞాన మెద్దాన నెల్ల తెలియు
తెలివియెల్లల కెల్లయౌ వెలుగు జ్యోతి
కలుచ పరిశోధనలు చేసి కాంచునట్టి
దాత్మ మాయాకృత భ్రాంతి యైన జడము.

ఐహికాముష్మికమ్ముల నైక్యపరచి
సమత శాంతి యహింసల సంగ్రహించి
యాత్మ వ త్సర్వ భూతాని యనుచు సర్వ
భద్ర ధర్మాను గామిని భరతమాత.

చంద్రుపైఁగాలు మోపితి శక్తిఁజూపి
చంద్ర చైతన్య సత్తా ప్రశాంతిలేక
జగదధిష్టాన చైతన్య సామరస్య
పరమశాంత స్వరూపిణీ భరతమాత.

ఆదికాలాలనాడె సర్వావనియును
గన్ను తెఱచియు తెఱవని కాలమందె
"అగ్నిమీళే పురోహిత"మ్మనుచు బ్రహ్మ
వహ్ని నర్చించి తనిసె మా భరతమాత.

ఒకడే బ్రహ్మము భ ర్తయు
నొకడే సతికిన్ బరార్థమొకడే యనుచున్
ప్రకృతి స్వధర్మ పరిణ
త్సకామహత భరతమాత యమృత జయించున్.

త్యాగార్థ సంభృతార్థయు
యోగైశ్వర్యాత్మ యజ్ఞహోత్రీమణియున్
నైగమ విద్యా సర్వ
క్షౌ గురుదేవతయు భరతమాత జయించున్.

ఆపో జ్యోతిష్మతియై
వ్యాపృత హైరణ్య గర్భ భాండోదర స
ర్వా పోమయ గోళక ధ
ర్మా పాత వివేక భరతమాత జయించున్,

భగణములు గ్రహగోళముల్ పాలపుంత
వర్థమాన బ్రహ్మాండాల వరుసమించి
"యత్యతిష్ఠద్దశాంగుళ" మనగబరమ
బ్రహ్మభూయమ్మ నెఱుగు మా భరతమాత.

నిన్నెఱుంగవు నీ నిల్చు నేలతల్లి
తత్త్వ మెఱుగవు విశ్వంబు తడవబోదు
తన్నెఱుంగును దనతల్లి తానెఱుంగు
పరమ శాంత స్వరూపిణి భరతమాత.

నరుని నారాయణుని విడనాడి జడత
బట్టమున్ గట్టి రిట యంత్రపటలి కెలమి
నరుని చైతన్యసత్త సనాతనంబు
బ్రహ్మమనుచు నానందించు భరతమాత.

జగతి సర్వంబు భ్రాంతియే సర్ప రజ్జు
భాతిని బరస్పరాధ్యాప బడలుపరచు
భ్రాంత్యధిష్ఠాన సర్వప్రపంచ మూల
పరమశ క్తికి దుహిత మా భరతమాత.

జయము భారత జనయిత్రి జయము జయము
జయము జీవస్వధర్మ దర్శనవికాస
విశ్వకల్యాణ ఋతసత్యవేత్రి జయము
జయము జయము మా సావిత్రి జయము జయము.

జ యో స్తు

జంధ్యాల పాపయ్య శాస్త్రి

జయ జయ ! జయాభ్యుదయ ! సహృ
దయ హృదయ ప్రియ ! సుహృదయ ! దయసేయుము నీ
కయి కయిసేసిన గద్దియ
పయి విజయంచేయు ముదయ భాస్వంతుడవై.

క్రొమ్మావి కొమ్మ కమ్మని
కెమ్మోవి చివుళ్లు బుజ్జగించిన కల కం
ఠమ్ములు కల కంఠములై
సమ్మోదముతోడ నీకు స్వాగతమిచ్చున్—

వగరు వగరుగ పుల్ల పుల్ల గను తియ్య
తియ్యగా చేదుమ్రింగిన తెలుగుబిడ్డ
తొగరు చెక్కిళ్ళ బాష్పాలు తుడుచుకొనుచు
జయము పల్కును నవయుగస్వామి నీకు.

రాజువట నూత్న సంవత్సరమున కీవు
రమ్మ రమ్మోయి ! యీ చైత్రరథ పథాలు
చిగురు చెంగావి కలికి కుచ్చెలులు చెదర
ప్రకృతి నీకిచ్చు ప్రణయ నీరాజనమ్ము

కెంజిగురాకు చేతుల నొకించుక వంచి ప్రఫుల్లమంజరీ
మంజుల మాధవీ మధుర మంగళమూర్తి వసంతలక్ష్మి పు
ష్పాంజలి పట్టునీకు కమలాకరముల్ రసరాగపూర్ణ దృ
క్కంజములన్ వెలార్చు నవకౌతుక బాష్పమరంద బిందువుల్—

కన్నులు త్రిప్పకే తెరలుగట్టిన చీకటిలో ప్రసు ప్తమై
యున్న జగత్తు నీ నవయుగోదయవేళ స్వయం ప్రబుద్ధమై
వన్నెలు దిద్దుకోవలె నవత్వములోపల మానవత్వ మ
భ్యున్నతి నందికోవలె మహోజ్వల జీవన సుప్రభాతమై.

అవతరణాలు శాంతికి, జయంతికి జాగరణాలు, సత్యమున్
శివమును సుందరమ్మయిన సృష్టికలంకరణాలు, సర్వ మా
నవుల కరిష్ట కష్టహరణాలు యుగాభరణాలు లోక బాం
ధవ ! భవదీయ దివ్య కిరణాలు వెలుంగు తెలుంగు వీథులన్—

భజనలు పక్షపాతము లపక్రుతు లెక్కువ రక్తి తక్కువై
గజిబిజి చేసె తర్జనల గర్జనలన్ విజయాబ్ద ! మింతతో
విజయకు వీడుకోలు చదివించి జగమ్మిక నిర్వికారమౌ
విజయ సమాగ మమ్మనుభవించక నూత్నశుభోదయమ్ములో

నాగార్జునాద్రి నున్నని పాలరాళ్ళపై
సిరులు చిల్కిన తెల్గు శిల్పలహరి
ఏక శిలాపురీ ప్రాకారములపైన
విశ్రమించిన తెల్గు విజయలహరి
విద్యానగర నందనోద్యాన వీథుల
కాంతు లీనిన తెల్గు కావ్యలహరి
త్యాగరాయల భావరాగ డోలికలలో
కళలు చిందిన తెలు గానలహరి

ఒక్కసారిగ మరల నింకొక్క సారి
పొంగి పొరలును గాక త్రైలింగ జగతి:
పసిడి పంటల ఆంధ్ర సౌభాగ్య లక్ష్మి
నవ్వుకొనుగాక ఈ నవానందవేళ

ఆది ఉగాది నీది తెలుగమ్మ స్వతంత్ర గృహప్రవేశ భా
గ్యోదయమైన పిమ్మట ! నవోదిత రాష్ట్రిములో సమైక్య సం
పాదనచేసి అభ్యుదయ పద్ధతులందు పురోగమించి ఆ
హ్లాదము గూర్చుమోయి ప్రజలందరు నీకు జయమ్ము పల్కగన్.

చేయుట కేమిలే ! చేసిన అభివృద్ధి
పథకాలు మరి బూజు పట్టకుండ

చేయుట కేమిలే ! చేసిన ధర్మ తీ
ర్థానాలు రూపులు మారకుండ

పొంగుటకేమిలే ! పొంగిన తటినీ త
రంగాలు పంటలు క్రుంగకుండ

పలుకుటకేమిలే ! పలికిన పౌర వా
గ్దానాలు నోళ్ళలో నానకుండ

వెడలి ముందుకు వెనుకంజ వేయకుండ
తిరిగి వెనుకకు గోతులు తీయకుండ
మేలుకొని మేలుగా రాజ్యమేలుకొనెడి
తెలుగు వెలుగుల తొలియుగాదికి 'జయోస్తు'

శాంతి

దాశరథి

పూలను ముద్దుపెట్టుకొని ముండ్లను వద్దన బోకు నీవు, నీ
కే లటు తాకినంత పులకింపవె కంటకముల్ సుమమ్ములై
నీల నికా శికోజముల నిండు శశాంకుని చెండు చెక్కగా
జాలిన నీ ముఖాంబుజము జాలు అమాసయె పౌర్ణమాసిగాన్.

పువ్వులు ముండ్లుగా మధుర మోహన కౌముది నిప్పుమంటగా
నవ్వులు వాడియమ్ములుగ నాకనిపించును నీవులేనిచో
గవ్వలు మేలి రవ్వలుగ కాననముల్ నవ నందనాలుగన్
గువ్వలు రాజహంసలుగ గోచరమౌ గదె నీవు గల్గుచో;

వాడిన జీవితమ్మున నవప్రసవమ్ములు గ్రుమ్మరింపగా
లేడు విధాతగాని అవలీలగ నీ సొగసైనచూపు పెన్
మ్రోడును మేడగామలచి ముల్లును మల్లెనుచేసె, గారడీ
వాడు సలాము సేయునిక బ్రహ్మను మించిన నీకు కొమ్మరో.

మద్యనిషేధమున్న యెడ మాకు నిషా కలిగించు నీ కనుల్
పద్యము వ్రాయ నేర్పినవి; లక్షల గుండెల బీడునేలలో
సేద్యము సేయ నేర్పినవి; జీవితమెల్లను దేశ మాతృ నై
వేద్యము సేయ నేర్పినవి వీరత ధీరత విస్తరింపగా.

వీర రసమ్ము రూపుగొని వే సనుదెంచిన యట్లొకప్డు శృం
గార రసమ్ము మూర్తిగొని కన్నుల గట్టిన యట్లొకప్డు స
త్యారమణీమణీ నిభ మహత్త్వముతో విలసిల్లు నిన్ను నిం
డార కవుంగిలింత జన నాంతర పుణ్య ఫలమ్ము కాదటే – ?

ప్రాణము బాణమట్లు పగవాని ఉరమ్మున గ్రుమ్మి సచ్చు సే
నానికి చేత సత్వమిడు నాతివి రాతికిగూడ ప్రీతి లో
లోనరగుల్చు గీతివి, విరోధి గిరీంద్ర నికాయహేతి. వ
జ్ఞాన తమస్సమూహమును నాశము చేసెడి జ్యోతివే ! చెలీ !

జ్వాలవునీవు నీ హృదయశాలను వెచ్చదనమ్ము పొంగి హై
మాలయ కందరా శిశిరమందు వసంతము సంతరించు ఉ
ల్లోల పయోధి బాడబ గుళుచ్ఛము నీ కబరీ భరమ్మునన్
పూలయి అందగించె నినుబోలిన బాలికలేదు సృష్టిలో.

చేతనతాపయోజము హసించును నీ నయనమ్ములందు సం
గీతకళారహస్యములు నిక్కును నీ గళ సీమయందు ప్రా
భాతనవారుణార్క కరపల్లవముల్ వెల వెల్ల బోవునే
నీ తరుణాధరోష్ఠ రమణీయతజూచి అనంగ మోహినీ !

భుజమున కింశుకాంశుకము బూని కటీతటిపై వికస్వరాం
బుజలలితాంబరంబునను పోకముడిన్ సవరించి నీవ అం
గజునకు ఆడురూపమయి కాంతుల కాంతలనేకరీతిగా
గజిబిజి సేతువే ! విజయ ఘంటలు మ్రోగెను నీ పదాలలో !

అందని నిన్ననందుకొని అందినవెల్ల త్యజించినట్టి నీ
బందికివిందు సేయగదె ! బంగరు వన్నెలచిన్నిదాన ! నీ
అందెలు గల్లు గల్లుమన అందరిడెందము లెందుచేతనో
తొందర జెందు; గుండెపయి త్రొక్కుచుపోక అనుగ్రహింపవే !

పిరుదలుజారి, వాలుజడ పిక్కలజేరి భుజంగమమ్మునా
కొరకొరలాడి, నాల్కలను కోరి ఫణమ్మునుసాచి గట్టిగా
కరచినచో హలాహలము గ్రక్కినచో భరియింపజాలునీ
నరుడొకడున్నవాడు మరణమ్ము తృణమ్మటు తృంచివేయునే.

మనదొక వింతప్రేమ మధుమాసమునన్ పికమేమి పాడినన్
వనమున నేమి పూచినను పట్టదు; నీ హృదయాంగణమ్మ పం.
చనుగల గున్నమామి కడు చక్కనిపండ్లనొసంగి, వాని చెం
తను మనమేకమై ప్రణయనాట్యముసేయుద మెల్లవేళలన్.

ఋతువులు మార్చివేయగలవేచెలి ; శైశిర నగ్నభూజ సం
తతి నినుజూచి కౌసుమ వితాన దుకూలములన్ ధరించి, స్వా.
గతమునుపల్క చిల్కలముఖమ్మున నీ పదపంకజాత సం
గతిని పథమ్ములెల్ల నవకమ్మున పూలరథమ్ములయ్యెనే.

నీ వెటనుందువో యచట నిమ్నగలింకవు లేళ్లు జంకవున్
పూవులువాడ వంధతమముల్ భువినాడవు పండు వెన్నెలల్
జీవమువీడ, వక్రువులుచిందవు; గుండెలు కుంద వక్షి రా
జీవములందు రాగము నశింపదు, ద్వేషము సంభవింపదున్.

తిష్యరక్షిత

కరుటూరి సత్యనారాయణ

మతమను పేరిటన్ బిరికి మందిడిపోయిన శాక్యమౌని జీ
వితమును గొప్పగా నెమరువేయుట లెస్సగ నేర్చుకున్న నీ
బ్రతుకున శాంతిలేని గతి పట్టెను-దీనికి సంతసింతువా ?
మతిచెడి కొంతయైన యభిమానము నొందక యూరకుందువా ?

బాకులు దూసి నా ప్రణయ భావము చెడ్డగ నెంచినట్టి యీ
లోకము మాట నా యెడఁదలో గణియింపను, సానుభూతి నీ
పోకడ లాత్మయందుఁ దలపోసెడువారలు కొందరున్నచో
నాకు చరిత్రలో నొసఁగు నట్టిగతిన్ స్మరియింప భూవరా !

కుతకుత పొంగు జవ్వనపు గోర్కెల తాకిడి కాఁగలేక జీ
విత మొక స్వప్నమట్లు నడిపింపఁగ యత్నము జేసి చేసి, నా
కతలిటు తెల్లవారినవి కాంక్షలు మేదిని రాలిపోయెగా
బ్రతుకు పథాలలో దిరుగుబాటొనరింతు నభీత చిత్తనై .

కిలకిలలాడు ప్రాయము చిగిర్చిన ప్రాణులు శుష్కధర్మ చిం
తలను మెలంగుటన్న శతథా నరకమ్మగు నిన్ను కోర్కెలన్
కలకలలాడు నిప్పటి సుఖంబులు కోరినవేళ వచ్చునే ?
వలపున జిచ్చు పెట్టుటకు వాంఛ జనించునే ! యీ వయస్సులో !

తత్త్వములన్ని గుర్తెఱుగు ధర్మము వీ పయినుండెఁ, జక్రవ
ర్తిత్వము బూనియిట్లు విపరీతపు వాక్కుల నొవ్వనాడి, శ
త్రుత్వము నూనినావు నను దోషిగ నెంచి యశోక భూప ! భా
ర్యాత్వము నిల్పుకోదఁగని రక్కసినో ! తమ ప్రహస్తదృష్టిలో !

నీవును, బౌద్ధధర్మములు నిల్తురులే ? కలకాలమిట్టులన్
జేవ దొఱంగకుండగ నశింపక; నేనెటులై ననేమి ! మీ
పావన తత్త్వమార్గములఁబాసి వృథాచరియింపరాదు? ఆ
సేవలలోన కాలము విశిష్టము చేయుఁ డశోక భూవరా!

వయసులు పశ్చిమమ్మునకు వ్రాలిన మీదటగాని యింతలో
నియమములున్, దపంబులును నిశ్చల బుద్ధులు, జ్ఞాన సిద్ధులున్
గయ చని బోధి వృక్షమును గాంచుట లబ్బునె ? వెఱ్ఱివాడవై
బియలును గొగలించుకొన వచ్చెడిదేమి మహాప్రభూ ! యికన్.

ఇపుడిక రాజశాసనము లేమియు నాదరిఁ జేయరావు, మీ
కుపిత విలోకనమ్ములును, గ్రూరవిధుల్ పెడబాసి యీ ప్రపం
చపు పొలిమేరలన్ గడచి సాగెద మిన్నులువడ్డ చోటికిన్-
జపముల మత్తులోఁ బడవశమ్ముగఁ గాలముఁ బుచ్చుడీ ప్రభూ !

పతిత జీవితంబుల కలవాటుపడిన
బధిర పంగ్వంధులకుఁ గల్పవల్లియైన
బోధిసత్త్వుని యుపదేశ ముద్రఫలము
వెఱ్ఱితల యిండ్ల లెస్స జీవించునింక

హృదయమేలేని యీ జగంబింక నన్ను
స్వైరిణిగ నెంచి నిందలు సలుపనిమ్ము
కోరికలఁజంపి యిటు హతమారుకంటె
నా పలుకె చాలు నాకు శ్రేయస్కరమ్ము.

సారములేని నాభ్రితుకు చంచలమయ్యెను-రక్తిలేని సం
సారము మ్రోడువంటిది - విచారము మిక్కుటమయ్యె ! గుండెయే
సీఅయిపోయె సుంత గమనింపుము నా జతనమ్ము నందునన్
నేరములెంచ వీలె ? యిటు నింద యొనర్చుచు భూమిపాలకా !

గెంటని ప్రేమతో మనసు కేకిసలాడఁ గుణాలు పొందుకై
మంటికి మింటికిన్ నడుమ మార్గము లెన్నియొ చూచిచూచి నే
కంటిని కంటకమ్ముల, నగాధములన్, సుడిగొన్న దైన్యమున్-
మంటలుమండె గుండియల మానవనాథ ! మఱేమి చెప్పుదున్ -

గోపికా నౌక

మధువాపంతుల సత్యనారాయణశాస్త్రి

నల్లని మొయిళ్ళలో దటిద్వల్లి మొలచి
పూచెనో యన లోచనా సేచనముగ
రంగదుల్లోల యమునా తరంగపాళి
నల్లదే తోచు గోపీ విహారనౌక.

కరనీరేజ సువర్ణకంకణ ఘలం ఘుల్లావముల్ మించి, క
స్తురి బొట్టుల్ చెమరించి వేనలి విరుల్ తూగాడి, యుంగ్రాల ముం
గురు లూగాడి పయోధరంబుల చెఱంగుల్ జాటి శ్రీ గోపికా
తరుణుల్ త్రోసిన రత్ననౌక కదలెన్, త ద్యామునాంభస్రుతిన్.

ఆకంఠంబుగ గ్రొత్తవెన్నదిని చెల్వొ జిడ్డు నోరార వం
శీ కల్యాణ పురాణగాన సుధలన్ జిందించుచున్ గోపికా
నౌకాభ్యంతర సంచరిష్ణువగు కృష్ణస్వామి లీలల్ మరు
ల్లోక స్త్రైణ దిదృక్షగ్రొందలపు మేలున్ దీపులూరించెడిన్.

ఒక్కతె మోమునన్ దిలక మొక్కత తీరుచు నొర్తు గొల్లతన్
జక్కిలిగింత పెట్టు నౌకచాన, యొకర్తుక యొర్తు సుందరిన్
జెక్కిలిమీటు నొక్క చెలి చేడియ నొర్తుక గౌగిలించు స
మ్యక్కలనాత్మ సంగత నిజాధిప గోపకిశోర భావనన్.

పాడిన పాటకై దెసలుపట్టక యా నవనీత చోరుతో
నాడిన యాటలై యెడద లాగక లోదలపు ల్వెలార్చ, మో
మోడక ధూర్త బాలు పొలుపుల్ చివురింప నరిత్రపాణులై
యోడక గోపికారమణు లూగిరి రత్నపుటోడ వేడుకన్.

అనువారన్ డకటొంకు పల్కులఁ సరోజాక్షీ సమాజంబునన్
నెనరుంబోఁడుము ల న్వెలార్చుటలె కానీ, కృష్ణడింభమ్ము నా
వ నిటుల్ మావలె జక్కఁదాను నడిపింపన్ జాలునే! యన్న త
ద్వనితాంతర్గత గర్వరేఖ నడగింపన్ లోన భావించుచున్

నాకొకఁ పతి నీలగాత్రుడు జగన్నాథుండు పల్కున్ చెలుల్
నాకంచెన్ మరి మీకు దిక్కవఁడు! ప్రాణప్రాణముల్ మీకు నే
చీకున్ సోఁకఁదు సందియమ్ము విడి మీచేఁ గోలలున్ఁ ద్రెడ్డులన్
వాకన్ వైవుడు నౌక తా నడచి పోవన్ జూతు నే నొక్కఁడన్

యమ సహోదరితోఁ జెరలాట మనుచుఁ
దలప రా నందపోతమ్ము పలుకుత్రోవ
నావ నడపెడు దమ సాధనముల నెల్ల
బాఁవైచిరి గోపికా పద్మముఖులు.

అంతన్ గృష్ణ ఘనాఘనంబొకడు వింతై యంతయై తోఁచియ
తంతై యంబరమెల్ల గప్పువడ గర్భాభీల విద్యుత్ప్రభా
క్రాంతిన్ వచ్చెను గాలివాన యమునారమ్యాపగా మధ్య నౌ
కాంతర్మందిర సుందరుల్ సుడివడన్ హాహా-నినాదంబులన్-

కల గుండు వడిరి గోధు
గల జేక్షణలా యమస్వసావాహినిలోఁ
బులిమీదఁ బుట్ర! యొకచోఁ
జిలువడి యప్పడవ నీరుజేరం దొడగెన్.

చేతి కోలలు గంగపా లేసికొన్న
తోయలులు నావఁ గాళుల త్రొక్కుకొనుచు
హరిహరీ! యింక నే మున్న దనుచు వగవ
గృతకమగు నార్తిఁ బొగిలె నా కృష్ణమూర్తి

పాలముంచెదవంచు గోపాలబాల ;
నమ్మకొనియున్న మా జీవనమ్మ లిపుడు
నీట ముంచుట నిజమగునే ; దయాబ్ధి ;
శీఘ్ర మనపాయగతి నొడ్డుఁ జేర్పఁ గదవె ;

ఆశలు దక్కఁ మా బ్రతుకులాఁబడియై యమునాస్రవంతి కా
పోశన మౌటకున్ బొగుల మక్కఁట ; కౌఁ గిటఁ బట్టి యీ పయఃప్ర
కోశములో యశోదకొడుకున్ దిగడింతుమె ? యన్న గోపికా
క్రోశము వెన్నదొంగ విని కూర్మిఁ గరంగుచు వారికిట్లనున్ –

ముంచుకొని లోనఁజొచ్చె యీమున జలంబు
దానికిన్ దోడు మీ యశ్రుధార లగునె ;
వెట్టి గోపిక లేద్వక వినుడి: యొక్క–
యనువు దక్క లేదు గత్యంతరంబు.

నౌకాంతఃప్రవిశజ్జలౌఘము వెసంవారింపుడీ ; చిద్ర రే
ఖాకారమ్మును బట్టి పుట్టములు గ్రుక్కన్ వెల్లి తా నేగెడిన్
పాకఁబింతయు మించనీయకుడి ; యీపద్ధర్మ మల్లించి మీ
మీ కంచూలము లూడ్చి పూడ్చఁదగు నేర్మిం రంధ్రభాగమ్ములన్

చండతర పురోగత జలగండ భీతి
విగళిత వ్రీడలైన గోపీ తరుణులు
సత్వ రోన్ముక్త కంచుక సంచయమున
నెఱపు జతన మ్మదెల్ల న న్నీటఁ గలసె.

రభస రభస నౌకా భ్రమ ద్భ్రూజ యువతులు
లైక లూడ్చిన పాలిండ్లరంగు బెడఁగు
పొంగుమీరిన యమునాతరంగిణీ పయి
నుడ్డయ తోఁకరేఖ నా నొఱపు మీఱె.

వితయైపోయిన తత్ప్రయత్నమున గోపీభీతనేత్రల్ త్రపా
వ్రత భంగమ్మయినన్ ఫలం బొదవమిన్ వాపోవుచున్ 'శ్రీహరీ
గతి నీవే' యని నమ్ము మా కిది పరీక్షాకాలమా ! యింక మా
బ్రతుకుల్ లేవని పాణితాడిత నిజోరస్సీమలై యేశ్వఁగన్.

ఆర్ద్ర హృదయుడు బాల నారాయణుండు
పలికె లోమొల్క నగుమోము చెలువుగులక;
చేత నై నంత వట్టు చేసితిరి మీరు
వేఱ యేమంటకును నాకు నోరురాదు

అనెడిమాట నోటననుండ నబ్బురముగ
గోపికా నౌకపై తెరచాప దిగియె
నపు డనన్యాత్మలగు హంసయానలకును
స్వాగతముపల్క యామున సైకతంబు

వ్రజ నీరేజముఖీ కపోలములలో బాలుండు గోపాలుఁ డ
క్కజమై యొక్కఁడ యయ్యుఁ బెక్కుగతులన్ గన్పట్టఁ బ్రత్యక్ష భా
వజుడౌ నాతని లీల లారయఁగ నస్వప్నాంగన ల్వచ్చి యా
రజమై చూడఁగ వారికిన్ బొడమె ! నౌరా ! సాత్త్విక స్వేదముల్.

విషాద మోహనము

వాయని సుబ్బారావు

మోహనా ! మోహనా !మోహనాకార !
మోహనశీల !

మోహనా ! మోహనా ! భూత కరుణా స
ముద్రాంతరంగ !

మోహనా ! మోహనా ! గురుజనార్చా ప్ర
మోదానుభావ !

మోహనా ! మోహనా ! వత్సలాగర్భ
ముక్తాఫలంబ !

గేహనవరతోత్స వాభ్యుదయ కళా
కేంద్రావతార !

గేహేందిరా మన ! కుముద వికసన
క్రీడా వినోద !

గేహి దృష్టి చకోర సంతతానంద
కృత్సిత్ర జ్యోత్స్న

మోహనా ! రాకా నిశా మనోహర
పూర్ణేందు వదన !

ఊహలు నీహలన్నియు నీ యండె
యుంచి మేముండ

నీహామృగము వోలె పట్టి మిత్తి ని
న్నెత్తుక పోయె !

మోహమ్ము గెలిచిన నీకు తప్పదు
ముక్తియే।బుత్ర
మోహాంధకార సంచన్న బుద్ధిని
పొగిలె దే నిట్లు ।

ఇరువురు మును పుట్టి గిట్టగా నంత
నీవు జన్మించి
పరదేవతానూన విమల భక్తి సం
భరిత మీ యమ్మ
వర గర్భమున నెండి యెండి బీటలు
పడిన మా యెదల
మురిపించి మరపించితివిర వర్షముల్
ముప్పుడియైదు
సుతుడులేడని వంత తొలిగి మా మన
శూన్యాంధ మడగ
సితపక్ష పర్యాయవృద్ధి దనుకొత్తు
శీతాంశు బింబి
మతితర పూర్ణిమాశోభ నందిన
యంతలో నిట్లు
హతవిధీ। యొక్కట వచ్చి పడెనె మా
యపు టమావాస్య ।

ఇకనేమి వెలుగురా తండ్రి । హతభాగ్య
మీ జీవితాంధి ।
కకు నంధ తమస రాక్షసియు పెల్లేచి
కఠిన కరాళ

వికట దంష్ట్రిలుగ్రుచ్చి మన్మనస్సర్వ
వీధులు కెలకు

నిక నీ యమావాస్య యొక్కొ పే తిథి
యిచట నా కెపుడు ;

మంద సంచాలన సౌరభమ్ములు
మలయా నిలముల

స్కందత్సకల పుణ్యావాసనలు పుట్టై
రుం రూ నిలములు ;

నందన మందార మధుర మకరంద
నాదేయ వీధి

భిందన్మ హోర్వీజ మూలములు పుటె
విషకీటకములు ;

చందన చర్చాతి శీతలమ్మగు
చలివేంద్రలోన

కందించు నూష్మ గర్భములు పుట్టె నం
గార ధానికలు ;

ఇందిరా సుందరీలాస్య కళ్యాణ
హేవాక గతుల

విందాన విలయాట్టహాసములు పుటె
భేతాళ గతులు ;

వందారు నిజభక్తురాలి హృదయమ్ము
ద్రవ్యలుగాగ

నందంద యదిమె త్రిశూలమకటక
టా జగద్ధాత్రి ;

కందర్ప దమనుని ఫాలనేత్ర ము
గ్రజ్వాల లుమిసె ;
కందర్ప జనకుని వెలుగుకనులు చీ
కటి కోనలయ్యె ;

పుణ్యాత్ముడవునీవు పోయితి పరమ
పుణ్య లోకము ల
రణ్యవాసముగదే నీవులేని యీ
ప్రతుకు మా కిచట ;
గణ్యముల్ వత్సల పూజలన్నియు
గంగ పాల్గాన
గణ్య మత్పాపాగ్ని యిట్లుమొదలంట
కాల్చెనో మమ్మ ;

ధనధర్మదయాపరుడవు నిన్నిట్టి
దారుణామయము
హూనకారణ మేమెు తోచదత్యల్ప
బుద్ధికి నాకు ;
ఆనాడు కాలువిరిగియు పోనైతి
నపుడె పోగన్న
నీ నాడులేకుండె గదర దుర్భర
మ్మియాత్రినాకు ;

పావనాత్ములు ప్రేతిపాత్రులాయేమి
భగవంతునకును
తావేగిరంపండి నిన్నురావించె
తన సన్నిధికిని

నీ వొక్కడవె తేపవైన మమ్ము కొం
చెము కటాక్షించి
తావేచియుండిన నేమిపోయెనో
తనయబ్బ సొత్తు!

పరివ్రజనము

ద్వివేది సత్యనారాయణ సూరి

అరుణోదయ ప్రభ నతకరించెడు దీప్తిఁ
గాషాయ వస్త్రమ్ము గంతు లిడఁగ
క్షీరాబ్ధిఁబన్నుండు శ్రీనాథుడో యనఁ
బరివేష వదనమ్ము మెఱపు లొరయ
కామండలవదండ మండిత కరయుగ
కాంతు లన్యోన్యమ్ము కౌఁగిలింప
బ్రహ్మవర్చస సముద్రస్వామి కెరటాలు
కన్గొయి చెలియలి కట్టముంప
మౌని యాజానుబాహు కర్మంది యొకడు
పాల సంద్రము మధియించు భాతి తోఁప
వావదూకులు మతిమదుల్ కేవలత్వ
లబ్ధికై దేవులాడు వేళఁ, జరీన
సచివునకు రాణీకచట సాక్షాత్కరింప

సదీహం మహాన్తం భజన్తం చిదంతం
సమస్త ప్రపంచస్య భారం వహన్తం
భజే చిద్ఘనానంద పారమ్య మౌనిం
ప్రజే శంకరం దివ్యకైవల్య దేవమ్.

సదా నిర్వికల్పే సమాధౌ నిలీనం
తథా ప్యత్ర భక్త ప్రసన్నాంత రంగే
హసన్తం లసన్తం ప్రశాంతాంతి లోకం
భజే మాధవం త్వాం పరబ్రహ్మరూపమ్.

శ్రీమత్కరాత్పర మనోహర మోక్షలక్ష్మీ
ధమ్మిల్ల మంజుల లతాంత విరాజమాన ;
భోస్వాగతం, నిగమరంజనీ ; ప్రత్యగాత్మ
న్నాత్మార్పణ గతమముం కురుభక్తి యుక్తమ్.

పారంపర్య పరిష్కవల్ల హరికాష్ఠావ్యమ్ము యుష్మచ్చిదా
కారాకారిత దివ్యహాసమయ దుగ్ధాబ్ధిం బ్రియాణింపగా
గోరున్ మామక దీనదీనకుమనఃకుప్పల్ల వంగమ్మిటన్.
మేరల్ దాటి చిదాత్మఁగోరుదురు మిమ్మీక్షింప నసోదృశల్

దహరాకాశము శింశుమారము పరార్ధమ్మౌ మహర్లోక పున్
"భహరా"ల్దాటి పరాత్పర ప్రకృతి సీమన్ జన్మపారంపరీ
జుహురాశోపరియాన లభ్యము పరంజ్యోతిస్స ముద్రాంతరో
ల్లహరీయానము నీదు దర్శన మహాలాభమ్ముచే ధన్యుడన్.

పద్మినీ భాస్కరము

మోటూరి వెంకటరావు

తిమిర సమూహము త్రెళ్లి ద్రీల, రోచి
ర్విమల మనోహర వీచిరేవఱల్ సాం
ద్రముగ నలోన్మిషిత ప్రభాతమై సం
భ్రమ శుభ సంయుత రక్తిగాఁ దలిర్చెన్

విపుల నభోంతర వీధియెల్ల కిమ్మి
రపు సుషమా ద్యుతిరాశిఁ దోఁగు క్రొంజె
న్నపు సుమ మంజులస్ ద్రభుల్ల రేఖా
వపువునఁ బెండిలి పందిరై రహించెన్

కడు రుచి మంతము గాఁగఁ దూర్పునం దా
గడపలు హరి వికాస శారదీప్తుల్
గడలు కొనెన్ బహు కమ్ర కుంకు మాభల్
ముడివడు క్రొం బసుపున్ బసల్ డొలంకన్.

నవకపుఁ ద్రా గ్జగన ప్రతోళిఁ దోచెన్
ద్రవహ సమాన జవమ్మునన్ దురంగ
ప్రవరములేడు దుఱంగలించు సప్త
వ్యవ కలితంపుఁ ద్రభా ఖలీన పాళిన్

అరుణుడు కాంతిహాయ ప్రయుక్త తేజ
స్ఫురిత రధమ్మున భూరి మోహనాంచ
ద్వరుడుగ వచ్చె శుభ స్వరూపుఁడై సుం
దర తర పద్మ సుధావధూ గ్రహార్థిన్.

స్వాంతమ్మను రాగ మహాఖనియై
అంతఃకవితారుణ హావకళా
కాంతుల్ విరచింపఁగఁ, గాంతుడ-భా
స్వంతుడు - జ్జ్వలించెను పద్మినికై.

బింబ ప్రతి బింబ వివిక్త విధా
నంబై, ఇనరాగక నత్కమనీ
యంబైన మయూఖ సహస్రములన్
బింబించె జగంబు, నవీనరుచిన్.

పద్మ ప్రియుఁడైన ప్రభాకరు హృత్
సద్మమ్మున మోహల సచ్ఛిఖలన్
బద్మప్రియ గాంచెఁద్ర పాముఖియై
పద్మాకర దివ్య సువాసినిగా.

నిండారగ నెచ్చెలి నెవ్వలపుల్
పండించు సముజ్జ్వల భీతిని లే
యెండై, తనప్రేమ రహింపగ, భా
నుండేచె సఖీసు మనోజ్ఞగతిన్.

దృగ్గోళ పరిక్రమ దీధితులై
నిగ్గుల్ పతిమోమున నెట్టుకొనెన్
మొగ్గల్ వరుసన్ విరఁబూయునటుల్
సిగ్గుల్ సతిబుగ్గలఁ జిందులిడెన్.

రాగత ప్త రుచిర ప్రణయుండై
ఆగమించు మహితాంశు రవిన్ బూఁ
దీగె చాల్పు వినుతించి నివాళిన్
స్వాగత మ్మొసంగె నత్యను రక్తిన్

పుంగళారవపు మంజుల గీతా
భంగ రంగ దవిభక్త విహం గో
త్సంగ రంగ విలసన్మధు సాంగో
పాంగమయ్యె సకలావని నెమ్మిన్

ఏళ్ళలోను సెలయేళ్ళను వీచీ
వల్లకీ మృదు రవమ్ములు ప్రోఁగెన్:
బీళ్ళపైని హిమబిందు తతుల్ శో
భిల్లె ముత్తెములు పేర్చిన లీలన్

చారునేత్ర సువిశాల సహాస
శ్రీరచించు సరసీరుహ చంచత్
సారవీక్షణపు సౌరులు ప్రీడా
స్ఫార బంధురము సాధ్వ్యాచితమై.

చిమ్మచీఁకటుల జీటివెలుంగై
ప్రేమ్మభాస్కరుని ప్రాభవమున్ వి
శ్వమ్మ నింపుకొని స్వాగత మీయన్
దమ్మ పూఁజెలియ దత్తఅమొందెన్.

కవి గండ పెండేరవంత

పైడిపాటి సుబ్బాశాస్త్రి

గొజ్జంగి తేటలో మజ్జనంబాడి, జ
రీ ముద్ద వల్వ ధరించి. యుల్లి
పొర మించు పల్చ నంగరఖా బిగింపించి
పటు రాజసపు కోరపాగఁ జుట్టి

గమగమ వలచు చొక్కపు జవాది నలంది
సింధూర తిలకమ్ము చికిలిసేసి
బుగబుగల్ ముసరు కప్పురపు వీడెముసేసి
రంగుగా రత్నహారములఁ దాల్చి

పచ్చ కాశ్మీర శాలువ వల్లెవేసి
పసిడి పల్లకి హొంబట్టు పరుపుమీద
ముసిముసి పసందు నవ్వుల రసికమౌళి
తరలె సభ కాంధ్ర కవితాపితామహుండు

గరుడ పచ్చల గద్దె కవిరాజునకుఁ జూపె
కృష్ణరాణ్మణి యపాంగేక్షణములు
పచ్చి కస్తురి పున్గు తెచ్చి పూసిరిమేన
మచ్చెకంటులు మేలమాడి సుంత

సురభిళమ్ములు పూవు సురటీల వీచిరి
తరుణులు కంకణస్వరము లొలయ
అచ్చ సంపెంగ పూవు టత్తరుల్ జిలికించె
నుత్తరీయము మీద నొక్క పడుచు

భోగ సంతర్పణ స్వస్థ పులకితమతి
బొచితీ సమజ్ఞాధురీ రోచి సుకృతి
చిగురు కనుకోస వెన్నెలఁ జిందె సుకవి
భరత వేదంపు విశ్వరూపమ్ము విరిసె.

కృష్ణభూధవుఁ డొక్క క్రేగంటఁ జూచెను
తిమ్మర్సు నొకవంక తేరి చూచె
గండపెండెర మొక్క గజయాన తెచ్చెను
పసమించు బంగారు పళ్ళెరమున
పదియారు వన్నెల పసిడితోడ పరీక్ష
రాటుతేలిన మేలి రత్నములను
చేయితిర్గిన మహాశిల్పి పొదిగె దాని
కున్నవి చిఱుగంట లొకట నొకట

తఱచి చూచిన కృష్ణ భూధవు రసాత్మ
బింబమగునేమొ యాగండ పెండరమ్మ
మించునన్ మించి కను మిరిమిట్లు గొలిపె
నిలువరించియు దివ్య కాంతులను తఱిమె.

సింహ పీఠికలోని చిఱునవ్వులను చూచి
సచివ వర్యుడు లేచి సభకు పలికె
దిగ్గజములు మీరు దేశమ్మ నంతటఁ
బేరు మోసినవారు పెద్ద కవులు
విద్యా నగరమన్న విజయ నగరమన్న
పెర కవిప్రభులకు పిక్క చెదరు
దేశ భాషాసుధన్ దేవ భాషాసుధన్
జేరిచి కవనమ్ము చెప్పు వారి

పిలుచుచున్నది యీ గండపెండరమ్మ
ఎవరి పాదమ్ము దీనికై యెదురు చూచు
నెఱుగ గోరెను కృష్ణ పృథ్వీశ్వరుండు
శిరమునను నిల్పు గండపెండరపు మెఱపు.

ముడిచెను కాలొకండు మరి మూర్ధము వంచెను వేఱొకండు, తా
నిడుపుగ నూర్చె నింకొకడు, నింగికిఁజూచె మరొక్కడున్, మహా
జడనిధి మున్గిపోయినటు సంస్కృతి లేకయె యుండె నొక్కడున్
గడగడ లాడిపోయె కవి కాండము నోటను మాట లేదహో !

ముందు పుట్టెనెగాని మొలచెనే కొమ్మలు
నన్నయ్యభట్టున కన్నవారు
దిగివచ్చెనాయేమి తిక్కన్న దివినుండి
యెంతకైతని యాసడించువారు
పొడిచివేసినదేమి పోతన్న కలడులే
యాపాటికైతయంచన్నవారు
చిచ్చట పిడుగటో శ్రీనాథు డెంత ఘా
ఢారు కైతని నోరు జారువారు

పలువు రుండిరి వారహంభావ కవులు
ఇన్ని నాళుల కగ్ని పరీక్ష వచ్చె
నేది పుత్తడి యిత్తడి యేదొ తేల
వలసి యుండగ నొకరునుఁ బలుకరైరి

ఓ కవిసింహులార ! వినరో ! యని మంత్రియు నూరకుండె హే
వాకముగా నధీశుడు సభాముఖ మంతయుఁజూడజూచె మం
దాకినివోలె సాగు కవితాసుధయంతయు నింకిపోయెనా !
ఓ కవిరాజులార ! వినరో ! యనె తిమ్మరుసయ్య వెండియున్

అన్నర నాధు చూడ్కులను నా యెడ మాటలు బాకు పోటులై
క్రన్నన పల్కొకండు వినగానయి దీనికి నల్లసాని పె
ద్దన్నయె దక్షుడంచును నతండును నట్టుల౮బల్కు ముక్కు తి
మ్మన్నను గాంచి యూరకొన మాటికి కొందరు నల్లె పల్కరౌ

గడియ వచ్చెను శృంగ భంగమున కనుచు
కరుడు గట్టిన యీర్ష్యతో కవులు కొంద
రాంధ్ర కవితా పితా మహుండైనవాడు
గండపెండేరమును గొను ఘనుడుననిరి

కవితాపితామహా ! గండపెండేరమ్ము
మీ సొమ్మె యనియె నమ్మిక నెలార్చి
ఏ మిన్నకుంటయునిందులకే ప్రభూ !
కలరుగా మనవారు కవులటంచు
పెదవాడను గండ పెండేరమునకేమి
వృద్ధికాములు కవుల్ పెక్కు గలరు
ఉన్నవారందరు యూరకుండుట చూడ
మివుల నామీద గౌరవము పేర్మి

ప్రభువు వీరలు నన్విన వలతురేని
రసిక లోకమ్మునకు ననుగ్రహమయేని
బిరుదు లివియేల కైత చెప్పెదను వినుడు
ననుచు పెద్దన్న మొదలిడె నాళు ఫణితి

తేటులానిన విరితేనె యంచులు పొంగి
పొరలుచు ధారగా గురియు సొరు
నిలువు దారాలుగా నిండు పున్నమి నాటి
వెన్నెలల్ చలవలన్ బిండు తీరు

అంటు బిగియు నాటి జంట మల్లియ కొన
రేకవిచ్చియు గుబాళించు సొగసు
ఎదమె త్తనైన తుమ్మెదపాట యూటగా
జాలుగా వాగుగా సాగు హొసు

ఒక్క గాలికి పొదవెదురూదు మురువు
కలికి చేతను కిన్నెర పలుకు హరువు
కోయిల యొకండు కో యని కూయు కులుకు
ఆకుకవితా స్రవంతి పొంగారి పోయె

ప్రావృట్పయోద గర్జా కర్ణన స్ఫుర
న్నీల కంఠానీక నృత్యములును
గంభీర దివ్యసాగర సంగమోద్రి క్త
విబుధాపగా సుహృద్విలసనములు
అనుకూల సమయ ప్రేమా మోద ముగ్ధాతి
కోమల కలహంస కూజితములు
అతిపుణ్య జీవనాభ్యర్చిత కల్హార
మాలికా డోలికా చాలనములు

ఆంధ్రకవితా పితామహు నల్ల సాని
పెద్దనార్యుని యాకుకవిత్వమయ్యె
జయ జయ ధ్వానములు మింటి చాయ కెగసె
నతడు కూర్చుండె కృష్ణరాయలును లేచె.

కలివేళ సుకవులేకద మౌను లట్లాట
నపరాధమయ్యె నాయాజ్ఞవలన
అభిమానమని కొంద రాడుకొందురటంచు
శ్రమ నిచ్చితినిగాని శంకలేదు

రసనిమ్నగలు మీదు రసనాగ్రమున నిల్చి
బహుజన్మ పుణ్య సంపాదితములు
కనకాభిషేకమ్ము కవికిఁ జేసియొకండు
సంగ్రహించె యశఃప్రశస్తి ధనము

బ్రహ్మ తేజమ్ము జిందిన పరమమూర్తి
గండపెండేర మేను మీకాలఁ దొడిగి
పావనముఁజేసి కొంను నీ భవము నిపుడె
అనుచు వినయముతోడ రాయలు వచించె.

అనెనొ పెద్దన్న రాయలు నంతకదలె
పడతియొక్కఁతె పన్నీటి కడవ తెచ్చె
చానయొక్కఁతె పట్టు వస్త్రమ్ము తెచ్చె
పరమ సచివుడు గండపెండెరము దెచ్చె

హేమాంగియొక్కఁతె హేమ కలశమెత్తి
నిలువుధారలను పన్నీరు కురిసె
పద్మగంధి యొకర్తు పట్టువస్త్రముఁ దీసి
తడియొత్తె కవికి పాదద్వయమ్ము
గండపెండేరమ్ము కౌతుకమ్మున తొని
కందిచ్చె నతడు తిమ్మయ్య మంత్రి
సర్వంసహా భర్త సాహిత్యనిధి కవి
తలజుండతడు పాచమునఁ దొడగె

చిఱునగవుతోడ సుకవి యాశీర్వదించె
సభయు సభయెల్ల పూవుల జల్లుకురిసె
ఆ ముహూర్తమ్ము దివ్యోదాత్తసధము
కొలువు కొలువెల్ల నపుడు వైకుంఠమయ్యె

శ్రీకృష్ణుడు పెద్దన్నకుఁ
బ్రాకటముగ గండపెండెరమ్మును దొడిగెన్
ఆకల్పాంత స్థాయిగ
నీకథ మా తెలుగువారి యెదలన్ మెదలున్.

చంద్రయాత్ర

ముదిగొండ వీరభద్రమూర్తి

గంగకును యమునకు మధ్యఁగల ధరిత్రి
వలె శశస్థలి చంద్రమండలపు నలుపు
యజ్ఞభూమి దేవతలకుఁ బ్రజ్ఞభూమి
మానవులకు విజ్ఞాత ప్రత్యాణవులకు

చంద్రమండలమ్మునఁ దోఁచు సాంద్రతమస
మైన రోహణక ద్వీప మనెడి గుడిని
నరుఁడు నిత్య దీపారాధనమ్ముఁ జేసి
యవని వినుపించు నింక ఘంటారవంబు

అణుశక్తితోడ వెన్నెల
లను మర్త్యుడు చంద్రమండలమ్మునఁ గాయిం
చు నికఁ బ్రత్యుపకారము
లన నిట్లుండ వలె నిత్య రాకాశోభల్

విధుఁ బొగడని వాఁ డెవ్వడు
విధి దెగడని వాడు నెవడు విబుధుఁడును మహా
రథుడె న నేఁటి మానవు
కథ కధియింపని దెవఁడు రగడగా దివిలో

తండ్రికిఁ తుల్యుఁడయ్యు గడుదవ్వున నున్న విభావసుండు బల్
చండుడు చేరనీయఁడు, కురంగట నుండిన తల్లివంటి చం
ద్రుండు మనుష్యుఁ జేర్చికొని తొల్లిటి నుండియు నేఁటిదాక మా
ర్తాండ కుటుంబ వర్తి చరితమ్మును దెల్పు నుదాహరించుచున్

నేడు మనుజుడేగి నిదురించి విహరించి
మరలివచ్చెఁ జందమామ నుండి
నేటినుండి యమృతనిధి హరిణాంకమ్ము
శశధరమ్ము నగును జంద్రజగతి.

ప్రాఁకగవచ్చు నాకసముపైకి మొగిళ్లను మెట్ల పంక్తితో
డైకయిసేయవచ్చుఁ గుటజార్జున మాలల సూర్యునంచు వ
ర్ణాకమనీయ వర్ణన పరంపర నెన్నదొ చెప్పినాడు వా
ల్మీకి, నరుండు నేఁడు సవరించెను దానిని చంద్ర గామియై

ఆయుష్యమ్మున దక్కలేదిపుడు మర్త్య మర్త్య భేదమ్ము నేఁ
డీ యాకాశ మహాసముద్రమున నెన్నోద్వీపముల్ చుట్టి రా
వాయుస్ఫీతరభోవిభోజ్వల నభోవాల్లభ్య హేవాక నౌ
కాయానమ్ము లుపక్రమింపఁ బడుఁ బోఁ గ్లౌ యాత్రయే నాందిగా.

గ్రహయాత్రా పరమానవ శ్రమ విమోక్ష స్థానమౌ చంద్రకాం
త హృదాతిథ్య వితర్ది చంద్రుడు,వి మానశ్రేణి శ్రైష్ఠ్యంచు నీ
రహదారింబడి చేరవేయును బ్రజన్ బ్రత్యుత్త రాల్ ప్రేమ ధూ
ర్వహ గంధర్వ జగత్ప్రసాదములు వాహ్వా! ధన్యముల్ జన్మముల్

దూసుకపోవు నీమొగము దూసినదే విరిమల్లెలన్ గుమా
స్తాసతి! నేడు హేతువును శ్రావ్యము సేతువౌ నాగ నో! పతీ!
రాళులు హేమరత్నములు రాజముఖగ్రహరాజినుండి యిం
దె సమకూరుఁ జౌకగ నటంచు వచించును భార్య భర్తతో.

విహృతిన్ జేసెను యోగి యొంటరిగనే విస్వీధిఁ జంద్రాదిక
గ్రహలోకమ్ముల, నేఁటి భోగిజనముల్ రావెంట నా దవ్వులన్
బ్రహతాధ్వమ్ములఁ జేసెఁ బూర్వ మనుజేంద్రస్యందన స్వర్గ యా
నహితప్రౌఢి వీనుదోయి యిపుడందస్ జేసెఁ గందోయికిన్

అణుశ క్తి చలిత కర్మాగార సంభూత
వాత పోతములు వీవ నలరొంది
తద్ధరా గర్భ సముద్ధృతాంబు సరోవ
రంబులోపల ఖేలనంబొనర్చి
వర్ధిత తరుఫల ప్రసవ వలత్ఖగం
బగు నాఁటతోఁట వాహ్యాళి వెడలి
బహువర్ణ భాస్వరత్పాషాణ సంపన్న
సౌధ సీమన్నివాసమ్ముఁ జేసి

మానవుని ధర్మమా యని మలయుకొరకు,
దోఁడఁబుట్టిన వానింటఁ దొట్టఁ దొలుత
నడుగువెట్టుట యిదియేకదా! యటంచు,
జూచుకొనవచ్చు మంచిరోజు నిఁకలక్ష్మి

ఇంత తెలివైన వాడయ్యు నిందు నరుడు
వంద సంవత్సరములే బ్రతుకుచుండుఁ
జంద్రమండలవాసికి సంతు కలుగఁ
జాడవలె వారి యాయువు శోభయెంతొ!

మనిషి నేఁడు మనీషియయ్యె నతివేల
వశ్యవిజ్ఞాన శాస్త్ర రహస్య దీప్తి
నైననేమి? యసలు రహస్యము మనీషి
మనిసి కాలేదు భేదముల్ మరువలేదు

ఉర్వికినిఁ జంద్రునకు మధ్యనున్న దూర
మెంత? స్వార్థసమిష్టి సౌఖ్యాంతరస్థ
దూరమునఁ గొంత, ధని దర్ద్రులకు నడుమఁ
గల విభేదమ్ము కొలతలోన లవమంత.

ఇది హిమకాంతియాత్ర కురిపించెను మానవజాతి భౌతికా
భ్యుదయ పథమ్ములందుఁ దలపోయని మాయని పండువెన్నెలన్
ఇద్ది లిఖియించె శాసనము నిందుతలమ్మున విశ్వశాంతికై
యడిగో: "నృభిర్ధీతం గగన" మంచు జయంతి సుపర్వ పథ్యలో.

విజ్ఞప్తి

ప్రసాదకాయ కులపతి

తొలి సంజ జిలుగు వెలుఁగులు
తళుకులు గులికించు నీ పదద్వయిపైనన్
జలజాతాకృతి కరుణా
విల భావావేదనలు నివేదింతు నివే ।

అక్షర మౌటనేగద । మహాకవి కావ్యజగత్తులోన ప్ర
త్యక్షర మక్షరమ్మ్ము మధురామృతమై మనసుల్ కదల్చు ప్ర
త్యక్ష రసస్రవంతులకు తావలమైనది - అందుకే గదా
అక్షర లక్షలిచ్చి కొనియాడిరి వారిని నాఁడు భారతీ ।

కొంచెము ప్రౌఢ సంస్కృతము గూర్చి మహోత్తర కావ్యమొండు క
ల్పించినచో ధణంధణ కవిత్వ మటందురు, తేటతెన్గు లొ
ల్కించిన అందులోన పసలేదని యందురు, మధ్యరీతి కా
వించిన ప్రాఁత దంచు రిది వింత ప్రపంచము నేఁడు భారతీ ।

సంధిత నవ్యదివ్య రససంగతి లేని వెయో శతాధిక
గ్రంథములేల ? కాల్పనకె ? కల్పిత శిల్పకళా విలాస సం
బంధరసాంచితంబయిన పద్యము మొక్కటి చాలదే ? సుధా
బంధుర మంచు దాని కవివర్య రసజ్ఞులు మెచ్చకుందురే ?

బడబానలు కవిత్వ బడబానలమ్మున
కుంకువై చెరువు నీళ్ళింకు నాఁడు
భీము లింగమ్మున భీమున్న వాకున్కిన
సిద్ధశక్తి ప్రసిద్ధిఁ జెందునాఁడు

కవీమల్లు కవితోగ్ర పవిమల్లరింపులో
బ్రహ్మ దండికి ముండ్లు రాలునాఁడు
భానుని వాగ్భాను భాను ప్రభా వాన
యెగిరి యత్తిన గండి పగులు నాఁడు
తలఁగి మేధావిభట్టు మేధావిధాన
నేలపై తాడి తునియలై కూలు నాఁడు
సాధ్యపడె నేమొగాని - యీ జగతి నేఁడు
కవిగ గడుపుట దుర్ఘట కార్యమమ్మ ;

ప్రశ్రయ పూరితప్రతిభ ప్రాభవ మందిన ఆత్మ గౌరవ
శ్రీ శ్రమియింప నుజ్వల సుహృత్కలనల్ శమియింప సత్క్ర వి
త్వాశ్రమ మంగళాశయ మహస్సులు నిస్పృహలే వహించు హీ
నాశ్రయ జీవితమ్మిది మహాశ్రమ భావితమమ్మ భారతీ ;

మందార మకరంద మాధుర్య ధుర్యమౌ
సీసాల సురశాలఁజేర్చు వారు
ఉజ్జ్వలోజ్జ్వలమైన ఉభయ భాషా ప్రౌఢి
వృత్తాల మొత్తాల పెంచువారు
సద్రసోచితబంధ సంధాన నైపుణీ
కందాల నందాల చిందువారు
మధుసుధా మధురైక మహిత వాగ్ఝరులతో
గీతాల చేతాల గెలుచువారు

లలిత లాలిత లాలసోల్లాస లలిత
నవ విలాస వికాస విన్యాసములను
ఇందు కళలకు నేతాము లెత్తువారు
కలరు కలరమ్మ ; కవుల లోకమ్మునందు.

వన్నెల్ నిండిన పంచు వెన్నెలలతో వాల్లభ్యముల్ ప్రేమముల్
చిన్నెల్ చూపిన తీయదేనియలతో సింగారముల్ గల్గు కా
వ్యోన్నత్యంబుల వెల్గు నెంద ఱిలపై నజ్ఞాతవాసమ్ములో
నున్నారో ? సుకవిత్వపోషణ సముద్యోగంబు లే కంబరో !

ఏదో అభ్యుదయార్షమంట ! ప్రజకై సృష్టించుటే దీని ము
ఖ్యాదర్శంబట ! కానియర్థమట సుంతైనన్ గనన్ జాల మీ
హృదశ్రీ రహితంబు లేమిటికి ? పైత్యప్రాభవోద్రేక సం
ప్రాదుర్భావ విభావ భావకవితా వ్యాపారముల్ భారతీ !

అమహోవృత్తి ప్రజాకవిత్వమని మిథ్యావాదముల్ సేయుచున్
స్వమహామూర్ఖత ! గొందరుందు రిల విశ్వశ్రేయమే కావ్య మం
చు మహాత్ముల్ ప్రవచింపరో ? సుకవిరాజుల్ కావ్యముల్ వ్రాయరో !
హిమహాస్రచ్యుతిగాక క్రొత్తదనమేమిందున్నదో ! భారతీ !

గమ్యస్థానము సాహితేయులకు ప్రజ్ఞా చక్షురానంద మౌ
రమ్య జ్ఞానమటన్న నానుడి సదారాధ్యం బసాధ్యంబుగా
సామ్యంబుల్ విడనాడియుండిరి ప్రజాస్వామ్యం బటం చాడి యీ
గ్రామ్య గ్రాంథిక వాదఘూర్ణిత మహాంధ్రక్షోణిలో భారతీ !

సరసా స్వాద్య రసోజ్వలంబయిన యీ సాహిత్య లోకమ్ములో
దురహంకారులు దుర్మదాంధులు దురాత్ముల్ దుర్మదగ్రస్తు లె
వ్వరొ కల్పించి ప్రచారముల్ సలిపిరీ పాషాణ పాషండతా
దురభిప్రాయము లెట్లు మారగల వీ దుర్మార్గముల్ భారతీ !

సురుచిర సద్రసౌచితిని జూడక భాషకు ప్రాణమైన వ్యా
కరణము లెక్కచేయక జగత్తు జగత్తని నాల్గు ముక్కలన్
మొఱుగుచు నర్థ శూన్యములు మోహనతారహితంబు లేవియో
బరికిననే ప్రజా కవన ఫక్కియటందు రిదేమి భారతీ !

ర_క్తి సుధాతరంగము లరాళ కరాళ కళా ప్రసంగముల్
సూ_క్తి నిరు_క్తి శూన్యతలు యు_క్తి దుర_క్తి వివాద వాదముల్
ప్రా_క్తనమార్గ రోధములు భావ దరిద్ర దురర్థ దుర్వచో
యు_క్త వృధా ప్రలాపములు యు_క్తము గానివి గావా! భారతీ!

ప్రా_ప్త కవిత్వ తత్వ రుచిర స్థితి క్రుంగి కవీంద్ర పోషణల్
సు_ప్తి వహించి ధర్మము విలు_ప్తి రహించన నేటి రోజులన్
జ_ప్తికి వచ్చె నెందులకొ స్వర్ణయుగమ్ముల నాటి గాథ, వి
జ్ఞ_ప్తి యొనర్చుకొంటి నిది సర్వము సాక్షివి నీవె భారతీ!

సృష్టించెనో! కళా ద్రష్టయై యీతండు
మధుర మంజుల కావ్య మండలంబు
కల్పించెనో! దివ్య శిల్పంబు నీతండు
విద్వ ద్వరేణ్యులే వెరగు పడగ
నిల్పెనో! యీతండనల్ప సంకల్పాన
ధీపరుడై సుకవిత్వ గౌరవంబు
నడపెనో! యీతడనంత ధీ శ_క్తితో
సత్పథమ్మున విమర్శా రథమ్ము

దశ దిశా దేశముల కవిత్వ ప్రదీ_ప్తి
భృశ యశోరాశి నించిన విభు డితండు
నుతులు నతులు గ్రహించి అనుగ్రహించి
ధన్యు నొనరింపవే! శారదా సవిత్రి!

శారద! శారద స్ఫురిత శారద నీరద నారదేందు క
ర్పూర సుధా ప్రపూర హిమపూర తుషార పటీర హీర డిం
డీర శరీర! ధీరతర నిర్మల నిశ్చల సత్కవీశ వి
స్ఫార విభావ భావ భావ భవ విభావ విహార భారతీ!

పృథ్వీ భాగవతము

బీర్నిడి సుప్రసన్న

అనిలోఁ జచ్చిన స్వర్గమా ? యవల రంభాశ్లేష సంరంభమా ?
అనురాగంబు వివేక మున్న నవియేలా ? యెవ్వఁడావెన్నఁ గా
దని యే నేతికొ దేబెరించు మను బ్రహ్మజ్ఞాని ? జన్మార్వికన్నను స్వర్గంబును జేసికొన్న సతికన్నఁ రంభవేఱున్నదే ?

అరి నాకుఁ హరి నాకుమారికకునై యీ పృథ్వీపుం దొప్పగా
సరవిఁ నేను హిరణ్య రాక్షసునిగా సంయుక్త ప్రహ్లాదగా
జరిగెఁ భాగవతంబు నూత్నముగ నా జ్ఞాజానిపైఁగాని తా
నరసింహుండయి నన్నుఁజీల్చకె చనెఁ నాయంత్యమెట్లోకదే ?
అరరే ? యెందుల కావిరుద్ధకృత సంహారంబు ? శ్రీజానిచే
నరసింహాకృతినై న నన్యగతినైనఁ బుత్రి పార్శ్వమ్మునా
మరి నాకే కద ? చావురావలయు నమ్మా ! యట్లు గాకేడనే
పరుడౌ ఘోరికొ ! లభ్యపడ్డదది దౌర్భాగ్యుండ నేనన్నిటఁ

ఆ పోరాటపు టుగ్రయుంయుకనురాగాత్మీయ మిత్రాళియుఁ
బ్రాపుఁ గొమ్మలు నాకులుఁ దునిగి పోవఁ ద్రేళ్లతో ఁద్రెవ్వి మో
దై పృథ్వీస్థలిఁ బడ్డ పాదపమునే యైనాడ పాడైన నా
యీ పృథ్వీరుహ మేనుకోఁ గలుగునే యెన్నో వసంతాలకుఁ — !

ఈ భూమిఁ నర జీవితంబు మృదువౌమృత్పాత్ర తత్పాత్రలో
లోభక్రోధ మదాదిషడ్గుణము లుల్లోలంబులై పర్వ నం
దే భావంబును నిగ్రహించు కొనలేకే యుండినఁ దల్లి ! ఛి
న్నాభిన్నంబయిపోవు నీ బ్రతుకు భాండంబాయు నూర్వ్యయ్యలఁ

నరజన్మంబున కెత్తి శ్రేష్ఠమగు కన్యాకుబ్జ రాజ్యేందిరా
వర నాథత్వమొసంగి కంటికిని రెప్పల్ బోలె నన్నా పరా
త్పరు డీక్షించుచుఁ గాచుచెందు కగునో ! తత్స్వామి దాతృత్వ పుం
పరమార్థంబు గ్రహించుకోనయితి నంబా ! యెప్పుడే ప్రొద్దులఁ

నరకంబే యొకటుండి యందు సరిగా నాక్రూర కృత్యాలకే
పరిణామంబులు శిక్షలే గలిగినఁ బాధింపఁగాఁజాలునే
నరకంబుఁ గిరకంబు ? పెక్కుగతులన్ ననేకచగా జాలియుం
దురె ? మార్కొందురె య య్యమునుడును గిముండుఁ ? గింకరుల్
గింకరుల్.

అదిగో ! రాతిరి వానపోతల ప్రవాహంబొత్త నువ్వెత్తుగాఁ
గదలఁ బాఱుచు స్వచ్ఛ సుందర తరంగశ్రేణితో జాహ్నవీ
నది యుత్తుంగ తరంగ నాదముల కంఠంబెత్తినఁ బిల్చుచు
న్నది తల్లీ ! ముగియింతునందుఁ గడుహీనంబైన యీ జన్మముఁ.

మేలొగావుత నీకు సోదరులకుఁ మిమ్మెప్పు డేడ్పించుచున్
మీలోనున్న విభిన్నభావములు ఛిన్నీభూతమౌగాక యీ
కాలంబందు మరొక్క మాఱు దయతో కంజాక్షు డుద్భూతుడై
శ్రీలోమన్ దలయొడ్డుగాత ! జనయిత్రీ ! నే బ్రియాణించెదన్.

అనుచు నా తేఁడు పరువెత్తు కొనుచుఁబోయి
వడివడింబాఱు గంగా స్రవంతిలో గు
భిల్లు నందూకె వానిఁ గోపించు పగిది
బుడ బుడ ధ్వని నన్నది బుడగ లురిమె.

జలధరశ్రేణి యాడిన సమర నాటి
కకుఁ బ్రకృతికాంత యెత్తిన కప్పురంపు
టారతుల పళ్ళెరమ్ము నా నవఘళించి
భాను బింబంబు ప్రొద్దిశఁ గానుపించె.

"తన భరియించు వ్యధా భరమునకు, శి
రము మీది తుహిన పర్వతముఁజూపి
తన రాల్చు కన్నీటి ధారలకు వద నా
నఁగల గంగా సింధు నదులఁజూపి
తనలోనఁ జెదరిపోయిన గుండియకు నోర
గ రహించు వింధ్య భూధరముఁజూపి
తనపడ్డ తలలోఁతు తలపోఁతలకుఁజుట్టు
మెరయుచున్న లవణాంబుధులఁజూపి

హైందవావని యైకమత్యంబు కొరకు
కన్నకొడుకుల కెల్లనుఁ గరముఁజాచి
యడుగుకొనుచున్న దిప్పుడు నరసినారె ?
మీరు ! మీరును ! మీరును ! మీరు ! మీరు."

వసంత వైభవము

శ్రీ జంధ్యాల జయకృష్ణ ప్రసాద్

స్వాగతమో వసంత! సుమసౌరభ పూరిత దిగ్దిగంత! నీ
యాగమనంబుచే భువనమంతయు నూతన కాంతిమంతమై
తూగుచునుండె! సమ్మదముతో విరిదేనెలు గ్రోలి తుమ్మెదల్
మ్రోగుచునుండె! మా హృదయముల్ పులకించుచునుండె నెంతయున్.

రమ్మ! జయమ్మ! ఆమనిదొరా! నవచైత్ర రథమ్మునెక్కి నీ
కమ్మని కీర్తి గీతములు గానము సేయుచునుండె కోకిలల్!
కొమ్మలొసంగు కాన్కలివి కొమ్మ మనస్సుమనోంజలుల్! రసా
ర్ద్రమ్ములు నీ కటాక్షములు ధారుణిపై విరజిమ్ముమో ప్రభూ!

పచ్చని చీరతో పసుపు పచ్చని పువ్వుల పట్టుపైటతో
వెచ్చని తేనెతో చిగురుపెట్టిన బాలరసాల పాళితో
విచ్చిన పూలతో మధుప వేణికతో వరలక్ష్మి స్వాగతం
బిచ్చుచునుండె వచ్చి గ్రహింపుము స్వామి! ఉగాదికానుకల్!

మత్తకోకిల లొక్కమాటుగ మావి కొమ్మల నూగుచున్
మెత్త మెత్తన లేడివుళ్ళను మీరికోరి భుజించుచున్
క్రొత్త మెత్తగ తీయ తీయగ కో యటంచును కూయగన్
చిత్తముల్ చిగురించె నెంతయు చెల్వకున్ చెలికానికిన్.

మందానిలమ్ము లతి మంజుల లీల వీచెన్!
అందాలతో వనలతాంగి మనస్సు దోచెన్!
మందార మాలతులు, మావులు కర్ణికార
కుందార విందములు కోర్కెలు దీర పూచెన్!

స్పందించెన్ డెందముల్; స్వామికిన్ దేవి పూవి
ల్లందించెన్; రాగార్ద్రింబయ్యె ప్రత్యంగుళమ్ముల్;
చిందించెన్ పద్మముల్ శ్రీలు క్రొందేనె జాఁ; లా
వందించెన్ భృంగముల్ నవ్య చైత్రాను రక్తిన్.

హరిణమ్ము హరిణి కన్నరమోడ్వ గోకె ; కన్
బొమ్మపై తన కొన కొమ్ము తోడ
ఒక కంచమున గ్రోలె మకరందమును భృంగి
భృంగమ్ము వలపులు పొంగి పొరల
సగము భుజించి అందుగు చివుళ్ళను కరి
కరిణి కండించె మై పరవశింప
సరిక్రొత్త లేత తామర తూడు హంస హం
సి కొసంగె చెక్కున చెక్కు చేర్చి

సృష్టి సర్వత్ర సౌందర్య దృష్టి విరిసె ;
దృష్టి సర్వమ్ము శృంగార వృష్టి మునిగె ;
రాగ మయమైన నవ వసంతా గమమున
లోక మిదియెల్ల నవనవా లోకమయ్యె ;

గోరంట రాణి పై పై
గోరంటగ కౌగిలించుకొనె ఋతురాజున్
వారింటికి వీరింటికి
పేరంటము జనిరి తేటి పేరంటాండ్రుల్.

వేణువు క్రమోగినట్లు అరవిందము చక్కగ విచ్చినట్లు, మా
గాణము పండినట్లు కవి కల్పన సార్థకమైనయట్లు, మా
ప్రాణము నవ్వినట్లు శిల పల్కిన యట్లు రహించె, "నిత్య క
ల్యాణము పచ్చతోరణము"నై భవ దాగమనంబు మాధవా ;

ఎండిన ప్రొదుగుండె లవి యెన్నియొ ఈ మహి నీరసమ్ములై
యుండెను ; వానికిన్ నవ నవోదయముల్ గలిగింపగా వలెన్
బండలు పల్లవింపవలె ; ప్రాకృత శోభలు పొంగిపోవలెన్
నిండవలెన్ సిరుల్, జగము నిండ త్వదీయ పదమ్ము సోకినన్.

కోకిల

గంధం సుబ్బారావు

కోకిలయు గొప్పగా గాయకుడని చెప్ప
నిజమే యనుకొంటి, కొన్నాళ్ళు నేను గూడ
కొంత సంగీతమును నేర్చికొందమనుచు
నూహ గలిగెను నాకు తానొక్క వేళ

ఏడు స్వరములు గలవని, యేడు స్వరము
లటులిటుల త్రిప్ప సంగీతమగు నటంచు
నొక్క స్వరమునెయను "కోకిలక్క" నాకు
మంచి గాయకుడని యనిపించలేదు.

నేను యల్లరి చిల్లరిగాను తిరుగ
అక్కలకు నన్నలకు నేను లెక్కలేను
నేను కోకిల౯ దిట్టగా, తాను నాన్న
కూడ 'నీ బ్రదుకంతియే కూళ'యనియె

ఒకడు మాయింటి ప్రక్కగానుండె, నతడు
పండితు డటంచు వీరును వారు నందు
రాయనకు నేను చిల్పినం చాదరంబు
యాయన యెఱింగె యీ సంగతంత చూడ

ననో్నదారిచి మరి నీ
వన్నదియే నిజమటంచు నాయన మిగులన్
ననూ్నరడించె నక్కల
నన్నల కొమ్ము పడిపోయె, నయితిని ఘనుడన్

తొమ్మి విరుచుక తిరుగుదు రోజు నేను
ఆ పికము‌ దిట్టుచే పనియయ్యెనాకు
పండితుడు నాకు మద్దతు, తండిరియును
యక్క లన్నలు వేసిరి బిక్క మొగము

ఆయ నుండె నంచు నతిబడాయిగ నేను
తెగువ పరభృతమును తిట్టినాను
యతడు నవ్వి యిట్టు లనియె నందరితోడ
గాయకుండు నొక "పికంబె" యనుచు.

ఏవి చేయగలను నే తెల్లమొగమును
వేసినాడ వారు విరుగబడిరి
అతడు పండితుండు ననె నిట్లు "స్వరములు
పదియు పోయి చేరు పంచమమున

గాయ కుండును కోకిలగా డొకండె
అల్ల రబ్బాయి నోదార్చ నంటి నేను"
అది మొదలు నేను మారుట, కంతనుండి
బుద్ధి మంతుడ నైనాను పుడమియందు.

అధికవి ఆవేదన

పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

చనియెన్ శిష్యునితోడ గూడి తన మాసాంతమ్ము దర్శించుచున్
మునియున్ స్నానముజేయ నా వనమునన్ ముగ్ధత్వ సంపాదులై
మనసే ప్రక్కకొ చారు నిస్వన సమామ్నాయంబుతో లాగుచున్
ముని నానందము బొందజేసె బహుధా ముద్దొల్కు పక్షుల్కడున్.

క్రౌంచ మిథునమ్ము నొకదాని కంఠమొకటి
తాకు నొకదాని ముక్కును తాకు నొకటి
ప్రేమనిండిన ధ్వనులను తాము చేయ
మౌని వదనమ్ము ముదముతో గాన నయ్యె.

ఏమి తెలియు వీని కీలోక విషయాలు
ప్రేమతప్ప నిచట వేరుగలదె?
కలుషితమ్ముగాదు మలినమ్మునుం గాదు
దీని జన్మయనుచు మౌని తలచె.

ఏ కడనుండియో యొకరు డింతలు కండలు కల్గినట్టివా
డా కడకేగుదెంచె మొగమందున గర్కశ రేఖలాడగా
నీ కడమౌనియుండ మనకేమి భయంబనినట్లు పక్షి జం
టా కడనైన చూడక సుఖాకృతి నుండెను వృక్షశాఖపై.

వాని గన్నయట్టి యానందమున మౌని
తేలియాడెగాని చూడలేదు
పక్షులను వధించు వ్యాధుని సుఖి యెప్పు
డైన భావి కష్ట మరయగలడె?

వెంటనుండు నతని ప్రియ శిష్యుడైన సా
రింపలేదు దృష్టి నంపకోల
వైపు కేవిధముగ చూపు సారించును?
వ్రాత కెవ్వడడ్డ పడగలండు!

వచ్చిన వ్యాధుడు పక్షుల
పచ్చదనంబును సహింప భారమని నటుల్
హెచ్చిన యాత్రత ద్విజముల
జచ్చు నటుల కోలవేసి సంబరమందెన్.

కూలెను క్రౌంచ దంపతుల గోల నొకండు మదీయ భాగినీ
కూలితి నేలపై ననెడి గొప్పగు నాదము వీనులఁ బడఁ
నేలనుబడ్డ పక్షిగని నీరసపూరిత నేత్రుడై యటన్
గ్రూర కిరాతుగాంచి బహుకోపము దుఃఖము మేళవింపగన్

వ్యాధుడ! నీకేమి పృథు
వ్యాధిర యేకాంతమున్న వాన నొకంటన్
బాధకు గురి జేయుటచే
నీ ధర శాశ్వత యశంబు నీ వందెదవే?

అని మౌనివాని గాంచును
దన కనులం జలము లమర దత్పక్షిననెన్
నిను జంపి వాడు బ్రతుకునె?
ముని శాపము వట్టిబోదు; మూర్ఖుడు చచ్చున్

అని శాపమ్మును బెట్టె మౌని మిళితోగ్రాకార దుఃఖమ్ములన్
ముని వాక్యంబులు శ్లిష్ట శక్తులయి చావున్ బొందగాజేయ, నీ
తని శాపమ్మున ప్రమందజేయు నధికత్వం బెవ్వడిచ్చెన్ మరిన్
తన వృత్తిన్ మరి జేసికొన్న యతనిన్ ధర్మంబె తా జంపగన్.

మునికిని వలయును శాంతము
తను జేసిన పనియె దాని దాటెను గాదా।
యని ముని యనుకొని మనమున
తన జేసిన పనికి మివుల దాపము జెందెన్.

శాప మాడిన పల్కుల జక్కదనము
గోచరించెను గురువర్య క్రొత్త నడక
నడచుచుండె లయాను గుణంబు గాఁగ
ననియె శిష్యుడు మౌనికి నచ్చెరువుగ

మా న వ

రావికంటి వసునందన్

మానవ - మానవ : మాన వి
హీనము లగు నల్ప కార్య హేలల, మేలా
మానవ భావము వీడుట
మానసికిన్ : మాయ లన్యమాన్యము లగునే :

పాపపు చింతలన్ గరిగి పాటలగంధుల వాంఛ నల్లి తా
నేపును రూపుమాసి యుడుగుగ యెలప్రాయము నీదు నాత్మలో
నేపగిదిన్ భజించునొకొ, యెక్కటి తేటము దివ్యధామముగ
పాప వినాశమైన తొలి పావన రూపము పట్ల నెయ్యమున్.

సీతమ్మన్ ఒడినెత్తి పెంచినది, కాశీ గంగ తీర్థాల సం
ప్రీతమ్మైనది: ప్రాణికోటికి ధరా రేణూత్కరం బంతయుగ
స్రోతస్సయ్యె సుజీవనమ్ముల కనన్ శోభిల్లు నీ భారతా
ఖ్యాతాబ్జాతముఖిన్ దలంచి యయినన్ ఖండింపవే మౌధ్యమున్

ఏ నా డెక్కడి నుండి వచ్చితివో ? తానెప్పేగునో ? సుంతయేన్
నీ నోముల్ ఫలియించు పెన్నిధో ? కనన్ నీ యబ్బ శక్యంబె ? యే
లా నీ నీల్గులు నిక్కులున్ గడచెదో లావైన సంసార బా
ధానీకమ్మును వీనితో చలమతీ ధ్యానింపు సన్మార్గమున్.

పాపపు బుద్ధియేల పరుపాటుల గాంచిన నవ్వనేల : నీ
రూపు పసిండి బొమ్మయె ! విరోధము మానవు మంచితోడ : నే
ప్రాపున నీకు భద్రమొ పరాకును గాంచవు మానవుండవై
తేపకు తేపకున్ సుగతి తీరు దలంపర ! పుణ్యమయ్యెడిగ.

సమతయు దివ్య ప్రేమయును, శాంతియు సత్యము నిర్మలత్వము
మమతయు మంచి చేయుటలు మానక దీనుల ప్రోచుట వినా
మమ మమ యంచు నేడ్చిన ప్రమాదము దప్పునె, కుక్క తోకతో
డమల గభీర వాహినుల దాపెడు యత్నము - బుద్ధిశాలివే ?

ఏలా ! చాలదు విన నీ
గోల, తలంచితివె నన్ను గోలయటంచున్
లీలా కలితము జగమే
పాల బడిన ప్రతుకు గలదొ - పామర కనుమా !

వసంతము

నోరి సత్యవారాయణ

మదన భూపతి జయభేరి మారుమ్రోగ
లోక మంతయుఁ బూలతో నేకమయిన
చిలిపి చూపుల శృంగార మొలుకబోసి
సంతసమ్మున వచ్చె వసంత లక్ష్మి

కళ్లలో క్రొత్త స్వప్నముల్ కదలియాడ
సుకవి సత్కావ్యసుశ్రీలు ప్రకటమగుచు
పుడమి వెన్నెలల్ నిండుగా పొంగి పొరల
సహృదయాహ్లాదమయ్యే వసంత ఋతువు.

చిలిపి చూపులఁజూచి చిత్తంబు హరియించి
చోద్యంబులను జూపు సొగసులాడి
'కుహూకుహూ' యని పల్కు కోకిలపల్కులు
గిలిగింతఁను పెట్టు కులుకులాడి
అందాలు చిందెడి హంసల నడలతో
డిదిగాఁగ మురిపించు నెక్కులాడి
కరకంకణంబులు 'గల్లని' ధ్వనియించు
వన్నెలు వెలయించు వలపులాడి

దిన దినము మన్మథాగ్ని నుద్దీప్తి సేయు
సీదు సొగసుల వర్ణింపు నేర్పులేక
వేయి నాల్కల శేషుడే విసిగిపోవు
నవ వసంతమా! చైత్రమాస వనలక్ష్మి.

నిద్దపు నీలిముంగురుల నిగ్గులు చిక్కిన సిగ్గుదొంతరల్
దిద్దిన రీతి కన్నొమలు తీయని పున్నమి వెన్నెలం బలెన్
అద్దిన భంగి వాల్గనులు యౌవన మొప్పిదమొల్కు తీవితో
ముద్దులు మూటగట్టు నగుమోమున వచ్చెను పెండ్లికూతురై

నెమలి కన్నియ పురివిప్పి నృత్యమాడ
మలయ మారుత వీచులు మరులు గొల్ప
తరుణీ హృదయమ్మునుబోలె ధరణి విరియ
నవ వసంతోదయమయ్యె క్రొన్నెనలుపూచె.

ఎచటనో ; మరి ఏమిటో యేకధాటి
కుహు కుహూయని కూసెదో కోయిలమ్మ
రావె రావేయని కవితా రాధ్యులడుగ
రావె చైత్ర రథంబుపై రాగమొలుక

ఒక్కసోకున నేరాగ మూదినావొ
కులుకు పల్కుల రాచిల్క పలుకరింప
ప్రణయినీ ప్రణయులు ముగ్ధ భావములను
గూర్చి ముడివెట్టి ప్రకృతి జోకొట్ట రావె.

కొమ్మ కొమ్మలందు క్రొమ్మావి రెమ్మల
గూజితమ్మొలెసగ గుల్కుకొమ్మ
కోయిలమ్మపాడె కోవిద కోటికి
స్వాగతములునిండు సంబరమున

మూడు పూలారు కాయలు ముద్దుగొలిపి
దేశసౌభాగ్య సంసద తేజరిలగ
బాలబాలిక లెల్లరు భళియనంగ
శుభ 'పరీధావి' నూతనశోభ చెలఁగె-

రెండవ భాగము

సంకలనం:

బాలాంత్రపు రజనీకాంతారావు.

విశ్వస్ఫూర్తి

దేవులపల్లి కృష్ణశాస్త్రి

చిననాటి భావవల్లిని పూచినది, వాడనిది, వాసనలు వీడనిది ఒకండు
కోరిక, నాల్గుదిక్కుల భూభువనమంత లవలేశమును వదలకయె తిరిగి,
ప్రతిగేహ గేహళి పద మాగి. ప్రతి హృదయ ద్వారతోరణ మట్టె త్రోసి,
లోనికి జొచ్చి, నాలోని స్నేహక్షీర మొక్కింత ఒక్కింత ఒలకబోసి,
'అనుగుసోదర మరలిరానా' యటంచు సెలవడిగి సాగిపోయెడు చిరపథికుడ
కావలయునంచు ఆశ ఆకాశమంత, పటిమ క్షుద్ర విహంగము, అప్పటికి-

ఇపుడు

ఘర్మ గంగాయురీ జ్ఞాన గోదావరీ
సిక్త సహజీవనోద్రిక్త భారత భూమి
ఒక్కపరి హిమశిఖరి నెక్కి సేతువుదాక
దృక్కు సారించి పూరింతు గళకాహళిక.

ఔరా, మాటకు రెక్క లున్నవట నే డా మాట ఇప్పాట ఎ
ట్లారోహించి మహావిహాయసము ఎట్లందున్ ఒకేసారి కా
వేరీ దేవ గృహాంగణ ధ్వజపటీ వీథీమరుద్వీచి, కా
శ్మీరారామ మనోజ్ఞ కుంకుమ రజస్నిగ్ధానిలోర్మిచ్ఛటన్.

విదురప్రియ శ్రవో వీథుల మంగళ స్వాదు వాక్యమ్ముల నూదగలను,
నిలుపగాగలను మాణిక్య దీపావళి అంధమనో మందిరాంతరములు.
కర్కశ హృదయ జాంగలముల శీతల స్నేహదుగ్ధమ్ము వర్షింపగలను.
విరచింపగలను విద్వేష వైతరణికి అడ్డుగా గాఢ సౌహార్ద సేతు
విటనె నిలిచి, సమస్త దిక్తటుల పిలిచి, సారె జీవత్సరస్వతిని మలచి,
కవిని నేనై పురాణ వైణవికు నట్లు ఊహాలున్న, జగమ్మంత స్నేహమున్న.

నిన్న మొన్నదాక మన్నలో మన్నయి
యున్నవాడు శంఖ మొత్తినాడు
మానవుండు గర్వ మాణిక్య కోటీర
ధారి నేడు. విజయహారి నేడు.

ఈ నా డీ భువి బానిసీడు మటి లేనే లేదు ఒక్కొక్క పా
లానన్ పావక నేత్ర మున్నది పగల్ కొల్పంగ, ఒక్కొక్క డెం
దానన్ క్షీరసముద్ర మున్న దవధుల్ దాటంగ,ఈ మానవుం
డే నిర్మాత, విధాత, నేత మటి తానే భోక్త లోకంబునన్

'స్వస్తి జగత్తున కగు, శ్రీరస్తు సదాశాంతిర' స్తటంచు వెలయు,వి
శ్వస్తుత భారతవాణి సుమస్తబకమువోలె లోక మస్తకము పయిన్.

అమరజ్యోతి

తుమ్మల సీతారామమూర్తి చౌదరి

యుగ యుగమ్ముల భారతోర్వి తపఃపుంజ
మొసరేఁగి జగముల కిడిన పంట
తరతరమ్ములనుండి తరలని దాస్యమ్ము
కట్లు త్రెంచిన శాంతికదనయోద్ధ
నరనరమ్మున జీవన జ్యోత్స్నగా నహిం
సను సహించిన యోగి సత్తముండు
పదపదమ్మున సత్యభాషా సనాతన
సౌరభ్యములు చిమ్ము సాధుశీలుఁ.

డితఁ డహింసారణవ్రతుఁ డితఁ డభేద్య
సత్యకవచుండు భువనైక శాంతిదూత
యుగయుగమ్ములు కల్పముల్ ముగియుఁగాక
తరణియై మింట మెఱయు నీతని పతాక.

ఒఱగెన్ విశ్వపతాకలెల్ల వసుధా వ్యోమంబు లార్తస్వర
స్ఫురణాకంపిత వీథులయ్యె మిహిరాంశుజ్యోతు లేపారినన్
గఱకుంజీఁకటు లేచి కప్పె దెసలన్ గాకోలకల్పమ్మునై
చరమస్థానము నీవు సేర జగమే స్తంభించె నాత్మేశ్వరా.

తల్లియుఁ దండ్రియున్ గురుఁడు దాతయు నేతయు నెయ్యతీయ్యముల్
చల్లెడి మిత్రుఁడున్ సచివసత్తముఁ డుత్తమబంధు వీశ్వరుం
డెల్లరులేని దైన్య ముదయించెఁగదా. యిటు లెన్ని కల్పముల్
చెల్లునొ మాకు నచ్ఛతరజీవను లబ్బుటకున్ భవాదృశుల్.

ప్రల్లదుఁ డేచి ప్రేల్చిన తుపాకికి నీ హృదయమ్ము ప్రయ్యలై
వెల్లువకట్టి హ స్తిపురవీథుల నీ రుధిరమ్ము పాఱెనా
ప్రతిశ్వోడి దుష్టశక్తుల నెదుర్చుట కందలి చుక్క చుక్కకున్
బిల్లిదు లిద్దవీర పరిపాలకు లెందఱు పుట్టివత్తురో.

పూవులతెప్పపై గదలిపోయితివా యమునాతరంగిణీ
పావన రాజఘట్టమున భౌతికదేహము గాల్చుకొంటివా
నీ వపురస్థి చందనవనీశకలమ్ముల బూదియయ్యెనా
బావురుమంచు నీదు చితిపజ్జల శోకము పొంగెనా ప్రభూ.

బలిసెన్ దావక భూతిమోచు యమునా భాగీరథీ గౌతమీ
బలదా సహ్యసుతా మహేంద్రతనయా భద్రా కవేరాత్మజా
సలిలోర్మిచ్ఛట కీప్సితార్థ సుఖముల్ సంధించు పుణ్యాంబు త
జ్జలసేకంబున భారతక్షితి నహింసా సస్యముల్ పండుతన్.

మందాకినీ సరి తాక్
ళిందీ భారతుల నస్థిలేశము కలియన్
హిందూ ముస్లిము క్రైస్తవ
బృందములో నీ మహాస్ను పెనఁగొన్నదిరా

నీ బూదిన్ గొనితెచ్చు రైలుఁ గనుచో నేత్రము లంధమ్ములై
బాబూ మూర్ఛకుఁ జిక్కినాఁడ మన ఈ బంధంబు నేమందువో
నా బాగోగు సమీక్ష చేసికొనుచున్ నాఁడెల్ల వేసారితిన్
నీ బంధుత్వము నాదుభాగ్య మనుకొంటిన్ భక్తి నమ్రుండనై.

చేసిన సేవయుఁ ద్యాగము
వీసమ యగుఁగాని కన్నువిచ్చిన పిదపన్
వ్రాసిన దంతయు నీ కథ
నీ సందేశంబ యని వినీతుఁడ నగుదున్.

రామా సన్గరుణించితే పిలిచితే రమ్మ౦టివే జీవన
స్వామీ. ధన్య౦డ నై తినంచు భగవత్ సామ్రాజ్యముంజేరితే
కామాదు ల్విదళించు సామబుషి త్యాగబ్రహ్మకు నీ్న కహో
సామాన్యంబు ఘటిల్లెనా వరదు౦ డాశ్వాసించు లగ్నంబునన్.

కస్తూరి చన్నగడియల౦
గ స్తింబడ వట్లు నిల్వ౦గారణ మీ "వీ
వ్య స్తత కడు నస్థిర" మని
యస్తుంకృతి పడసి యుంటయకద, మహాత్మా.

అపవర్గ బాంధవం బదికి లౌకికధర్మ
మాలపించితి నందబాలు నట్లు
కను దిక్కు లేక సోలిన మూ౦గజీవాల
మూల్గు మాన్పితి శాక్యముని విధాన
సతత క్షమా ప్రేమ శరణమై పరదైత్య
కిల్బిషం బోర్చితి క్రీస్తు వోలె
ఆత్మ నిత్యము దైవమది యొండెయని ప్రతి
ష్ఠింప౦జాలితి సోక్రటీసు కరణి

బానిసము ప్రే౦గుడించి కింపాకజాతి
కండగా నిల్వ౦బడి తబ్రహాము పగిది
నద్భుతంబాయె మనుగడ యంద కాక
మృతివిధిన్ వీరి ననుసరించితి మహాత్మ.

నిను రామాదుల౦జేర్చి మెత్తురది మన్నింపన్ రిపుగ్రీవముల్
రణరంగమ్మున౦ గోసి రక్తధురితో రామాదు లోలాడి రా
పనికిన్ నీకునులేదు పొత్తు రిపుతన్ బాధించి విద్వేషి పై
నెనరుం జిమ్మెదవీవు చిక్కుదు ప్రభూ, నీ యోగ మెవ్వానికిన్.

చిరదాస్యమున బ్రుంగి పిటికివాటిన జాతి
కలవరించితివి సాహసికమ్రద
మోఁకటించి కృపాణములు సలాములు సేయు
నస్త్రి మెత్తితివి సత్యాగ్రహంబు
పరధర్మ లుబ్ధులై పరువులెత్తెడివారిఁ
ద్రిప్పఁజాలితివి జాతీయ విధికి
అడుగడ్డునకు నడ్డపడిన కోటలఁగూల్చి
సవరించితివి సమాజ వ్యవస్థ

దిక్కొ-ుంగక రేపవల్ దేవురించు
ప్రజకు నేర్పితి వాత్మగౌరవ సమీక్ష
బాపుజీ, ప్రస్ట వీవు నీ చూపు సోఁకి
ద్రష్టలైనారు కొందటీ తరమువారు

వేయిగాదు లక్ష విశ్వకళా పరి
షత్తు లెన్నిసార్లు మొత్తుకొన్న
నేర్పలేని తెల్వి నీవీ జగమ్మున
కిచ్చినాఁడ విరులు విచ్చి వీడ

పెఱబాసల కొల్వునకున్
బొరలుట జాతికి విషమ్ము పోయుట యని తెం
పరివై చాటితి వీఁక నె
వ్వరు దిక్కొ- దేశపల్కొ- వఱువ ట్లుడుపన్.

నీ పల్కొ-గాక యీ నిఖిల భారత మహీ
చక్రంబు ద్రిప్పు శాసనము గలదె
నీ యున్కొ-గాక పండిత పామరుల నెల్ల
రాపాడు పుణ్యతీర్థమ్ము గలదె

నీ కిన్క-గాక మానిసి గుండెలో(దూతి
చెడుగుపాదు పెకల్చు శిక్ష కలదె
నీ కూర్మిగాక నిర్నిద్రయోగ సమాధి(
బడలి సంపాదించు పదవి గలదె

కలదె నీ జీవనపథమ్ముగాక లోక
శర్మ సంప త్తి నొదవించు ధర్మశాస్త్ర
మద్వితీయంబు నీ తపస్యావిధాన
మెవ్వని మనీష నిల్చు నిన్నెఱి'గి పల్క-

నీ పరమోపవాస మశనిప్రతిమంబయి శైల సాగర
ద్వీపవిశిష్ట విశ్వజగతిన్ వడ(కించు తఱిన్ భయా ర్తులై
పాపులు బిల్లెముల్ మరతుపాకులు బా(కులు పెట్టి తావక
శ్రీపదపీఠిపై నొరగి సిగ్గిలి రేమి తపస్సురా ప్రభూ.

అనఘ ! నీ వీశ్వరునిదూత వగుట విశ్వ
మానవీ మానవుల్ భగవానుపట్ల(
దేటపఱుపనిభ క్తి నీదెస వెలార్తు
రసలుకంచెను వడ్డి ముద్దైన యట్లు

అంకిలివీడి నిర్భరవయఃపరిపాకమునందె యింద్రియా
హంకృతి(డూల్చిపూనితి మహామహ లోర్వని బ్రహ్మచర్య మీ
బింకము లేనినాడు వలపించి జగంబుల నెల్ల నిట్లు నీ
లెంకల(జేసికో(దగవులే. తెలిసెం గిటుకెల్ల(గోమటీ.

వలపుల్ చిమ్మెడు పూలచెండ్ల వలె సేవాధర్మ నిర్మాతవై
మలపిండంబుల నెత్తి వైచితి, వసీమ త్యాగమై ప్రాణముల్
బలిదానంబిడ(గంటి విశ్వహితమున బాటించి, నీ బాటలో
నిలువంజాలిన మానవుం డెవ(డు గాంధీ. ఖండ ఖండమ్ములన్

స్వమత విధుల్ ప్రశస్తములు సత్యములంచు భజింతు వన్యధ
ర్మముల సమాదరింతు వపరాజిత సూత్రములన్ గణింతు వీ
సమరసదృష్టి ప్రాప్తకులు శంకరముఖ్యుల కింత యున్నచో
పమరము లెన్ని క్రిందువడి శాంతి యదెంత ఫలించియుండునో

లాటినెత్తి విశాల భారతము నేలంబూను దుష్టప్రభు
త్వాటోపం బడఁగించు పెట్టులని తీవ్రాలోచనామగ్నమై
బాటంగానని యోధమండల మెలర్పన్ నాఁడు 'క్విట్టిండియా'
యాటంబాంబు సృజించి డించితివిరా యాంగ్లేయ రాజ్యోద్ధతిన్

దారిద్ర్యంబు నవిద్యయుం గవిసి పంతాలాడినన్ భూపతుల్
బేరుల్ నెత్తురు పీల్చి పీల్చి బహుధా పీడించినన్ జీవనా
ధారంబై జగ ముద్ధరించు బడు గా ర్తప్రాణబంధుండు నై
తే రాజ్యంబున కర్హుఁడంటి వది సిద్ధింబొందు టేనాఁటికో.

వలదు పరాన్నభుక్కుల నివాసము లీ పురముల్; పదంబిటన్
నిలుపక పొండు పల్లెలకు; నేర్పుఁడటన్ జదువుల్ సదర్థముల్;
వెలుగులు నింపి భారతసవిత్రికి నాయువుపట్టులైన యా
పొలములు దున్నుచున్ నలిఁగిపొండని తోలితివోయి పౌరులన్

బడలెద వేకువోలె మన భాగ్యము పంటకు, రాట్నపాకుగా
సుడివడె దార్త రక్షణకు, సూత్రమవై సకల ప్రజావళిం
బడుగునఁ బేకలోఁ గలిపి పట్టెద, వెట్టి విపత్తి మూఁగినన్
జడియక నిచ్చలున్ బిగియసాగెదురా కదురై మహాప్రభూ.

మొద్దుగ నుండుఁగాక వెల ముమ్మర మయ్యెడుఁగాక దీక్షమై
ఖద్దరుకట్టి పేదలకు గంజినిబోయుఁడు భారతార్థికా
సద్దశ దీనఁ బాయునని పల్కితి వూపిరిలేని రాటపున్
ముద్దియ తేటి తెప్పటిలి మోహన సూత్రము లాలపింపగన్

నీ కదలించిన ఖద్దరు
నీకీ త్రివిధాన జగతి నిండారెఁగదా
ఁకెత్తిన జాతీయత
కాకల్పం బిడి పతాకయై అంపిలుతన్

వంటయు నంట్లు తోముటయు వల్లభుచేతి విలాసవస్తువై
యుంటయుఁ గర్భకారవదురుద్ధతికోర్చి ప్రజా పరంపరన్
గంటయుఁగాక లోకమును గానని భారతనారి నీ కృపన్
గెంటెఁగదా పర ప్రభుత కెవ్వనఁ గేకలు పెట్టి పాఱఁగన్

నీ వప్పళ్ళ్యాఁడ వీ వవాచ్యాఁడ విసీ. నిన్ జూచినం బాపముల్
ప్రోవై చుట్టునటంచు శిష్టు లెవనిం బోనోఁడి. రా మాల యా
జీవత్ప్రేతము వెల్లెడిన్ హరిజన శ్రీనామఁ డారాధ్యుఁడై
యీ వే దివ్యసమాధిలోఁ దలఁచితో యీ పేరు యోగీశ్వరా

శంబుకు వంటి సాధువులఁజంపక, సంపద లేమి యన్న భే
దంబులు లేక సర్వజనతా సమతా, సహజన్మతల్ నభ
శ్చుంబులు గాఁగ శాంతి పరిశోభితమై నుతిగాంచు రామ రా
జ్యంబున కాసచేసి చరితార్థత నందకమున్నె సాగితే

రాజేంద్రుండు పటే లజాదు విబుధారాధ్యుండు నెహ్రూ భవత్
సౌజన్యంబున వీరులై వసుమతీచక్రంబు శాసించుచున్
జేజే లందిరి, నేఁడు వారి పథ మాసేధించి వేధించు శం
కా జాడ్యంబు లడంచు దిక్కెవరు కక్కా :

ఒకనాఁ డాంధ్రునిపెంపు డించుటకు నేదో కుంభకోణంబు సే
తకునై తోరముగట్టి తీవని మహోదగ్ర క్రుధావిభ్రమద్
భ్రుకుటిం జూపితి వెట్టినై చిలిపిగంతుల్ వైచితిన్ దండ్రి, నీ
యకలంకాశయ మవ్వలం దెలిసె నాయజ్ఞామున్ సైపవే

ఒడ్డారించి నినున్ వధించి కుటిల వ్యూహమ్ము పండించి మా
జడ్డల్ పోయెనటంచుఁ బ్రేఁఖణములన్ సారించి కజ్జాయముల్
లడ్డుల్ పంచిన మూఁక భారతము నేలన్ నేల దయ్యాల కే
యడ్డం బాఁకయులేని రంగమగుఁ గాదా భావి యెట్లున్నదో.

కుల వర్గములఁ గ్రుళ్ళి కుమిలిన నీ మతం
బుదరింపఁగఁ జక్కఁదిద్దు కతన
మాలకై మందారమాల కై సేసి నీ
దేవాలయము తల్పి తెఱచుకతన
పొగలతో సెగలతోఁ బొగులు హిందూమున్లి
ముల కొగిలింతలు వలచుకతన
ఖేద సాదుల నెత్రు పీల్చి గట్టిన ద్రేఁచు
సాహుల నదలింప సాగుకతన
ప్రజ నెదిర్చిన నాఁడు మీ బ్రతుకు లేదు
లేదనుచుఁ గింప్రభుల మందలించుకతన
కాల్చితఁట రా జగత్త్రియా కర్మయోగి
లోక మూర్తాభిషిక్తు - గోడ్సే కిరాత.

శతథా - కాదు- సహస్రథా తునియలై సామ్రాజ్యవాదం బహో,
యతలంబున్ సుతలంబు నంటుతటిఁ బ్రాజ్యంబుల్ ప్రజా రాజ్యముల్
క్షితినెల్లన్ వికసించువేళ నసురస్పృహ్యాం బసహ్యంబు నౌ
మత రాజ్యంబున కుద్యమించి తఁటకా మాత్సర్యధుర్యాగ్రణీ.

మతము పేర్వెట్టి కపట ధర్మములు పల్కి-
మోస మెఱుగని సాదుల ముంచి ముంచి
బొట్టి పెంచెడు వారికి బుద్ధి సెప్పు
కాల మేతెంచె నని యెఱుంగవె జడాత్మ.

పుట్టుకతో నాధిక్యము
పెట్టెన్ సోమరికిఁ బెద్దపీఁటను వైచెన్
ముటుకొనరాని మానవు–
గట్టా, నీ మెచ్చు మతమ కద సృజియించెన్

బుక్కొ లొకనికి నొకనికిఁ జెక్కొభజన
ప్రభుత యొకనికి నొకనికి బానిసమ్ము
గ్రామ మొకనికి నొకనికిం గసటు గూడె
మేమి సౌభ్రాత్ర మేమి హిందూమతంబు

ఆనాఁడే సుపవిత్ర రక్తమున దాహం బార్చుకొన్నట్టి యీ
దీ నాఁ డెందును దిక్కులేని పురుగై యేఁకారుచున్నాఁడు నీ
వే నీచత్వము నేలెదో మఱియు నేయే హింసలం గూలెదో
దీనత్రాణ పరాయణున్ బుషివరున్ దిన్నాఁడ వేనఁజనీ.

చిత్తయినారులే దనుజశేఖర నీ ఖరవృత్తి ముం దిలా
భృత్తనయున్ వధించిన—మహీంద్రుని సానుజ సాశ్రితంబుగాఁ
గత్తుల బావిపొట్ట కెరగా నొనరించిన— వృద్ధమౌని పాల్
కుత్తుకనొత్తి అంపమునఁ గోసిన నాఁటి ప్రబుద్ధు లందఱున్

అక్కటా క్రిందుపడియెఁగదా కిరాత
జాతి కంటెను బ్రాహ్మణ జాతి యనుచు
జండెమును ధిక్కరించిన సాధుమతికిఁ
బ్రణతు లర్పింతు వేటూర్ ప్రభాకరునకు

బోయఁడు విప్రుడై భువన పూజ్యుని రాముని కీర్తినిల్పి రా
మాయణ సృష్టిచేసి నుతులందె నొకా నొకనాడు విప్రుఁడే
బోయతనమ్మునంది బుషిపుంగవు నేఁడు వధించె రామ సే
వా యజనార్థ్రచిత్తుఁ దన వంగస మాఱని లజ్జఁ గ్రుంగఁగన్

వేదము క్రోల్చి ధర్మపదవీ నదవీయసియైన బుద్ధికిం
బాదులు కట్టి పుణ్యముల పంటలు నూర్చి యనంత శాంతికిన్
మూదలయైన విప్రకులమున్ బిశితాశి యితండు నేఁడు దు
ర్వేదనపాలు చేసె నపవిత్రుల పుట్టుక లిట్టివే కదా

విప్రకులంబెకాదు కనువిచ్చిన హైందవ సంఘమెల్ల నేఁ
డప్రతిమ త్రపాపిహితమై భయ దుఃఖధురా పరిచ్యుత
క్షిప్రతమై ఖలుం డొకఁడు చేసిన పాపము జాతికే వినా
శ ప్రదమంచు నేడ్చు నవశమ్ముల ముప్పదికోట్ల గొంతులన్

ఏడ్చుటొకాదు భీష్మతర మీ ఘటనన్ విను చెంద లెందతో
యూడ్చిరి మేను - క్రైస్తవులు యూదులు ముస్లిము లెల్లవారలున్
మోడ్చిరి మోము నెవ్వగల ముంపులతో దిగువాటి కంటి నీ
రోడ్చిరి విశ్వవీథి విలయోదధి పొంగులు రేఁగెనోయనన్

చచ్చిరి దేశభక్తులు విశాంపతు లిద్ధ కవుల్ ప్రవక్తలుం
జచ్చిరి గాని ము. న్నెవని చావునకుం బ్రజలిట్లు క్రుంగిరే
సచ్చరితుండు పోవునెడ సర్వజగంబు లిటుల్ వెలార్చెన
త్యుచ్చతరాదరంబు, హృదయోద్గత భక్తియు సానుభూతియున్

నా పై బాంబులు ప్రేల్చినట్టి మనుజున్ నాపాలి చుట్టమ్ముగా
నా పుణ్యమ్ముల పంటగాఁ దలచి లే నవ్వుల్ వెలారించుచున్
దాపం బింతయు లేకయే నరిగినన్ దామప్పుడా నన్నువా
ణీపారమ్యముఁ జూపిమెచ్చుఁడని తండ్రి పల్కఁ పండించితే

క్రుళ్లిన యెముకకై కుక్క గుంపుల వోలె
నధికారమునకుఁ గారాడు వారి
లంచాలగడ్డి కాసించి సేవా ధర్మ
నియమముల్ బలిసేయ నేర్చువారి

కుహనా వణిజ్యోపగూహ నోద్రిక్తులై
సుధవోలెఁ బ్రజ నెత్రు జుట్టువారి
పరమత ద్వేషాగ్ని మరగి నారీ వృద్ధ
శిశు మండలిని జీల్చి చెండువారి

దేశ హిత కృత్యముల పేరఁ దెచ్చు నర్థ
మాత్మ బంధువులకుఁ బంచు నట్టివారి
ప్రతుకుఁ గనలేక కన్నుమూసితివి గాని
కలఁడె నీ గుండెపైఁ బ్రేల్వఁగల మగండు

నిన్నుం గొల్చినయట్ల కొల్చి నిను భూనీచేసిరే గోముఖ
చ్ఛన్న వ్యాఘ్రము లౌ పయోముఖ విషస్థాలుల్ దయాసూన్యత
స్కన్నుల్ వారలె నీకు దేవళములం గట్టించు పన్నాగముల్
వన్నెంబూనిరి స్వప్రయోజనకర ప్రజ్ఞావిధా చుంచువుల్.

బుద్ధుని యెంపముక్కల కపూర్వములౌ గుడు లిచ్చి కట్టి సం
విధ్ధనమెల్లఁ జూపి రపవిత్రవిధుల్ కథలుం బురాణముల్
వృద్ధియొనర్చి రాతఁ డుదయించిన భూములనుండి యెన్నడో
బౌద్ధము నెట్టివై చిరి జపాను సయాముల నాశ్రయింపగన్.

అతని హృదయంబ మధుర శిల్పాభిరామ
నిలయమై ప్రీతి సంధించు; నీ కెవండు
ప్రదుకులోఁ జావులో నీదు బాట ద్రొక్క
పీడిత ప్రజకై సల్పు నూడిగంబు

మనుజుఁడవుగావు నీవు కోమటివిగావు
బడలిపోయిన భారతీయుఁడవు గావు
కావు గాంధివి లోక లోకముల వెల్గుఁ
జూపు నిరవధికామరజ్యోతి వోయి.

నశ్వరమైన కాయము వినాయక ధూర్తుడు కూల్చెఁ గాని నీ
శాశ్వతమైన యాత్మ నెటు చంపఁ గలం డతఁ, డస్త్ర శస్త్ర తీ
వ్ర శ్వసనాగ్ను లేకమయి వచ్చున పో, యది లెక్క సేయ దీ
విశ్వము దాని చల్వ శుభవృద్ధము సత్యము సుందరంబగున్

శతజన్మార్జిత మామకీన సుకృతస్థానమ్ముగా నీ జగా
బ్రతుకున్ జొచ్చెడి కావ్యమున్ సుకవితా ప్రౌఢమ్ము నిర్మించినా
బ్రతుకుం ద్రోయఁదలంచుకొంటి మును పాపం బెద్దియో పండి నీ
మృతిపై నేఁడు కృతిన్ రచించితి మహోర్మిం బోని కన్నీటితోన్.

గుడిగంటలు

కాటూరి వేంకటేశ్వరరావు

ఏలికవై జగమ్ములకు నేడు మలల్
పయికొమ్మ్మీద శ్రీ
సీళలు జోలవాడ శయనించిన
దేవర, మేలుకో, కృపా
వాల, శ్రితానుకూల, శ్రుతిపారచర
త్పదపద్మ, మేలుకో
నీలసరోజపత్ర రమణీయ
విలోకన, మేలుకోగదే.

నైగమ మూలమంత్రములు
నాందిముఖమ్ములు విశ్వసృష్టికిన్
యోగి సమాజమానసగుహోదిత
మంగళదీపికా రుచుల్
సాగరకన్యకా హృదయసారస
షట్పదగీతికారుతుల్
నీ గుడిగంటసవ్వడులు నింగి
చెలంగెఁ బ్రబుద్ధలోకముల్.

తిరుపతి తుంగశృంగవసతీ,
వినవచ్చెను సుప్రభాత గీ
తరవము, సౌఖశాయనిక
దాస జనుల్ కప్పురంపుటారతుల్

కరముల దాల్చి నిల్చిరి,
జగమ్ములు నీ కనువిప్పు వేచెడిన్
సరగున మేలుకో, కొలువుసాలను
దర్శనమిచ్చి యేలుకో,

అరుణగభ స్తి నీ గిరుల యంఘ్రిలు
ముట్టి, ప్రదక్షిణించి గో
పుర శిఖరమ్ములం బొదివి,
పుష్కరిణీజలజాతకోశముల్
విరియఁగఁజేసి, పుప్పొడులు
వేయికరమ్ములఁ దాల్చి నిల్చె దే.
వర తిరుమజ్జనమ్ము తఱివార్చి,
జగత్పతి మేలుకోఁగదే.

తిరుమలవాస వేంకటపతీ
తిరుమజ్జన మాడి, భూషణో
త్కరములు బైడిపుట్టములు
దాలిచి, లోకవిమోహనమ్ముగాఁ
దిరుమణిబొట్టు నెన్నొసట దిద్ది,
సహస్రమయూఖకోటి భా
సురమకుటమ్ముతో భువనసుందర
దర్శనభాగ్య మీఁగదే.

ఆడెద రచ్చలన్ కరము
లౌఁదలఁజేర్చి బలారి మున్నుగాఁ
వేఁడెద రాద్యులౌ మునులు
విప్రవరుల్ ద్రవిడ ప్రబంధముల్

పాడెదరోయి, శేషగిరివాస,
హజారపుగొల్వువాకిటన్
గూడిరి విందులై హరిజనుల్
తెఱపించవె ద్వారకవాటముల్.

చీమలబారులై సగము చెంత
విహంగమపంక్తులయ్యా, ఆ
ఖామృగతండ మౌచు: మునిగాళుల
దాఁటెడి మేఁకమందలై,
వామనమూర్తులై, దరియవచ్చి
రదే నరనారు లో పరం
ధామనివాస, యీ హరిజనమ్ములు
విందయి తల్పుదీయవే.

ఏడు కొండలనెక్కి యీరేడు లోకముల్
పాలించుకొనెడి మాపాలివేల్పు,
చేఁదికోవే మమ్ము శ్రీనివాసా, వడ్డి
కాసులవాఁడ, వెంకన్నసామి,
అడుగడ్డు దండమ్ము లాపద మ్రొక్కులా
దేవరా, మము చేఁదికోవె వరద,
వేంకటరమణ, గోవింద, హరీ చేఁది
కోవయా దేవాదిదేవ, మమ్ము

చేఁదికొ మ్మింత చేయిచ్చి, ఆఁదుకొమ్ము
చేఁదికో, చేఁదికోయంచు జేతులెత్తి
హరిజనులు గొండ లెగఁబ్రాకి రభయముద్ర
మెరయఁ బ్రత్యక్ష మగుమయ్యా, తిరుమలయ్యా.

అదెయిదె శేషశైలమని యాదట
నొండొరుఁ బిల్చుచున్ శ్రమం
బొదవిన నిన్నుఁ బేరొక్కనుచు
నొక్కొకచే మల లెక్కివచ్చి, నీ
పదములు చూచువేడ్క విరబారిన
వీరల చూడ్కు లెంతగా
గొదగొనియున్నవో, తలచుకో
నెరచూడ్కుల గొఁగిలించుకో.

దిద్దిన పట్టెనామములు, దీర్చిన
తిర్మణిబొట్లు, మోములం
దొద్దిక, చూడ్కులందు నెన
రుప్పతిలన్ గయిమోడ్పు మాలికల్
పెద్దలు పిన్నలున్ వరుసవెంబడిఁ
దాలిచి నిల్చియుండ, దీ
వ్యద్దయ, డాగికోఁ దగదయా,
కడుదొడ్డ దొరౌదులేవయా.

అడుగగరారు రాచరిక,
మాపద మ్రొక్కులవారుగారు, నీ
కడుగర లీయలే, రడుగ నొల్లని
యర్థము వేడఁబోరు, వీ
రడిగిన దొక్కచే, విరచి
తాంజలిమాలలు మాలలెల్ల నీ
యడుగుగవన్ బ్రసన్న జన
తార్తి హరమ్మును జూడనీఁగదే.

వేదశిఖాధ్వనీన మరవిందసఖ
మ్మమరేంద్ర పూజితం
బాదిమసర్గమూల మఖిలాశ్రిత
రక్షణదక్షమైన శ్రీ
పాదయుగమ్ము దొలఁగని,
పాణితలమ్ములు మోడ్చి ధన్యలై
పోదురు వీరు, వాకిళులు మూయకు
నీ గుడికో దయాలయా.

వినుమో దేవర, కొండపె వెలసె
గోవిందుండు వెంకన్నయం
చనుకొంటే వినుచుంటెకా
కెఱుఁగరయ్యా జియ్య నీ రూపమున్
జినదేవుండవొ, శక్తివో, శివుడవో,
శ్రీమద్వికుంఠుండవో
కనువిందై కనుపింపరావె
త్రిజగత్కల్యాణ రమ్యాకృతీ.

నీ పాదమ్ములు మోముల న్నిలుపుచు,
న్నీ పాటలే పాడుచున్
రేపున్మాపును నిం దలంచికొనుచు
న్నీ పేరుగా నింటిలో
దీపంబెత్తుచు వేడికో శ్నిడుదు రింతే,
నేఁడు నీ కొండపై
రూపుం జూడఁగ వచ్చినారు శరణార్థుల్
మోము జూపింపవే.

వేంకటసామి, కొండపయి వేలుపు,
భక్తుల పాపపంక మి
ట్టింకుల నింకఁ జేయగల యేలిక,
దాసజనమ్ము కోరికల్
కొంకక నాల్గుచేతులను కొల్చి
యొసంగెడి దాతయంచు నీ
వంకకుఁ బుట్టెదాసమెయిఁ
బర్విడివచ్చిరి తల్పు దీయవే.

గంగానమ్మల, బీరుసాహెబుల,
నంకమ్మల్ మదార్సాహెబుల్
బంగారమ్మల, మద్దిరామమల,
మాలక్ష్మమ్మలన్, బోతురా
జుం, గొంతెమ్మల గొల్చి పీరి కెదలోఁ
జూపట్టి నీ ప్రాపు జే
రంగావచ్చిన యీ ప్రపన్నులకుఁ
దీరా మోము చాటయ్యెదే.

తొంటిభవంపు బున్నెములు
దోడుగఁబుట్టిన భక్తకోటి నీ
వంటివిభుండు దైవమును.
బంధువు లేఁడన వించు నున్కిఁ గ
ట్టంటని బీళ్లు వీరి హృదయమ్మ్ముల
నాటిన బిత్తి విత్తనాల్
పంటకు వచ్చెనేఁటి కిఁకఁ
బిళ్లికలెత్తు ము తోలేఁ బయ్యెరల్.

కొండికనాఁడు ముజ్జగము
గొల్చిన నీ చరణద్వయమ్ము నె
న్నండొ యొకప్పుడీ హరిజనమ్ములు
గొల్చుట కేకసాక్షియై
యుండఁగఁ బాదుకాద్వయి:
అయో, యిపు డూడిగ మొల్లనందువే
వెండియుఁ గొల్చుకొందు రిడవే,
కయిసేతురు క్రొత్తపాదుకల్.

కొండల లోయలన్ దిరిగి,
కోనలఁ గ్రుమ్మరి, తమ్ముగుట్టతో
నండజయానతో నడవులం
దటు ద్రిమ్మరి బొబ్బ లెత్తెనో ?
పుండులు పడ్డవో చరణముల్,
త్రిజగ చ్చరణమ్ము లో దయా
మండన, వీరికిమ్ము పదమండన
దాస్యము, చారితార్థ్యమున్.

సుమసుకుమారముల్, సులభ
సుందరముల్, జగదేక మోహవి
భ్రమములు, నబ్జిజామ్యదుల
పాణిసరోరుహసేవితమ్ము, లా
క్రమిత త్రివిష్టపమ్ములు, పురాభవ
మత్కృతపుణ్య భోగ భా
గ్యములు, విలోకనోత్సవములై
చరణమ్ములు మమ్ము నేలుతన్

హరి, గోవింద, రమామనోరమణ,
శేషాహార్యశృంగాగ్రమం
దిర. మాణిక్య కిరీట కాంతినిచ
యాంధీభూత స్తప్తాశ్వ, పా
దరజోలేశ విధూత ఘోర కలి
సంతాపా, కృపాపాంగ, నీ
చరణమ్ములో శరణాగతా
భయకళా సర్వస్వముల్ చూపవే.

ఎన్నెండ్లాయెనో కొండపై వెలసి
సామీ, నీవు, నిత్యమ్ము నా
పన్నుల్ వత్తురు, నీవు నిత్తువుగదా
భద్రమ్ము, లీనాటి ద
న్యసీమ్ల వాకిలి ద్రొక్క, యీ హరిజనుల్
కైసాచిరే ? వీరలం
జిన్నంబుచ్చుట దొడ్డ వేలుపుల
కిస్సి వన్నెయో, వాసియో.

ఒరగంబండిన పంట చేలఁ గనరా
పూర్వేశ్వరాస్థానముల్
జొఱవో నంగడిబేర సారములలోఁ
జూపట్ట, వీ యంత్రమం.
దిరనిర్ఘోషలలో వినంబడవు
తండ్రీ, వీరి పాలింటి కీ
గిరిశృంగమ్మునఁగూడ లేవయితివే,
కీడెంచి మేలెంచవే,

వరడులు గంకగృధ్రములు
వాయసముల్ చెరలాడు నిచ్చమై
కొఱవులు బూని శాకినులు
గ్రుమ్మరు, నెత్తుటిపట్టు లోడఁగాఁ.
బుటీయలు దేల మొండెములు
మున్కలు వెట్టగ వల్లకాళ్ళుగాఁ
బరగిన పంట చేలఁ బెనుపాపము
పండెడు నిద్రమేలుకో.

నేలపయిన్ జలమ్ములను నింగిదెసన్
బెడబొబ్బ వెట్టుచున్
గాలకరాళవక్త్రిము లకాల
మహాశనిగోళ పాతనా
భీలములై, జ్వలద్వికృత వేషము
లీ పెనుభూతముల్ పవల్
రే లొకమైఁ జరింప నిదురించెదవే
పదిలమ్ముగా గుడిన్.

కావిరి దిక్కులం దలమె,
క్రవ్యభుజుల్ ప్రబలాట్టహాస వై
రావముఖుల్ పురమ్ములను
గ్రామములందు కపాలహస్తులై
క్రావుచు నెత్తురుల్ వికట
తాండవకేళి యొనర్తు రిమ్మెయిన్
గోవెలలోనఁ గన్మొగిచి
కూరుకుచెందకు మో జగత్పతీ

కమ్మని పాయసాన్నములు,
కస్తురిపూతలు, కప్పురంపు దీ
పమ్ములఁ, బున్గుధూపములు,
పైడినగల్ జలతారు పట్టుబు
ట్టమ్ములు నిత్యభోగము లొడంబడి
నీవిటు కొండకొమ్మపై
నెమ్మది నున్నచోఁ గడుపు నిండునె
సాదకుఁ గూటి పేదకున్?

చీకటి కొంపలో బ్రదుకు,
చింకితలల్, మెయి గాటిపాఁత, పె
ల్లాఁకటికింత సంకటియు
నంజలియున్, జవి కింత యుప్పుగల్
వేఁకటి కింత చప్పిడియు,
వేఁకికిఁ బస్తులు నైన వీరిపై
నీ కరుణా కటాక్షరస
నిస్సరణమ్ములు పొంగిపారుతన్.

భయమే యీ గిరిమీఁద నిన్
నిలిపె, నాపన్మగ్నులే వచ్చి నీ
దయ లొక్క మ్మిడి నిల్తు, రే మిపుడు
ప్రత్యక్ష ప్రమాణాగమా
ధ్యయనాగారములందు తేల్చితిమి
నీ తత్త్వమ్ము నల్లంత. వెం
కయసామీ ....తొలినాళ్ళఁబోలె నిఁక
సాగంబోవయా భోగముల్

ఆలం గాచును, క్షీరముల్ పిదికి నీ
కర్పించు, ముక్కారులున్
జేలం బైరులు పెంచు, నీ గరిసెల
న్నిండించు ధాన్యమ్ము; లి
ట్లాలుం బిడ్డల కొక్క ప్రొద్దు లిడి,
ని న్నర్చించు ముప్పొద్దు, ప్రా
ల్మాలం దెన్నఁడు మాలఁ డాతనికి
నేలా మోము జూపింపవో.

తిన్నాఁడో పస్తులే యున్నాఁడో, ముప్పొద్దు
గుడువఁబెట్టును నీకుఁ గడుపునిండ
కష్టినో మైగోచి పెట్టినో, దువ్వలు
వలు దెచ్చి నీకిచ్చుఁ దలకు మొలకు
నీరాడెనో ధూళిపారాడెనో, సుగంధ
సీరమ్ము లార్చు నిన్ రేపుమాపు
ఎండెనో తడిసెనో, ఎండవానలు సోఁక
కుండ నీకిడు గుళ్ళు గోపురములు

నేఁడు కాదుగదా యితం డూడిగమ్ము
సలుపు, టొకనాఁడుఁ గోరిక దెలియనడుగ,
వడుగవచ్చిన గుడి దూరి గడియవైచి
కూరుచుంటివి కొండెక్కి గొప్ప దొరవు!

ఒత్తి కొలంకులై నెనరు పాఁతున
నిల్కడ జెంది, సుంతపో
పెత్తిన కౌతుకమ్ము మెఱుఁ
గేచిన వీచికల్ల అల్లదే.

క్రొత్త దలిర్చె నీలమణి
రోచి రుదాత్తభవత్పదాబ్జ సం
పత్తికిఁ దావలంబులయి
భాసిలు భక్త జనావలోకముల్.

తెల తెల వేగెడున్ దెసలు
తెమ్మెర లల్లలనార్పఁగా వన
స్థలములు కమ్మతావి వెదఁజల్లుచు
విచ్చెను నేత్రకుట్మల
మ్ములు, పులిమెట్టపై నడుగుమో పెఁ
ద్రయీమయుఁ డండజాతముల్
వెలువడె గూండ్లు లోకములు
నేచెడు దేవర పాదసేవకై.

ఎఱకల్ సాచి చరించుఁ బక్షు లెరకై
ఏతాములం దోట కాఁ
పరి నీళ్ళొత్తెను, గొండరాళ్ళ బయిడిన్
బండింప నాగళ్ళు ప
న్నిరి కాపుల్, పటుమానసాలయములన్
దీపాంకురారాధనల్
గురువుల్ సేతురు విశ్వమెల్ల గుడి
మాకున్ నిన్ను సేవింపఁగన్.

ఆలుంబిడ్డల ప్రోపులోఁ గలవు,
రోగార్తో పచారమ్ములో
జోలల్ పాడుచు నిద్రపుచ్చటలలో,
శోకాపనోదమ్ములో

నాలం గాచుటలో, బుభుక్ష కిడు
నాహారమ్ములో, కట్టియల్
ప్రీలంగొట్టెడి ప్రేటులో గలవు,
నీ వృత్తమ్మకా సర్వమున్.

కసవున్ జిమ్మెద నీరు జిల్కెదను
కల్యాణ గేహాన, బా
నసమున్ జేసెద, గట్టియల్ విరుతు,
గింజల్ పొట్టువో దంచెదన్
కుసుమాన్నంబులు వార్చి నీ కిడెద,
నంట్లుం దోముదున్, వీవనన్
విసరన్, బాదము లొత్త నాకిడవె
తండ్రీ జన్మ జన్మాలకున్.

అఖండ గౌతమి

గుఱ్ఱం జాషువా.

సారంగధరుని వెచ్చని రక్త మింకిన
మెట్టకు కన్నీటి బొట్టొసంగి
చిత్రాంగి చిత్రాతిచిత్రగాథను జ్ఞప్తి
కందించు జీర్ణహర్మ్యముల నరసి
నన్నయభట్టు స్నానంబాడి చనురేవు
లిదమితమని నిర్ణయింప దిరిగి
రాజరా జాంధ్ర భారత కృతిం గైకొన్న
కొలువుకూటపు చోటుకొరకు నెమ్మి
పండితులు రచ్చచేసి వివాదపడుచు
ఘనుని శ్రీనాథ దృష్టికెక్కిన స్థలంబు
యిది యిదౌనంచు నెది నిర్ణయించలేక
మధుర మధుర స్మృతుల మేను మరచినాడ.

గట్టులుదన్ని పారుచు నఖండరయంబున వచ్చు నబ్ధిరా
ట్పట్టపు రాణి గౌతమికి భక్తులు కానుకలిచ్చి క్రుంకులన్
బెట్టి చరించు పుష్కరపువేళల వైభవమెల్ల కన్నులన్
గట్టినయట్టు లుండు గతకాలము వచ్చునె భిక్ష మెత్తినన్.

ఆనాటి పుష్కరోత్సవ
మానందము గొల్ప పద్దియములల్లి యిదే
కానుక నీ కని పత్రము
నా నదినీరమున త్రోసి తావేశమునన్

ఆలోచించితి నిల్లుజేరి నదికిట్లర్చావిధుల్ సల్పుటల్
మేలే ? మేలు ఘటించునే ప్రకృతికిన్ మేధస్సు పెంపారునే
వేలున్ లక్షలసంఖ్య సంఖ్యలు ప్రజల్ విచ్చేసి సద్భక్తితో
పూలుం బండులు కాన్కలిత్తురిది జబ్బో, లేక ఆరోగ్యమో.

ఇరు గడల తీరభూముల విరగదన్ని
పల్లియల పక్కణముల గర్భమున గ్రుక్కి
భయద రూపిణియై మహార్భటి నటించు
కటికినీటికి తలకాయ గలదె తలప.

పొట్టకోస మారెబట్టి గట్టున నున్న
మానవులకు పుట్టుబానిసలకు
వచ్చిపోవువారి పాదరక్షల ధ్యాస
తప్ప పుష్కరాలధ్యాస నున్న.

డబ్బు లఖండ గౌతమిజడంబుల జిమ్ముచు భక్తకోటి పె
న్జబ్బులతో తపించెడు సనాథులు చేతులు సాచిమ్రొక్కినన్
కొబ్బరిముక్కలన్ విసరికొట్టుచు తిట్టుట జూచి గ్రుడ్లనీ
రుబ్బ మొగంబు త్రిప్పుకొని యూర్పులు జిమ్మితి వెచ్చవెచ్చగా.

ఒక్కభక్తవరుని నొడిసి యెత్తుకుపోయె
మొసలి యొకటి నీట మసలుచుండి
"మేలు మేలు పర్వకాలాన జచ్చుట
పున్న" మనిరి చూచుచున్నవారు.

ఇన్నివేలమంది కేయభీష్టము లిచ్చి
యెట్లు తృప్తిపరచు నీ స్రవంతి
జడపదార్థములకు సచ్ఛక్తి లిండియా
ఖండమందె డాగి యుండునేమొ ?

అని పృచ్ఛించితి మిత్రు నొక్కని నతం డాలించి యొక్కింత హే
ళన గావించి "మహానుభావులు ఋషుల్ సంధ్యాద్యనుష్ఠానముల్
మునుకల్ సల్పి తరించిపోయిన మహాపుణ్యాపగాదేవి ద
క్షిణగంగాఖ్య గ్రసించు నబ్ధిసతి, వేంగీ కొంగుబంగార మౌ".

అనుచు చెప్పసాగె నాతండు పుక్కిటి
కతలు నాకు కొంత మతిచలింప
గ్రుడ్డినమ్మకాల కడ్డుచెప్పుటకన్న
కొటివితోడ గోకికొనుట మేలు.

"కవన మేడ్తువు గాబో లఖండు డైన
శబ్దశాసను డిన్నుదీ జలము గ్రోలి
వ్రాసినా డంద్రు భారతగ్రంథ మెల్ల
భీమకవి జిహ్వ కిదె వాక్కు భిక్ష పెట్టె.

అస లీ నది పగ లెల్లన్
రసరూపు ధరించి నిశల రమణీయదివౌ
కససతియై యర్చించెడి
నసమనయను కలువపూల నక్షాంతంబున్.

గౌతమ సన్ముని కీనది
కూతురు, జలరాశి పెండ్లి కొడుకై మునుపీ
గౌతమి జడ నుంచిన కం
జాతసరాల్ నేటి కుదయ సంధ్యల పూయున్.

గగనంపు పూవు లరచే
నగుపించెడు నంచు భక్తు లల్లినగాథల్
తెగవాగు నతనితో నిక
సిగపట్లగునంచు బదులుచెప్పక వింటిన్.

వినివిని, ఉత్తమంబగు కవిత్వపటుత్వమఖండ గౌతమీ
ఘనతరస్నాన పానముల గల్గు రహస్యము చెప్పి జన్మపా
వన మొనరించినాడవు సెబా సని కౌగిట జేర్చి ఖడ్గవా
దన కెడమీక పంపితి, నతండును పోయె సలాము గొట్టుచున్.

కాయములగు భిన్నాభి
ప్రాయములే ద్వేషమునకు రహదార్లని నే
నాయువక సఖుని హృదయము
గాయముగా కెదురుపల్క-కయ వినుచుంటిన్.

పదివేల గొంతు లొకటై
వదరు నబద్ధప్రచారవాహిని కెదురై
బ్రదుకుట దుర్లభ మెంతటి
యథార్థమున్ దుదకు నగ్నమగు హేళనకున్.

సరస్వతీ సాక్షాత్కారము

పుటపర్తి నారాయణాచార్య

"హస్తమున నామలక
మట్లు యోగస్థితుడు
మునిరాజు రామకథ గాంచీ-రసభావ
ములతోడ నొడలు పులకించీ-గంటంబు

సుధలోన నద్దికొని-మధుర మొక్కొక శ్లోక
మొక యప్సరసగాఁగ-వికసింప నందములు
రచియింపఁ బూనుకొని
రసపూరమై జగతి

దన కవితలోఁ బ్రతిఫలింపా-నరులు, దే
వతలు, మదులనుఁ బల్ల వింపా-ఒకవేయి
వీణియలు మ్రోగించు వితముగా, దనకున
క్షరరమ్యతలు వశముగా-ప్రసన్నాంబు కథ
అభివలె రత్నాద్య
మై-చతుర్విధములగు
బురుషార్థములకుఁ బట్టగుచూ-కవియన్న
వానికెల్లను సేవ్యమగుచూ-నున్నట్టి
రామకథ భావించె, రసరాజు-ఋతురాజు
పద పదమ్మునయందు, వాసనలు వర్షింప-
అ య్యాదికవి దరికి
నమరలోకమునుండి

దిగివచ్చినది గిరాందేవి-శ్రుతికలిక
కల్హారమాలలకుఁ దావీ-కచ్ఛపీ
షడ్జపంచమశయ్యా, సంరంభమునవాన్న
కేకిలోకమ్ములును, గోకిలలు నెలుగివ్వ-

చేర్చుక్కగా నిడ్డ
చిన్ని జాబిలిరేక

సుధల నిటలము చెమ్మగిల్లా-అవతంస
సుమధూళి చెంప సొంపిల్లా-తిలకంబు
ప్రతిఫలించినయట్లు, బంధూకబంధువగు
తరుణాధరంబుపై-చిఱునగవు వట్రిల్ల-

దిగివచ్చినది దేవి
నిగనిగలు మిట్టింప

తాటంక చిత్ర చంద్రికలూ-చంద్రకిత
తరళతరములు కటాక్షములూ-ఘన జఘన
నర్తకీ కింకిణులు, సప్తస్వరము లీన
నుపనిషత్తులు బోటు లోలగింపులు బూన

హంస వాహిని వచ్చె
హంసకమ్ముల రుతులు

శ్రుతుల నీనగ రసస్ఫూర్తి-పదయుగళ
కాంతినిండగ దివ్యమూర్తి-భావాంబ
రాకీర్ణమైనట్టి యా దివ్య తనువుగని
యమరులును దేవర్షు లమృత విగతస్పృహలు-

చేతిలో నున్నట్టి
జిలువాఱుచిలుకఁ బ్రణ

యార్ద్రిమ్మొగా ముద్దు గొనుచూ-నీలములు
వించు దృక్కులఁ గెలనఁ గనుచూ-వచ్చినది
వాగ్దేవి, దాడిమీఫల బుద్ధి కరవలయ
పద్మరాగంబులకుఁ బడఁబాఱఁ గీరములు

తఱుకుటద్దంబు స
త్కవుల మనస్సైనట్టి

బ్రహ్మణి. వాల్మీకియందూ-తననీడ
జూచికొనఁ గౌరి మనమందూ-ఘనసార
మందార హిమ హీర గంధసార మృణాళ
వారసితవర్ణ, యీ వసుమతికి వచ్చినది.

ఎదుట నిల్చిన తల్లి
హృదయంబు, భక్తి దం
తురితంబుగాఁగ వీక్షించీ-కరకమల
ములు మోడ్చి సేవలర్పించి-వాల్మీకి
నిలుచున్న, దరహసిత నిభృత సుందరమూర్తి
మౌని చిత్తమ్ములో లీనమయ్యెను దేవి

లీనమైంతనే
మౌనిహృదయము కోటి
జాహ్నవులలో మున్గినట్లూ-శతకోటి
పూదరులు వికసించినట్లూ-నవరసము
లిఱుగెలంకుల నిల్చి 'యేమిపని'-యన్నట్లు
జగతి బ్రహ్మానంద సరస్వమైనట్లు-

పలికినది వాగ్దేవి
పరమర్షి యెదనిల్చి

గడచిపోయిన రామకథనూ-ముందు రా
బోవు దివ్యంపు వృత్తమునూ-ప్రతిపదము
నందు వాగ్దేవతా హస్త పద్మ మధూళి
ప్రతిబింధమున యందు వల్లకీ నాదంబు-

శరచ్చంద్రిక

శ్రీ శ్రీ

నవీన విశ్వవిద్యాలయాల్లో
పురాణ కవిత్వంలాగా
శ్రవణయంత్రశాలల్లో
శాస్త్రీయ సంగీతం లాగా

ఇలా వచ్చావేం వెన్నెలా?
ఎలా వర్ణించను నిన్ను?
మహాకవులు లోగడ చెప్పిందే
మళ్ళీ మళ్ళీ చెప్పాలా?

ఏదో కాస్త భాషాజ్ఞానం
ఇంతో అంతో ఛందస్సంపదా
ఐదో పదో అలంకారాలు
అరో, అందులో సగమో ఆవేశం

ఇలాంటివే ఏవో పోగుచేసి
ఇదివరకు నిన్నెప్పుడూ చూడనట్లు
ఇవ్వాళే కొత్తగా కనిపెట్టినట్లు
ఏమని వర్ణించను నిన్ను ?

ఏది రాసినా ఏం లాభం ?
ఇదివర కెవడో అనే వుంటాడు
బహుశా ఆ అన్నదేదో నాకన్నా
బాగానే అని వుండొచ్చు.

అలాంటప్పుడు మళ్ళీ
కలం కాగితంమీద పెట్టి
కళంకం లేని తెల్లదనాన్ని
ఖరాబు చెయ్యడ మెందుకు ?

అనాదినుంచీ నువ్వు
అంతమంది కవులకీ
ఉపాదేయ వస్తువుగా నిలిచి
ఉపకారం చేశావు

అలాగే నేనూ ఒకప్పుడు
రొమాంటిక్ ప్రమాదంలో పడి
అమాయకంగా నీ బ్యూటీ
అభివర్ణించాను వృత్తాల్లో

ఇవాళ మళ్ళీ అలాగ
ఎలాగ రాయగలను నేస్తం?
ఇరవయ్యో ఏడు నాకు మళ్ళీ
ఎలా వస్తుంది చెప్పూ?

అంచేత నీ గురించి
అనవస రావేశాలు పెంచి
అన్యాపదేశంగానో లేదా
అర్థాంతరన్యాసంగానో

సొంత కోపాలేవో పెట్టుకొని
పంతాలు పట్టింపులూ పట్టుకొని
ఎవరినీ ఈ వ్యవహారంలో
ఇరికించ దలచుకోను నేను.

ఇంతకీ ఆవేశాల కేముంది?
ఎవడి బతుకు వాడు బతుకుతున్నాడు
ఎంతగా ఎడం ఎడంగా ఉన్నా
ఎంతగా పైపై భేదాలున్నా
ఎంతగా స్వాతిశయం పెరిగినా
ఎంత బలం ధనం జనం పెరిగినా
అంతరంగం అట్టడుగున మాత్రం
అంతమందిమీ మానవులమే.

అందుచేత ఓ చందమామా!
అందమైన ఓ పూర్ణసోమా!
సముద్రం మీదా అరణ్యంమీదా
సమానంగా ప్రకాశించే సౌందర్యాభిరామా!

—అదుగో మళ్ళీ కవిత్వం.—
అనుకున్నాను మొదటే నేను
వెన్నెల పేరెత్తితే చాలు
వెర్రెత్తి పోతుంది మనస్సు —

అన్నట్టు ఏమిటి చెప్మా
అందామని అనుకున్నాను
ఏమీలేదు ! ఏమీలేదనే
ఇంతసేపూ చెబుతున్నాను.

చెప్పొచ్చిందేమిటంటే
చెప్పడాని కేమీ లేదని
అంతమందికీ అన్నీ తెలుసు
అదే మన అజ్ఞానం.

ఎవడో చెబితే వినే రోజులు
ఏనాడో వెళ్ళిపోయాయి
ఇంకా ఏదో చెప్పాలని
ఎందుకీ ఉబలాటం ?
అసలు నిజం ఏమిటంటే
ఎవడికీ ఏమీ తెలియదు
ఇలా ఎందుకొచ్చామో
ఇక్కడెంతసే పుంటామో
ఇక్కడినుంచి వెళ్ళే దెక్కడికో
ఎల్లుండి ఏ తమాషా జరుగుతుందో
ఎవడూ చెప్పలేడంటే నమ్మండి
చెబితే మాత్రం నమ్మకండి.

కాళ్ళకింద భూమి:
కరిగిపోతున్నప్పుడు
పూర్వం వేసిన పునాదులు
కదిలి పోతున్నప్పుడు

మనిషికీ మనిషికీ మధ్య ఈ
మాయపొరలు కప్పినప్పుడు
మనసుకీ మనసుకీ మధ్య
మంచుతెరలు కమ్మినప్పుడు

ఏ నక్షత్రానికి తగిలించాలి ?
ఈ మన విషాద శకటాన్ని ?
ఎవరు మళ్ళీ అతుకుతారు
ఈ విరిగిన జీవిత శకలాల్ని ?

అంతా అగమ్యగోచరం
అంతా అరణ్య రోదనం
ద్వేషం ఇచ్చే పర్సెంటేజీ
ప్రేమం ఎలా ఇవ్వగలదు ?

కష్టపడి ఆర్జించిన స్వాతంత్ర్యం
గద్దలు తన్నుకుపోతాయి.
కంచిమేక పాపం ఎప్పుడూ
కసాయివాణ్ణే నమ్ముకుంటుంది.

ఇంతకీ ఈ భూమికి
ఏమాత్రం ఈడొచ్చిందని?
పగటు మానవుడి వయస్సు
పదకొండో, పన్నెండో?

ఈ కుర్రాళ్లని చూసి
ఎందుకలా నవ్వుకుంటావు
మబ్బుతునక జేబురుమాలు
మాటుచేసుకొని, జాబిల్లీ!

మానవుడు పెరుగుతున్నాడు
పరిసరాల నర్థం జేసుకుంటున్నాడు
ప్రకృతి శక్తులను జయిస్తూ
ఘన విజయాలు సాధిస్తున్నాడు.

ఏదో నిరాశగా నేను
ఇంతసేపూ వాగాను కదూ ?
ఇంకో వేపునించి చూస్తే
ఎంత వెలుగు కనపడుతుందో

ఏమో బహుశా త్వరలో
మీ ఇంటికే రావచ్చు మేము
స్వాగతం ఇస్తావుకదూ
ఆతిధ్యాని కర్హులమే మేము

చంద్రమండలానికి ప్రయాణం
సాధించరాని స్వప్నంకాదు
గాలికన్న బరువైన వస్తువుని
నేలమీద పడకుండా నిలబెట్టలేదూ ?

పరమాణువు గర్భంలోని
పరమ రహస్యాలూ
మహాకాశ వాతావరణంలోని
మర్మాలూ తెలుసుకున్నాక
సరాసరి నీ దగ్గరకే
ఖరారుగా వస్తాంలే
అప్పుడు మా రాయబారుల్ని
ఆదరిస్తావు కదూ నువ్వు ?

చిరకాలం అజేయంగా వున్న
ఎవరెస్టు ఇటీవలే లొంగింది
చికిత్స లేవనుకున్న వ్యాధులు
చిత్తగిస్తున్నాయి పరారీ
పదార్థ విజ్ఞాన శాస్త్రం
అమోఘంగా వికసిస్తోంది
ప్రాణం స్వభావం ఏమిటో
పరిశోధనలు సాగుతున్నాయి

మహానదుల గమనాలను
మళ్లించ గలుగుతున్నాం
ఉత్తర ధ్రువంలో వ్యవసాయం
ఒకప్పుడు జరిగి తీరుతుంది.

సంహారం సంగ్రామం అంటే
జనంలో అసహ్యం పుట్టింది
ప్రశాంతంగా జీవించాలని
ప్రజలంతా ఆశిస్తున్నారు.

ఇదీ మా భూలోకం కథ
ఇదీ మానవుడి ప్రోగ్రెస్ రిపోర్టు
ఇందులో అతిశయోక్తులేవీ లేవని
ఎవరైనా ఒప్పుకుంటా రనుకుంటా.

అంతా బాగానే ఉందని
అంతా సుఖంగానే ఉన్నారని
అనాలంటే మాత్రం అది
అబద్ధమే అవుతుంది.

జనాభా లెక్కలు నాకు
సరీగా తెలియవు గాని
దరిద్రుల ఖాతం ఇంకా
చిరాకు కలిగిస్తూనే వుంది.

ప్రపంచం మొత్తంమీద
భయం పెత్తనం చేస్తోంది
ఇరుగువాడు పొరుగువాణ్ణి చూసి
ఎందుకో బెదిరిపోతున్నాడు.

ఇక్కడ మా భారత వర్షంలో
ఎక్కువగా కబుర్లే గాని
సమాజం స్వరూపం మార్చే
సాహసం కనిపించకుండా వుంది.

మొన్ననే ఆంధ్ర రాష్ట్రం
పుట్టినరోజు పండుగ చేసుకొంది.
పన్నెండు నెలల అభ్యుదయం
పర్యాలోకనం చేసుకొంది.

ఏడాదిలో ఏమవుతుంది
ఇంకా కొన్ని ఘ్నాగమంది
చెల్లా చెదరైన తెలుగువారంతా
తెల్లబోయి చూశారు.

ఇవన్నీ చెప్పుకుంటూ
ఎందుకు నిన్ను విసిగించడం శశీ :
ఇప్పటికే ఆలస్య మయింది
ఇంతటితో విరమించనా ?

చంద్రునికో నూలు పోగన్న
సామెత వుండనే వుంది
తీసుకో ఈ దారం లాంటి
తేలికైన గీతాన్ని.

ఇంతకు ముందే చెప్పానుగా
ఏమీ పెగల్లేదని-
ఇలాంటి వెన్నో నువ్వు
ఇదివరకు వినే వుంటావు.

శరత్కాల గగనంలో
చందమామ కనిపిస్తే
సరదాగా కొంతసేపు
సంభాషణ సాగించా.

సంతాపం కొంతసేపు
సంతోషం కొంతసేపు
సాగించిన సంభాషణలో
సారాంశం మరేముంది ?

ప్రసంగ వశాత్తూ ఏ
ప్రగల్భాలు పలికానో
అసందర్భమైనా ఏ
అడ్డదారి తొక్కానో

వెనుక తిరిగి చూచుకొనే
అలవాటే లేదు నాకు
అరనిమిషం దాటేసరి
కదే నాకు గత శతాబ్ది.

కావున ఓజాబిల్లీ
రాబోయే యుగంలో
కాలక్షేపం చేద్దాం
కలుస్తావుగా మళ్ళీ ?

అప్పుడు బహుశా నాలో
అరాజకం పోతుందనుకుంటా.
ఇప్పుడు బాధిస్తూన్న
హృదయ వేదన లుండ వనుకుంటా.

కాళ్ళా చంక్రమణం మాని
చెప్పేదేదో సూటిగా
బిల్ల గుద్దిన మాదిరిగా
కుండ బద్దలు కొట్టిన బాపతుగా

ఈ నీళ్ళు నమలడం లేకుండా
ఈ కాళ్ళు తడబడడం లేకుండా
స్పష్టంగానే కాకుండా కాఠిన్యంగా
స్వచ్ఛంగానే కాకుండా సమగ్రంగా

రాబోయే యుగంలో
గుండెలు విప్పి మాటాడుకుందాం—
మినహాయింపులు లేని క్షమాపణలు లేని
సౌందర్యవంతమైన ఆ స్వర్ణయుగంలో

ఎంచేతనంటే భవిష్యత్తుమీదే
ఎప్పుడూ నా నిఘా వుంటుంది
ఇవాళకంటే రేపే
ఎంతో బాగుంటుం దంటాను నేను.

వెళ్ళు జాబిల్లీ వెళ్ళు
కవులను కదిలించడం అంటే
కాలం డొంకంతా అమాంతంగా
కదిలించడమే అవుతుంది.

స్వయంగా నీతో మాట్లాడి
చాలా కాలమయింది
అందుకే అవ్యక్తంగా అయినా
ఆప్యాయంగా మాట్లాడుతున్నాం

ఎలాగైనా నువ్వు మాకు
ఏకరక్త బంధువుడివి
నీతో కాకపోతే ఎవరితో
మా మోషలు చెప్పుకోవాలి ?

వెళ్లు జాబిల్లీ వెళ్లు
వినిర్మలమైన నీ వెన్నెల కురిపిస్తూ
మనోహరమైన సంగీతం వినిపిస్తూ
ప్రయాణించు శశీ ప్రయాణించు

ఇదిగో మాట ; ఈ ప్రపంచంలో
ఇంకా ఎందరో అభాగ్యులున్నారు
పలకరించు వాళ్ళని చల్లగా
ధైర్యం చెప్పు వాళ్ళకి మెల్లగా

ఆసుపత్రి కిటికీల్లోంచి నీ
కిరణాలను జాలుగా పంపించి
వ్యాధిగ్రస్తుల పాలిపోయిన కపోలాలను
జాలిగా స్పృశించడం మరచిపోకు.

జైళ్ళలో వున్నారు కొందరు
వాళ్ళని ఓదార్చక తప్పదు సుమా
నేరాలు చేశారు నిజమే
అందుకని అలక్ష్యంగా చూడకేం

మురికి గుడిసెల్లో నివసించే
పరమ దరిద్రుల నుదుటిమీద
ఏ కన్నంలోంచో, జాగా చేసుకొని
ఎలాగైనా పరామర్శ చేస్తావు కదూ ?

ఇదిగో జాబిల్లి నువ్వు
సముద్రంమీద సంతకం చేసేటప్పుడు
గాలి దాన్ని చెరిపెయ్యకుండా
కాలమే కాపలా కాస్తుందిలే.

అమృతం కురిసిన రాత్రి

బాలగంగాధర తిలక్

అమృతం కురిసిన రాత్రి
అందరూ నిద్రపోతున్నారు
నేను మాత్రం
తలుపు తెరచి యిల్లు విడిచి
ఎక్కడికో దూరంగా
కొండదాటి కోనదాటి
వెన్నెల మైదానంలోకి
వెళ్ళి నిలుచున్నాను

ఆకాశం మీద అప్సరసలు
ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు
వారి పాదాల తారామంజీరాలు
ఘల్లు ఘల్లుమని మోగుతున్నాయి
వారి ధమ్మిల్లాల పారిజాతాలు
గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి
వారు పృథు వక్షోజ నితంబ భారలై
యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్నారు

నన్నుచూసి కిలకిల నవ్వి ఇలా అన్నారు
చూడు వీడు
అందమైన వాడు

ఆనందం మనిషైనవాడు
కలల పట్టుకుచ్చు లూగుతున్న కిరీటం ధరించాడు
కళ్ళ చివగ కాంతిసంగీతగీతాన్ని రచిస్తున్నాడు
ఎర్రని పెదవులమీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు.

ఎవరికీ దొరకని రహస్యాల్ని వశపరచుకున్నాడు
జీవితాన్ని ప్రేమించినవాడు జీవించడం తెలిసినవాడు
నవనవాలైన ఊహావర్ణవాల ఉదయించిన సూర్యుడు
ఇతడే సుమీ మన ప్రియుడు నరుడు మనకి వరుడు

జలజలమని కురిసింది వాన
జాల్వారింది అమృతపు సోన
దోసిళ్లతో తాగి తిరిగి వచ్చాను
దుఃఖాన్ని చావునీ వెళ్ళి పొమ్మనాను

కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను
జీవితాన్ని హసన్మందార మాలగా ధరించాను
జైత్రయాత్రా పథంలో తొలి అడుగు పెట్టాను
అమృతం కురిసిన రాత్రి

అందరూ నిద్ర పోతున్నారు
అలసి నిత్య జీవితంలో సొలసి సుషుప్తి చెందారు
అలవాటునీ అస్వతంత్రతనీ కావలించుకున్నారు
అధైర్యంలో తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారు

అనంత చైతన్యోత్సవాహ్వానాన్ని వినిపించుకోలేక పోయారు
అందుకే పాపం
ఈనాటికీ ఎవరికీ తెలియదు
నేను అమరుడనని.

"హే భగవాన్"

పి. నారాయణరెడ్డి

చాలాకాలం తర్వాత నిన్ను
సంబోధిస్తున్నాను భగవాన్.
వేళాకోళం కాదు, మనసు
విప్పి చెబుతున్నాను భగవాన్.

పూపప్రాయంలో వున్న బ్రతుకులు
వేపపూలూ రాలిపోతుంటే
పొద్దు గడిచిన ముసలి గ్రీష్మానికి
పునర్వ్యవ్వనం ముంచుకొస్తుంటే

ఇన్నాళ్ళు మర్యాదగావున్న ఋతువులు
ఎల్లలు దాటి దురాక్రమిస్తుంటే
ఎంతకాలం ఓపిక పట్టను దేవా.
ఎవరితో మొరపెట్టను మహానుభావా.

వచ్చిన టెలిఫోన్ పిలుపు అందుకోలేక
తెచ్చిన ముడుపులు దాచుకునే చోటులేక
దొంతరలుగా పెరిగిపోతున్న ఫైళ్ళమీద
పంతకాలుపెట్టే ఓపికలేక

ఎంతగా అలసిపోతున్నావో దయామయా.
ఎన్నాళ్ళ సెలవు లేకుండా పనిచేస్తావయా.
ఓట్లకోసం సీట్లకోసం
కోట్ల పచ్చకాగితాలతో నిన్ను

అహరహం అభిషేకిస్తున్న వాళ్ళ పరువును
ఆమాత్రమైనా నిలబెట్టలేకపోతే
నీ పరువు మాత్రం నిలుస్తుందా స్వామీ
నీకు తెలియనిదేముంది సర్వాంతర్యామి.

బియ్యంతో వియ్యమందే పలుగురాళ్లు
పాలతో తాదాత్మం చెందే పంపునీళ్లు
పట్టపగలే గుచ్చుకుంటున్న చీకటిముళ్లు
పాలక వర్గాలలో పరిమళిస్తున్న కుళ్లు

అన్నీ నీ లీలలేనా దేవా.
అవినీతిపై ప్రయోగాలు చేస్తున్నావా ?
శిల్పంలేని మాటలతో నీకు
చిరాకు కలిగిస్తున్నా ననుకోకు.

నాలుగు గ్రేసుమార్కులు విసిరికొట్టి
నా నోరు మూయించబోకు
గర్భగుడి తలుపులు మూసిన తర్వాత
కొత్త ఈ గీతం వల్లించుకో

సరికొత్త పాత భక్తుని దరఖాస్తులోని
సంవేదనలు గుణించుకో

విశాఖ లేఖ

జె. బాపురెడ్డి.

ఆ మధ్య మనం
హైదరాబాదులో
కలసికొన్నప్పుడు

"ఆబిడ్సు"లో
సరదాగా
కబుర్లు చెప్పుకు న్నప్పుడు
నీవు నన్నడిగావు—
"విశాఖపట్నం
విశేషాల గురించీ
అక్కడి ప్రజల
జీవితాల గురించీ
కవిగా నీవు పొందిన అనుభూతుల్ని
కావ్యంగా ఎందుకు రాయకూడదూ" అని.

నిజంగా—
విశాలమైన విశాఖపట్నం
సుందరమైన కావ్యవస్తువు.
అందీ అందని ఆనందాల
విందులకు ఆటపట్టువు.

"సింహాచలం కొండ"ల ప్రక్కల
చల్లని పిల్లగాడుపులు సేవిస్తూ
ప్రక్కనున్న సాగర సంగీతంలో
పరవశమై తేలిపోయే
నిత్య నూతన సముల్లాసిని
విశాఖపట్నం సుహాసిని.

చెప్పుకోదగ్గ విశేషాలు
చూడదగ్గ అలంకారాలు
చాలా ఉన్నాయి ఇక్కడ
అన్నిటికీ సముద్రతీరం
ఆరిపోని జీవరేఖ.

సాయంకాలం బీచిమీద
సరదాగా సాగిపోతూ ఉంటే
కలల అలలపై తేలినట్లుంటుంది
కమ్మని కావ్యం విన్నట్లుంటుంది
పొంగినట్లే పొంగి
తక్షణమే క్రుంగిపోయి
నిస్సహాయంగా పొరలుతూ
నిముషంలో విరిగిపోయే తరంగాలు
జీవిత మహార్ణవంలోని
తృటికాలపు జీవులకు ప్రతిబింబాలు,

జగత్తంతా ఆవరించినవాడు
అగాధమైన హృదయం కలవాడు
మహాశక్తి సంపన్నుడు ఈ సాగరుడే
ఇంతగా ఘోషిస్తుంటే
అనిపిస్తుంటుంది-

ఎంతటి మహాత్మునికైనా శాంతిలేదని
మనశ్శాంతి లేదని
ఎవరో వెంటబడి తరుముతున్నట్లు
పరుగెత్తివచ్చే కెరటాలు
అడ్డంగా నిల్చిన తీరాన్ని దాటలేక
నురుగులు గ్రక్కుతూ పడిపోయే దృశ్యాలు
గుండెల్ని కరిగించి వేస్తాయి
బ్రతుకులోని పరిమితుల్ని జ్ఞాపకం చేస్తాయి

అనంతకాలం వలెనే
అంతులేని సాగరమంతా
ముందునిల్చి వున్నప్పటికీ
ఎంతో దూరం చూడలేం ఈ తీరం నుండీ,
వినేవుంటావు నీవు
బీచిలోని స్కాండల్ పాయంటు గురించి,
ఈ మధ్యే కట్టారిక్కడ
అందమైన ఒక పబ్లిక్ పార్కు—
అమ్మాయిలూ, అబ్బాయిలూ
అతిథులూ, పథికులూ
దంపతులూ, స్నేహితులూ
అడుక్కునేవాళ్ళు, అమ్ముకునేవాళ్ళూ
అంతా చేరుకొనే చోటు—
బ్రతుకులోని
బాధల్ని తప్పుకోవడానికి
మనసులోని
మాటల్ని చెప్పుకోవడానికి
అనురాగాలు పెంచుకోవడానికి
ఆనందాలు పంచుకోవడానికి
అనువైన చోటు.

అల్లంత దూరాన
యారాడ కొండమీద
'లా' వ్యాల్లీకి ప్రక్కనగల
లైట్ హౌస్
చీకట్లను ఛేదించుకుంటూ
చూస్తున్నది దూరదూరాలకు
ప్రియునికోసం వేచిఉన్న ప్రియాంగన
కళ్లనీ్న దివిటీలు చేసుకొని
కలయ జూస్తున్నదేమో అన్నట్లు.
విశాఖపట్టణం 'ఓడరేవు'
విశ్వవిఖ్యాతమే గదా ?
సహజ సౌందర్య విలసిత మది,
సౌభాగ్యానికి సంకేత మది.

ఎన్నో బళ్ళల్లో తెచ్చిన సరుకుల్ని
ఇట్టే లాగేస్తుంది లారీ,
లెక్కలేని లారీలు మోసి తెచ్చిన బరువుల్ని
వెన్నుపై వేసుకుంటుం దొక్క ట్రటియను.
ఎన్నో ట్రాయినుల సంభారాన్ని
ఒడిలో వేసుకుపోతుంది ఓడ.
కొండలా కదలిపోయే ఈ ఓడల్ని చూస్తుంటే
నా కే మనిపిస్తుందంటే -
ఒకణ్ని మించినవా డొకడు
ఉండనే ఉంటా డీ లోకంలో - అని.

ఓడరేవు కటుప్రక్కన ఉంటుంది షిప్‌యార్డు.
ఓడల నిర్మాణానికి ఒకే ఒక్క కర్మాగారం.
నవభారత బృహచ్ఛక్తి భాండాగారం.

భారతీయ కార్మిక వీరులు
భారీ యంత్రాలను చేబట్టి,
నిరంతర శ్రమానలంలో
నిండు దీక్ష విద్యుజ్జ్వాలల్లో
ఉక్కును కరగించి
ఓడలు నిర్మిస్తుంటె చూస్తున్నప్పుడు
ఒళ్ళు నిలువునా పులకిస్తుంది.
ఆశావృక్షం చిగురిస్తుంది.

హనుమంతుడు సంజీవినీ పర్వతాన్ని ఎత్తినట్లు
అంత ఎత్తుగా నిల్చిన 'క్రేన్లు'
అనేక టన్నుల బరువుల్ని
అవలీలగా ఎత్తిపారేస్తుంటా యక్కడ.

ప్రజల్ని తరతరాలుగా పీడిస్తున్న
దరిద్రదేవత బండతలను
బ్రద్దలు కొడుతున్నట్లుంటుం దక్కడ
పనివాని ప్రతిసృత్తి దెబ్బా :

"విశ్వశాంతి" "విశ్వమాయ"
విశిష్టమైన ఓడలు ఎన్నో
ఇక్కడే వెలువడ్డ రత్నాలు
భరతమాత గళహారంలోని
ప్రగతి మాణిక్యాలు -

ప్రక్కనేవుంది "కాల్ టెక్స్"
మూనె ఋద్ధి కర్మాగారం -
మోటారు బళ్ళ బ్రతుకీక్కడ
దైనందిన జీవనాధారం:

చెడురక్తాన్ని స్వీకరించి
జీవన యంత్రాన్ని నడిపే
మంచిరక్తాన్ని బహూకరించే
గుండెకాయ లాగ:
కాల్‌చెక్స్ క్యాంటీన్‌లో
ఐస్‌క్రీం తిన్నవాడు
విశాఖపట్నం మాధుర్యం
ఎన్నటికీ మరువలేడు.

ఇక్కడేఉందొక "నేవల్ యూనిట్"
'భారత నౌకాదళ శిక్షణ కేంద్రం'
పవిత్ర భారత తీరాలను
ప్రాణప్రదంగా రక్షించడానికి
నౌకాబలంలో చేరిన
యువకవీరుల శిక్షణ కేంద్రం.
తెల్లని పావురాల్లాంటి
ఆ నౌకాబల బాలవీరులు
విన్యాసం చేస్తున్నప్పుడు
శాంతి వెల్లివిరిసినట్లుంటుంది.

ఊరికి పశ్చిమాన
ఉన్నాడు 'సింహాచల అప్పన్న'
అందరికీ కావలసిన దేవుడు
ఆపత్కాల బాంధవుడు,
చల్లని కొండమీద కూర్చుని
సహస్ర వసంతాలుగా,
పేదలకూ, సాదలకూ
పెద్దలకూ, పిన్నలకూ

కాల నడిచి వెళ్ళేవాళ్ళకు
కార్లల్లో పోయేవాళ్ళకు
అందరికీ అందుబాటులో ఉన్న
అద్భుతమైన దేవుడు
చందనం మైనిండా పూసుకున్న
సుందర వరాహ నరసింహుడు -
ఈ స్వామికే శ్రీకృష్ణదేవరాయలు
రత్నాభరణాలు సమర్పించాడు,
కళింగదేశాన్ని జయించాడు.
అనేకమంది మేధావులు
అధ్యక్షులుగా వెలసిన
ఆంధ్ర విశ్వవిద్యాలయం
అలంకారం ఈ నగరానికి

ఓ ప్రక్క సాగర గంభీరత్వాన్ని
మరోప్రక్క కొండల ఔన్నత్యాన్ని జీర్ణించుకొని,
విజ్ఞాన సౌరభాల్ని వెదజల్లుతూ
శాఖోపశాఖలుగా విస్తరిస్తున్న
విశ్వకళావిజ్ఞాన కల్పతరువు

విద్యామహా సాగరాన్ని మధిస్తున్నారు
విజ్ఞానసుధాభాండాల్ని వెలువరిస్తున్నారు
వివిధకళారమల్ని ఆరాధిస్తున్నారు
భావిభారత నిర్మాణానికి
బాటలు వేస్తున్న రిక్కడ?

విశాఖపట్నం మాట వచ్చినప్పుడు
విస్మరించడానికి వీల్లేంది
'కింగ్‌జార్జి హాస్పిటాల్,
చావులకు పుట్టుకలకు సామాన్యమైన చోటు

స్వర్గమూ, నరకమూ కలిసిమెలిసి సంచరించే చోటు
వందలాది డాక్టర్ యోధసీయోధులు
ఎందరెందరివో ప్రాణాలు రక్షించడానికి
యమునితో దివారాత్రాలు
సంకులసమరం చేస్తుంటారిక్కడ ?
కాలపాశాన్ని "స్టెతస్కోపు"తో ఎదిరించి
మందు, గుండు, అస్త్ర, శస్త్రాలు ప్రయోగించి
సోరాడుతుంటారు నిరంతరం:
విజయం యమునిదే ఐనప్పుడు
వీరస్వర్గం పొందుతాడు రోగి.

చెప్పడం మరిచాను
చేపలవాళ్ల సంగతి
అందమైన చందమామ ముఖంలోని
నల్లని మచ్చలవలె
అక్కడక్కడ ఉన్న మురికి పేటల్లో
గాలీ వెలుతురు దర్శనమీయని
గుడిసెల్లో గదులయెదల్లో
ఉంటారు వీళ్ళు,
సముద్రం ప్రక్కనుంటేనే గాని
బ్రతకలేనివాళ్ళు—

సాహసించి
పందెపు గుర్రాల్లా పరుగెత్తుకొనివచ్చే కెరటాలపై దూకి,
సాగర గర్భంలోకి స్వారీకదులుతారు వీళ్ళు :

అడవిలోని జంతువుల్ని
కడలిలోని చేపల్ని
వేటాడుతాడు మానవుడు,

మానవుణ్నే వేటాడుతుంది మృత్యువు ;
లోకంలో వేల వేల వేటలు
అన్నీ మృత్యుముఖంలోనికి బాటలు ;

విశాఖపట్నం జీవితం
విచిత్రంగా ఉంటుంది.
అందమైన పరిసరాలు
అవసరమైన సరదాలు
అన్నీ వున్నాయిగాని—
పచ్చనోట్లు జేబులో ఉంటేనేగాని
పచ్చిమంచినీళ్ళు కూడ పుట్టవు ఇక్కడ ;

కాపురాలు పెట్టడానికి కావలసిన ఇళ్ళుదొరక్క
పుట్టింట్లో భార్యాపిల్లల్ని వదలిపెట్టి
హోటకూటి ఇళ్ళల్లో భోజనాలు సహించక
పక్క యిళ్ళ కిటికీలకేసి
పళ్ళరసాలు మింగుతూ చూసేవాళ్ళు
విశాఖపట్నం అంటే కాస్తా
విసుక్కోవడం సహజం ;
కూడు సమస్యకంటే ఇక్కడ
గూడుసమస్యే దొడ్డది ;
పెరిగిపోతున్న జనాభా తెచ్చిన
పెద్ద సమస్యల్లో కలా చెడ్డది

ప్రజల్లో వేలరకాలు ఉన్నారు.
కూలీనాలీ చేసుకొనే వాళ్ళు
పరిశ్రమల్లో, చెమటోడ్చే కార్మికులు
వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు

అందులో, ఎన్నెన్నో అంతస్తులు-
పస్తులుండే వాళ్ళుంటారు
మత్తుగా తినేవాళ్ళుంటారు
ఎంత కలిగినా తృప్తిలేక
ఏడ్చే వాళ్ళు కొందరు
ఉన్నా లేకున్నా హాయిగా
ఉండే ఆశాజీవులు కొందరు
అందరి జీవితాల్లోనూ
ఏదో ఒక
అందమూ ఆనందమూ ఉంది
సాధక బాధకాలు కూడా
సమానంగానే ఉంటాయి అందరికీ
అసమానత మాసిపోతేనే
అందరికీ నిజమైన ఆనందం
కావలసినన్ని క్లబ్బులున్నాయి ఇక్కడ -
పగలంతా పనిచేసి అలసిన పెద్దవాళ్ళు,
భగవంతుడిచ్చిన డబ్బుగలవాళ్ళు,
తమ సమస్యల బరువుల్ని దించుకోవడంకోసం
తరగిపోయే యౌవనాల్ని పుంజుకోవడం కోసం
బ్రతుకు 'బ్యాటరీని' మళ్ళీమళ్ళీ 'చార్జి' చేసుకోవడంకోసం
కావలసినన్ని "రిక్రియేషన్
క్లబ్బు" లున్నాయిక్కడ,
బ్రతుకు బాధల్ని విస్మరించి
ప్రమోదాల సుధల్ని సేవించి
పరవశులై ఆడుతారు
ఎదలు విప్పి విప్పి పాడుతారు
ఇంద్రలోకాన్ని క్షణకాలం
ఏలుతూ ఉంటారు.

చెప్పాలంటే గ్రంధం చాలాఉంది

ప్రతి వస్తువులోను కవితా సౌరభం ఉంది

మళ్ళీ మనం కలిసికొన్నప్పుడు

మాట్లాడుదాం అన్ని సంగతులూ

మరి, సెలవా —

ఏపంగి పొద్దులు

—రంధి సోమరాజు

ఎనకేపు మల్లెపూ లందం సూత్తే
ఓ రి దేముడోయ్
ఆ మొగా న్నదేటో
వో సూడా లనిపిత్తాది
సూత్తే యేటుంది
ముసిని పిక్కల ముసీలి మొగం
పెట పెట లాడుద్ది ఎండనా.

కూత్తూన్న కోయిల
సెట్టు కొడ నిలేత్తాది
యిని యిని
వో సెట్టయితే సా లనిపిత్తాది.

సిరుగాలి తగిల్తే సాలు
వొంటి కేటీ తెలీదు
సెక్రవొర్తినా
దాన్ని దోసెయ్యా లనిపిత్తాది

సీక టడక ముందు
వొల్లమాలి నన్ని రంగులు
పడమ టేపు
వొయ్యారా లొలక బోత్తే

యేటీ సెయ్యి బుద్దెయ్యదు
అటే సూత్తూ కల్లూ వొల్లూ
సంటోణ్ణి కూడ
సూడ మర్సిపోతాయ్.

పొద్దుటేల గట్టిన బట్ట
పొద్దు గూకే తలికి
మట్టి గొట్టుక పోయి
సెమట కంపుతో
కడుపు తీప్పేసినాది
వొంటి మీ దింత గుడ్డ ముక్కంటే సాలు
పేనానికి సాలొత్తాది
ఎటా ఇట్ట పత్తున్నాడో యేమో
కానిట్టేబులయ్యా

గొడ్డు సెర్మంనాటి కాకి గుడ్డలు
అంతేనే తిండికోసరం
సీదర మొయ్యికేటి సేత్తాడు.

సెమటతో తడ్సి నొల్లి
వోనలో తగలడే
పెట్రోలు బంకునా
మండుద్ది
వోడు సయించగల్డు
ఆ తాటాకుల మంట.

ఇసినికర్ర మీద నీలు జల్లి
బాబు కిసిరే బుడ్డోడు
ఆటల కెగి రెల్లా లంటే

కుదుర్తా దేటి ?
అటూ ఇటూ కదుల్తూ అలయ్యా
'ఏరా...ఇర్రవేరా...' అంటూనే వున్నాడు.

పిల్లలకి ఎండా నేదు కొండా నేదు
గోదాటో ములిగి ములిగి
ఆ తల్లి సల్లంగ ముద్దెట్టు కోని
సక్కలిగింత లెడ్తే
కతలు సెప్తారో యేమొ....
యిల్లే మర్సిపోతారు

వొల్లు బిర్సెక్కి పోనాక
సొక్కాలతో తలతుడ్సేసు కోని
యెండలో పడి
నిక్క బొడ్సుకున్న ఎంట్రుకలతో
ఎర్రని కల్లతో
ఇంటి కొత్తారు ఎర్రి నాగమ్మలు
ఎండ దేవుళ్ళు.

అమ్మ మాటినుర్రి అయ్యమాటినుర్రి
సూరిదేవుడి సిట్టి బుల్లోళ్లు
కొడతాకి సేతులెటొత్తాయి
ఎల్తురు బొమ్మల్ని ?

తిండి తినుర్రి
"వో" నీలు తాగేత్తారు
కూడా నీలంటె
మా సెడ్డ మోజు.

కుర్ర నాగమ్మల వొల్లి
మూకలు కూడునా పేలిపోద్ది
మంచి గండు సెక్క
అరగ దీసి పామితే,
తల్లిచుట్టూ గందం బొమ్మల్లా
గెంతు లేతారు

పనస పిక్కల్లాగ
పెగ్గడ్డ లేత్తె
కూదొండేత్తాం అని
పెద్దోలు: పిల్లల్ని
ఆట పట్టిత్తుంటారు

పొద్దు గూగ్గానే,
యిన్ని వుడుకు గెంజినీలు
వుప్పేసుకోని తాగితే
వొడదెబ్బ
దా నబ్బని కల్సుకుంటాది.

పల్లని సీడల్లో
కొబ్బరాకులు సాపెట్టి
దాసిన పెంకాయలు
సెక్కుకోని తాగితే
పేనాలు లేసొత్తాయ్....
నోటో ఏసుగుంటే సాలు
మీగడ్లాటి నేత కొబ్బరి
అమ్మ మనసునా కరుగుద్ది

తాటి ముంజి లెన్నితిన్నా
ముద్దు లేనా వొద్దంటాది కాని
ఆటి వొద్దనదు పేనం.

వుప్మా కారం ఏసి
జీడి మామిడి పల్లు
తింటా వుంటె
మూడో రేత్రి
ఆలి కోసం
తొక్కిస లాడే వొల్లునా
నో రూరుద్ది.

సవ్వగా వున్నా
పుచ్చకాయలు
నాలిక పెడార్సుక సావకుండా
సూరీడు కే దావత కట్టిత్తాయ్

సెక్కేసి వుప్పు నీలతో కడిగేసి
అనాస కాయ ముక్కలు కోసుకోని
పంచదారలో ఏసి నాలిక మీ దెడితే.... వాఁ
ఎల్లవే ఏసంగీ
మా దగ్గర కాదు నీయేసాలఁ
అనా లనిపిత్తాది

పంచదార కత్తి నోటి తించే
సాల్దేటి జల్మకి? అదేటి కర్మో
యీ జెల్మలు మిగల్సాలనో యేటో
ఆ వొక్కటీ పికరు నేకుండా వుంది.

మామిడి పల్లు మారాజులకే
ఆటి కరీదు
సూరీడు నా మ్మండుద్ది.

మామిడి కాయ ముక్కగొడ్తూ
ఏలు తెగ్గోసుకోని
ఆవకాయ రుసులు
గేపకాని కొత్తే
ఏలు సంగతే మర్సిపోతాడు
ఆవకాయ బుల్లోడు

సపోటా పిక్కల్లాటి కల్లు
తిప్పి తిప్పి సూత్తే
సిన్నది
సపోటా నాగుంది.

మామిడి కాయలోని జీ డెట్టి
గోడల్నింద కుర్రోలు
పిచ్చిగీతలు గీత్తే
ఎండలికి కల్లు పచ్చగిల్లి నట్టుంది గోడ.

ఎండని సూసి కంసాలోడు
కరుగు తూన్న బంగారం నా గుండెహో అన్నాడు
నగలు చేసి ఆడి సెల్లి కెడతాడేమో

అదేదో
దుడు లే నోడి యింటి ముందు
అయిరాన సేసే
రాకాసి పన్నుల కలకపేరునా
యెగదోసు కొత్తాది యెండ.

వట్టేళ్ళ తడకలు కట్టుకొని
నీలు జల్లించు కుంటూ బలిసి నోలు

పంకా లేసుకోని
మద్దేన పేల
పైతుగా కుసుకుతా రిల్లల్లో
డబ్బునోన్నలకి కాలం బలాదూరె హె

నీ లెండ బెట్టవేం అని
వోడో సూరీడు నెత్తిమీద కూసోని
గొడ్డును బాదినట్టు బాదుతా వుంటే
యెండ సినోన్నిడు
వొగుర్తూ యిడ్సిన గాలే నంట
యీ వొడ గాడ్పు.

రైలింజిన్లో పోరుమేను
వో సిన్ని నిప్పుగడ్డయ్యుంటాడు
నేకపోతే ఆ డా నిప్పులు మద్దె
యీ గాడ్పుల మద్దె
బత గ్గల్దేటి ?

యెండలో బడి
తోటకూర కాడల్లాటి కుర్రోలు
సినేమా బొమ్మల్ని
మొయ్యినేక మొయ్యినేక
సచ్చి యీదీది తిప్పుతా వుంటె
అందరికల్లూ ఆ బొమ్మలేపే
కుర్రో లేపు సూసే కన్నె నేదు
అందుకే సూరీడు
అందర్నీ యిటా యేపేత్తున్నాడు.

ఏడికి సైకిలు పేశీలు
కరిగిపోయి
సెక్రాలు తుస్సున
బొక్కా నోరున సప్పడి పోనాయ్

లారీ డ్రైవోర్లు
యెండకి తాలనేక
అడు గడుక్కా
కూ ల్డ్రింకులు పట్టేసి
బతికి పోనారు
సిన్ని తువాలు తడిపేసి డ్రైవోరు
సెవులికి సుట్టుకుంటె
శెనంలో అది పూతరేకునా
మొరమొరలాడి పోనాది

బెడ్డ బెడ్డకీ సెంబుడేసి నీలు తాగి
తాపీవోడు యిల్లు కడతా వుంటే
గోడలకి నీలు సాల్డంనేదని
అలోపొలో మన్నా డాసామి.
పేనాలు కన్న యిల్లే సిరకాలం మన్నుద్దిగా మరి.

బోయిలేరులో నడ్సెల్తున్నట్టుంది
రామసింద్ర పెబో
యెండలో నడక.

కన్నంలో వుడికి వుడికి తేలు
గా లేత్తాదని గోడెక్కా తే
సూసుకోకుండ బుల్లోడు సెయ్యేసినాడు
యింకేటుంది

సటుక్కున కసిదీర కుట్టేసినాది
ఎర్రని ఎండనుకోని ఆ సెయ్యి

రేత్రైతే సెక్కేసి ఆల్లో వుక్కతో
ముక్క సెక్కలై పోతారు
వొల్లంతా యేర్లై సెమట
సొక్కాను సెర్మానికి మే తెట్టి
జిగటనా అంటేసుక పోద్ది
సెర్మంలోంచి సెగలు
యెసర్నా ఎగదన్ను కొత్తాయి
యింకేటి సల్లార్తాది మంట
కావేసినట్టు మగ్గిపోతారు
ఎండల్లో మద్దేనపేల
బొమ్మలాట సుఖం అంటే యిదే
సుఖంనేక పోగా
ఇల్లకొడ పెల్లాలు
కుక్కల్లా సుట్టకంపోసన
పసిగట్టేసి
సూరెగర గొట్టేతారు

వో కుర్రోడు
సరదాకి సానింటికెళ్తే
ఏటో సుఖంగానేదు
పొమ్మందుట
వొల్లమ్ముకునే వోలికీ
కట్టంగానే వుందికాలం

యిల్లల్లో పెల్లాలు
పాములిన్ని సూసినట్టు

దూరంగా సత్తారు
పున్నెముండి వోనోత్తేసాలు
పేనాలు పేనాలు
కలేసుకోని
ఎయ్యేళ్ళు సుకం
యెన్నెలొద్ది,
యేటొ అంత వుడికి సతేగాని
యింత సుకం కల్సి రాదేమొ.

గాలి నేక ఈదుల్లో
వొళ్ళొక్కాసి వొంటిమీద గుడ్డొక్కాసి
వొయ్యారా లోతే
తెల్లార్లు యీది దీపాలు
ఆ దీపమొల రొమ్ములేపు
రెప్పార్పకుండ సూసి సూసి
మొగుడు సూరీ డొత్తున్నా డని
పటుక్కున్న దొంగకుర్రోల్లా
కల్లు మూసేసినాయి.

మారంగుల సోకు సూడు సూడని
వో వూరేగిన కోట న్సాకులు
పొద్దోయే తలికి పల్లు బయిటెట్టి మాడి సచ్చాయి
సూత్తున్న పచ్చని జామాకు
జామి నవ్వే నవ్వింది
సోకు సూసుకోని కోటన్సాకు లికిలిత్తే
బలం వుందని జామి యిరగబడింది
బలం లేనోల్ని సంపిన యెండ

బలం వున్నోళ్ళి యే టీ సెయ్యినేక
ముసిలికుల్లు మురుగు రగతం నవ్వు
నవ్వనేక నవ్వనేక సచ్చింది.

రేతి రంతా నిద్ద రోనీకుండ
రంకు మొగుడ్నాగ
యాది కుల్లు కొల్వ
మద్దె మద్దెన పిల్లగాలికి లెగ్సి
పేనాలు తోడేసింది
పిల్లగాలి సుకం
కుల్లు కొల్వలకే అయ్యింటాది.

హోరున సినిమాజనం
ఆలసరదాల్లో ఆలు
యికీ లింతలు సికిలింతలతో
ఈదులంట ఎల్లిపోతూ

బందిపోటు దొంగల్లా
దోసుకు పోనారు
ఆలకిలేని కునుకు సుకం
బైటోలకుండ గూడదన్నట్టు.

మద్దెమద్దెన లారీలు కార్లు
రాచ్చసి కల్లతో
సూరీడు నాగ
కునికీ కునకని కల్లని పొడ్సి
రెప్పల వెలుతురు దగ్గెట్టేసి
నడి ఏసవి పగలుకాదు
రేత్రే అన్నై.

కోడినాగ యింత కునుకు
కునికేతలికి
ఇగసాలు 'లే' అన్నట్టు
యిట్టేసుకం తెల్లారిపోనాది.

బతుకులో సుకం సిటికేడేనేమొ
తెల్లారగట్ట శీతగాలి కొట్టి
పేనానికి పేనమయింది

ఆ సుకం సూడనేక
కడుపుబ్బి
పుచ్చకాయి గింజల్లా
పుట్టె డీగలు
మీదనోలి
సీకాకు పెట్టేసినై.

ఇక నాబం లేదని అయ్యిగోరు
యింట్లో కెత్తే
రేతి రంత కైదు సేసేసి నారని
కుత కుత వుడికి పోయి
మొగంమీద అరిచేత్తో కొట్టినట్టు
ముక్కుమీద ముక్కింది ముక్కుగాలి.

ఆ కంపు నెట్టాగో సయించి
బాబుగారు పంకా ఎట్టు కుంటే
శేనంలో పిల్ల రక్కేసినట్టు
ఏడిగాలులు రక్కేసి వొదిలైన

ఈ సావు సావనేక అయ్యిగోరు
సన్నీలతానం సేసేతలికి

పేనాలు లేసొచ్చినై గామోసు
'హమ్మయ్య' అన్నారు
అలాటి పలుకెప్పుడోగాని పూడి పడదంట
అదేనంట సొరగం.

గాలికి గోడలంటే
మా సెడ్డకోపం మడ్సులికి గోడలంటే
మా సెడ్డ యిట్టం
వుడకమోతకి గుడ్డముక్కలంటే ఆశేయం
గుడ్డ నేకపోతే నోకాని కశేయం
అందుకే నొరే
సుకాలకీ ఆశేయాలకీ సుక్కెదురు.

సల్లని సూపుల్తో, ఏకాసులు సేసి
ఆనక రాకాసుల్లా కయ్యాలాడే
ఆడంగులికీ ఏసంగికీ
యేటీ తేడా నేడు
వోరున వోన కుర్సినప్పుడెల్లా సల్లంగవుంటదో
యెండెక్కితే సాలు
అంత మండుకపోద్ది.

వొలంగా బల్సినోలు
తొడలు కొట్టుకపోయి
సవాయి తగులుకున్నోల్లా
నడుత్తారు
ఆల్ని సూత్తే
వుత్తినే నవ్వొత్తాది

మేదరపేట తగలడి
తుర తుర బుగ్గయిపోతే ...
బుగ్గి మీదయిన్నీ నీలు జల్లి
మీసాలెగ దువ్వేయి.
ఈదు లంట సెవులు సిల్లు లడేలా
గంట లోయిచ్చు కుంటూ
ఆవు రావురని యిరగబడ్డ నీలకార్లు,

కొలిమి కాడ తిత్తూదే కుర్రోడు
సొమ్మసిలి పోనాడు
"అమ్మ .. అనికూడ అననేదు

సెప్పు ల్లేకుండా రోడెసేవోల్ని సూసి
తారుతో కరిగి
డబ్బాలోంచి సుక్కలు సుక్కలుగా రాలి
ఏడ్సింది ఎండ

సెక్రాలు తిప్పే సెల్లెమ్మ
సెక్రంతోనే తిరిగి పోతూన్నట్టు
కల్లు తిరిగి పడిపోనాది

అయిసుపూటు లమ్ముతూ సిట్టి తండ్రి
అమ్మ కడుపులో సిచ్చెట్టి
వొడ దెబ్బకు రాలి పోనాడు.

యిసక తిప్పలతో
బయటడ్డ గోదావరి
యెట్టాం టోలకేనా
తిప్పలు
తప్పవన్నట్టుంది.

పిట పిటలాడే సాకలి సిన్నది
వొయ్యారం వొల్లైంది
రేవు కాడ లైకిసి రేసి
వున్న వోయిల సీ రిప్పకుంద
సీలల్లో ములిగి
మునేల మీద గట్టెక్కితే
ఓరి నాయినో ఎయ్యికల్లు సాలవ్
పొరలు పొరలుగా
తడి వొదుగుళ్ళ సీర నలుగుళ్లు
సెర్మాన్ని సుట్టేసుకోని
బిగువుల్ని సూపితే
సిగ్గేసి సిన్నది సిన్న నవ్వు నవ్వితే
ఛన్....ఆ నవ్వునా ఎలగనేక పోనా నని
సూరీడు సిగ్గుతో సత్తా డంతే.

కవుల పరిచయము

(మొదటి భాగము)

డా॥ ఎస్. వి. జోగారావు

జననం : 2-10-1928

అనేక గ్రంథాలు రచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆంధ్ర సంగీత నాటక అకాడమీలచే సత్కరించ బడ్డారు. లెనిన్‌గ్రాడ్ యూనివర్శిటీలో 1965 67 వ సం॥లలో తెలుగు అధ్యాపకులుగా వున్నారు. ప్రస్తుతం గుంటూరు పోస్టు గ్రాడునయేటు సెంటరులోతెలుగు అధ్యాపకులుగా వున్నారు.

డా॥ ధూళిపాల శ్రీరామమూర్తి

జననం : 13-10-1918

భాగవతము మీద పరిశోధన చేసి డాక్టరు పట్టము పొందారు. అలంకార శాస్త్రములో మంచి ప్రవేశము కలదు. 1954, 56 సం॥లలో వీరి నవలలు ప్రథమ బహుమతి నందుకున్నాయి. నలగొండ ప్రభుత్వ ఆర్ట్సు కాలేజీలో తెలుగు శాఖ ప్రధానాధికారిగా వున్నారు.

డా॥ కె. సుప్రసన్నాచార్య

జననం : 17-3-1936

ముప్పయి పరిశోధనా వ్యాసాలు, అనేక గ్రంథాలు రచించారు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురించిన వసు చరిత్ర సంపాదకత్వం వహించారు. వరంగలు పోస్టు గ్రాడ్యుయేటు సెంటరులో అధ్యాపకులుగా వున్నారు.

డా॥ చాగంటి గోపాలకృష్ణమూర్తి

జననం : 1926

1962 లో వీరు రచించిన "హేమమాలిని" ఆంధ్ర విశ్వవిద్యాలయం పాఠ్య గ్రంథంగా ఎన్నికచేసింది. రాజమండ్రి ప్రభుత్వకళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా వున్నారు.

శ్రీ కోవెల సంపత్కుమారాచార్య

జననం : 26-6-1933

భాషా ప్రవీణ. ఛందోవికాస గ్రంథకర్తలు. ఏభయికి మించి పరిశోధక వ్యాసములు వ్రాశారు. లక్షణసార సంగ్రహమునకు సంపాదకులు. జగిత్యాల ప్రభుత్వ కళాశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా వున్నారు.

శ్రీ పేరాల భరతశర్మ

జననం : 7-2-1933

'అవధాన సరస్వతి', 'అష్టావధాని, అను బిరుదులు పొందారు. 'మధురావిజయము' అను చారిత్రాత్మక నవలకు 1969 లో తెలుగు అకాడమీ బహుమతి లభించినది. కడప ప్రభుత్వ కళాశాలలో సంస్కృతోపన్యాసకులుగా వున్నారు.

శ్రీమతి మల్లాది సుందర

జననం : 1-11-1935

ఈమె రచించిన 'తంజావూరు పతనము', 'సప్తపర్ణి' అను నవలలు ఆంధ్ర విశ్వ విద్యాలయము ఉత్తమములుగా ఎంచి బహూకరించినది. వీరి రచనలు అనేకం ఆంధ్ర విశ్వవిద్యాలయములో పాఠ్యగ్రంథములు,

విద్వాన్ విశ్వనాథ వెంకటేశ్వర్లు

జననం : 5-3-1901

వీరి కవిత- "కాళిందీ పరిణయము"కు ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ బహుమానం లభించింది. వీరి కలంనుండి వెలువడిన 'దక్షిణేశ్వరము' ఆంధ్ర విశ్వ విద్యాలయ పాఠ్యగ్రంథము.

శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి

జననం : 4-8-1912

వీరి కలము పేరు "కరుణశ్రీ". అలంకార శాస్త్రము వీరి అభిమాన విద్య. కవితలు, వచన రచనలు, నాటక రచనలు అనేకం వీరి కలంనుండి వెలువడ్డాయి. వీరి రచన 'ఉదయశ్రీ' నలభై రెండుసార్లు ముద్రితమైంది. గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో ఉపాధ్యాయులుగా వున్నారు.

శ్రీ దాశరథి

జననం : 10-1-1927

తెలుగులో ప్రసిద్ధుడైన కవి. వీరి 'కవితాపుష్పకం' 1967లో ఆంధ్రసాహిత్య అకాడెమీ బహుమతి నందుకొన్నది. వీరి 'మీర్జాగాలిబ్ గీతాలు' ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము ఉత్తమ అనువాదంగా పరిగణించి బహూకరించింది.

శ్రీ కరుటూరి సత్యనారాయణ

జననం : 18-2-1924

రచనా శిల్పములో సిద్ధహస్తులు. సాహిత్యమందు, చరిత్రయందు విశేషప్రవేశము కలదు. అనేక గ్రంథకర్తలు. వీరు రచించిన "కరుణాసౌగతము" ఆంధ్ర, కర్నాటక విశ్వవిద్యాలయములచే పాఠ్యగ్రంథముగా ఎన్నికయినది. రాజమండ్రిలో విక్రయపు పన్ను అధికారిగా వున్నారు.

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

జననం : 5-3-1920

తెలుగు, సంస్కృత భాషలలో పండితులు. ఆంధ్ర పత్రికకు కొంతకాలం సంపాదకులు. వీరు రచించిన "ఆంధ్ర పురాణము" 1967లో ఆంధ్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందినది. నేటి ఆంధ్ర మహాకావ్యములలో ఉత్తమమైన వాటిలో నొకటిగా ఇది పరిగణింపబడుచున్నది. రాజమండ్రి వీరేశలింగం, హైస్కూలులో పండితులుగా వున్నారు.

శ్రీ నాయని సుబ్బారావు

జననం : 29-10-1899

ఒక విశిష్టమైన శైలిగల కవి. బహు కావ్యములు రచించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రత్యేక సభ్యులు.

శ్రీ ద్వివేది సత్యనారాయణ సూరి

జననం : 18-6-1918

ఉభయ భాషాప్రవీణ. 'కవిరత్న' బిరుదాంకితులు. వీరి శైలి విలక్షణమైనది. అనేక గ్రంథములు రచించారు. మద్రాసు, ఒరిస్సా, ఉస్మానియా విశ్వ విద్యాలయాలలో వీరి రచనలు పాఠ్య గ్రంథాలుగా ఎన్నికయినవి.

శ్రీ మోటూరి వెంకటరావు

జననం : 1921

అనేక భిన్న ఛందస్సులలో "పద్మినీ భాస్కర" మను గ్రంథము రచించారు. వీరి రచనా శిల్పము నిగూఢమైనది. ముద్రితములు, అముద్రితములు వీరి రచనలు పన్నెండుపైగా వున్నవి.

శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి

జననం : 22-2-1918

కవికిశోర, కవిసామ్రాట్, కవిరాజ, మహోపాధ్యాయ, బిరుదులు పొందారు. సువర్ణ ఘంటాకంకణము స్వీకరించారు. పాతికపైగా గ్రంథములు రచించారు. సాహిత్య అకాడెమీ కార్యనిర్వాహక సభ్యులు.

శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి

జననం : 15-8-1908

మహాకవి బిరుదు గ్రహీతలు. వీరిని ప్రౌఢకవియని చెప్పవచ్చు. సంస్కృతమునుండి కొన్ని కావ్యములు అనువదించారు.

డా॥ ప్రసాదరాయ కులపతి

జననం : 23-1-1937

అవధాని శేఖర, ఆశుకవి కేసరి, ప్రౌఢభారతి; కవితా సుధాకర, సరస్వతీ కంఠాభరణ—ఇవి వీరి బిరుదులు. స్వర్ణఘంటా కంకణము, గండపెండేరము మొదలైన సత్కారములు పొందారు. గుంటూరు హిందూ కాలేజీలో ఉపన్యాసకులుగా వున్నారు.

శ్రీ బీర్నిడి ప్రసన్న

జననం : 15-8-1917

ఈయన హరిజనులు. వీరి శైలి సౌకుమార్యము, ప్రౌఢియు కలిసిన ఒక విలక్షణత కలిగినది. వీరి రచనలలో పేర్కొన దగినవి పృథ్వీ భాగవతము, మధుమాసము, ముద్రితములు, అముద్రితములు అనేక గ్రంథములు రచించారు.

శ్రీ జంధ్యాల జయకృష్ణ ప్రసాద్

జననం : 5-5-1948

విద్యార్థిగా అనేక బహుమతులు అందుకున్నారు. శ్రీనాథుని కవిత్వము గూర్చి పరిశోధన చేశారు. 1972 నుంచి గుంటూరు హిందూ కళాశాలలో వున్నారు.

శ్రీ గంధం సుబ్బారావు

జననం : 15-2-1952

'బాలచంద్రుడు,' 'వీరాభిమన్యం' మొదలైన ఖండ కావ్యాలు రచించారు. పిరి కవిత 'కోకిల' 1971 లో రచించినది, విద్యార్థి.

శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

జననం : 3-10-1957

సంస్కృత పండిత పుత్రులు. వీరి కవిత "ఆదికవి ఆవేదన" 1972 లో రచించినది. విద్యార్థి.

శ్రీ రావికంటి వసునందన్

జననం : 15-3-1947

వీరికి కవిత్వం, వ్యాసరచనలలో రుచి. వీరి గద్య కవిత 'రతీ ప్రద్యుమ్నుడు' ఆంధ్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందింది. "మానవ" 1971లో రచించిన కవిత. ఉస్మానియా విశ్వవిద్యాలయ గణిత శాఖల్లో వున్నారు.

శ్రీ నోరి సత్యనారాయణ

జననం : 14-5-1949

వీరి రచనలలో పేర్కొనదగినది, 'రాగ రంజని'. 'వసంతము' 1970 లో రచించిన కవిత.

[రెండవ భాగం]

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

జననం : 30-11-1897 కవి పండిత కుటుంబములో.

గేయ శిల్పానికి ఆదర్శప్రాయులైన నేటి గేయ కవులలో వీరిది అద్వితీయ పీఠం. ఈయన కృతులలో కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి మున్నగు కవితా సంపుటాలు, శర్మిష్ఠ, విద్యాపతి, విప్రనారాయణ మొదలయిన సంగీత నాటికలు, మాళవిక మున్నగు యక్షగానములు, గోదాదేవి సప్తపదులు ఆధారముగా గూర్చిన గేయ కావ్యము ప్రసిద్ధమైనవి. అతిలోకసుందరమైన కల్పనలకు, కోమల పదాల శిల్పానికి వీరిది అందెవేసిన చెయ్యి.

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

జననం : 25-12-1901

'కళా ప్రపూర్ణ' బిరుద గ్రహీతలు. వీరి "మహాత్మ కథ" కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమానం పొందింది. వీరి కవితలలో "ఆత్మకథ", 'సర్వోదయ గానం,' "ఉదయగానం", పేర్కొనదగినవి. కనకాభిషేక, వీర మంజీర, గజారోహణ. స్వర్ణకంకణములు — ఆంధ్రులు వీరి కొసగిన సత్కారములు.

స్వర్గీయ కాటూరి వెంకటేశ్వరరావు

జననం : 15-10-1895

కవిత్వ, నాటకరచనలలో సిద్ధహస్తులు. వీరి రచనలలో పేర్కొనదగినవి "గుడిగంటలు" 'స్వప్న వాసవదత్త' 'తొలకరి'. రీతి సాంప్రదాయికమైనా ఈయన భావనలోనూ, ఇతివృత్త సేకరణలోనూ నవకవితా మార్గదర్శి. కవనధార సరళమై, అనర్గళమై వుంటుంది.

స్వర్గీయ గుఱ్ఱం జాషువా

జననం : 28-10-1895

ఉభయ భాషా ప్రవీణ, నవయుగ కవి చక్రవర్తి, బిరుద గ్రహీతలు. ఇరవైకి పైగా గ్రంథాలు రచించారు. 'ఖండ కావ్యములు', 'పిరదౌసి' వీరి రచనలలో ఎన్నదగినవి. ఆంధ్రప్రదేశ్ కేంద్ర సాహిత్య అకాడెమీల బహుమతుల నందుకున్నారు. 'పద్మశ్రీ' బిరుదాంకితులు.

శ్రీ పుట్టి పర్తి నారాయణాచార్య

జననం : 28-3-1914

'మహా కవి', 'సరస్వతీ పుత్ర', 'పద్మశ్రీ' బిరుదాంకితులు. నూటికి పైగా రచనలు చేశారు. పదునాలుగు భాషలలో ప్రవేశము కలదు. వీరి రచనలు అనేకం ఇతర భాషలలోకి అనువదించ బడ్డాయి. విజయనగర చరిత్రగూర్చి విశేష పరిశోధన చేశారు.

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు

జననం : 2-1-1910

'మహాకవి' బిరుద గ్రహీతలు. వీరి "మహాప్రస్థానం" పన్నెండు మార్లు ముద్రితమైంది. అనేక భాషలలోనికి అనువదించబడింది. వీరి "ఖడ్గ సృష్టి" 1966 లో సోవియట్ భూమి పురస్కారం అందుకుంది. వీరి గేయాలు, నాటికలు అశేష ఆంధ్రప్రజా ప్రశంసలను పొందాయి. ఆంధ్ర విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షులు.

స్వర్గీయ దేవరకొండ బాలగంగాధర తిలక్

జననం : 20-8-1922

యువ తరానికి చెందిన కవి. మధ్య తరగతి మానవుని జీవితంపై వచన కవితలో ఈయన తొక్కినదారులు యువకవులలో వీరికి ఒక విశిష్ట స్థానాన్ని కల్పించాయి. అనేక కవితా ఖండికలు, రెండు కథా సంపుటాలు, రెండు నాటకాలు రచించారు. కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి నందుకున్నారు.

డా॥ సి. నారాయణరెడ్డి

జననం : 1-7-1931

ఆధునిక గేయ కవులలో ప్రముఖులు. వీరి రచనలలో పేర్కొన దగినవి 'నాగార్జున సాగరం', 'కర్పూర వసంతరాయలు', 'రామప్ప'. వీరి "ఋతు చక్రం" ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతి నందుకుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులు.

శ్రీ జె. బాపురెడ్డి

జననం : 21-7-1936

తెలుగులో ఎన్నదగిన యువకవి. అనేక కవితా సంపుటాలు, పద్య గద్య కావ్యాలు రచించారు. 1971 లో వీరి కవితా సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతి లభించింది. హైదరాబాదు ప్రభుత్వ శాఖలో డిప్యూటీ కలెక్టరుగా వున్నారు.

శ్రీ రంధి సోమరాజు

జననం : 10-3-19[illegible]7

కవితలే కాక, అనేక నవలలు, కథానికలు, గేయనాటికలు రచించారు. వీరి రచనలలో పేర్కొన దగినవి 'ఆదర్శాలు - అవరోధాలు' (నవల), 'రతనాల తండ్రి' (గేయనాటిక).

170

Check List

Book Number	MB01H130	Date	22/11/2021
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CI, xii, 158, 169 iv		
Missing Pages	NO		
Prepared By	Ch. Ramya	Cutting By	Ch. Ramya
Scanned By	Ch. Ramya	Pages	185